# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

**శుక్రవారం, జనవరి 17, 2014**

**13 వ శా. స. XII – III సమావేశం, వాల్యూం -- VII నంబరు -- 1**

**శక సంవత్సరం – 1935, పుష్యం – 27**

## FRIDAY, THE 17th JANUARY, 2014

**13 L.A. XII - III SESSION, VOL— VII No. - 1**

**27 - Paush, 1935 - S.E.**

#


శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి<br>శ్రీమతి ఆర్. వనితా రాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా.( శ్రీమతి) వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవ రావు<br>శ్రీ కె. వెంటేశ్వర రావు<br>శ్రీ డి. జగన్ మోహన్ రావు<br>శ్రీ బి. ప్రభాకర రావు<br>శ్రీమతి కె. భారతి<br>శ్రీమతి డి. విజయ కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

------------

**ఆంధ్రప్రదేశ్  శాసన సభ  చర్చలు**

**అధికార  నివేదిక**

**( 13వ శాసన సభ )**

**(12వ  సమావేశపు మూడవ సమావేశము :   పద్నాల్గవ రోజు)**

**శుక్రవారము, జనవరి 17, 2014**

**సభ ఉ. గం.9.00 లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

# విషయ సూచిక

1. సభా కార్యక్రమము

వాయిదా తీర్మానాల అనుమతి గురించి

2. సభా కార్యక్రమము

3. భారత రాజ్యాంగంలోని 3వ పరిచ్ఛేదం క్రింద గౌరవ భారత రాష్ట్రపతి నిర్దేశించిన విధంగా 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ (నాల్గవ రోజు) (కొనసాగింపు)

-------

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## శుక్రవారం, జనవరి 17, 2014

* * *

(ఉదయం 9.00 గంటలకు సభ సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

(సభ సమావేశమైన వెంటనే కొందరు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు "జై సమైక్యాంధ్ర" "సేవ్ ఆంధ్రప్రదేశ్" అని రాసి ఉన్న ప్లకార్డులను చేబూని పోడియం దగ్గరికి వచ్చి "జై సమైక్యాంధ్ర" "జై జై సమైక్యాంధ్ర" అంటూ నినాదాలు చేయసాగారు.)

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

మిస్టర్ స్పీకర్ : ఈనాటి వాయిదా తీర్మానాలు :

1. సమైక్యాంధ్ర, తెలంగాణ ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వైఖరిపై చర్చను కోరుతూ శ్రీ ఎన్. ఆనందబాబు గారు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడమైనది.
2. రాష్ట్ర విభజనపై సభ్యుల అభిప్రాయాలను కోరుతూ వెంటనే ఓటింగ్ నిర్వహించుట గురించి శ్రీమతి వై.ఎస్.విజయలక్ష్మి గారు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడమైనది.

(పోడియం వద్దనున్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు "వుయ్ వాంట్ ఓటింగ్" . . . "వుయ్ వాంట్ ఓటింగ్". . . అంటూ గట్టిగా నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు.)

మీరు సహకరించాలండీ, సభా సమయాన్ని వృథా చేయకుండా ఉపయోగించుకోండి.

(పోడియం వద్దనున్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు "ఓటింగ్ ఉందో, లేదో చెప్పాలి" అని గౌరవ సభాపతిని కోరసాగారు)

This House does not work or function for a particular Member. We take collective decisions and we stand by those decisions and we move forward accordingly. So whatever opinions expressed by the Hon'ble Members in the BAC meeting have

been taken into consideration. We run the House as per the decisions taken in the BAC meeting. We have been repeatedly trying to answer your questions.

('We want voting on the Bill' అంటూ వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యులు నినాదాలు చేయసాగారు.)

దయచేసి మీ, మీ స్థానాలకు వెళ్ళి కూర్చోని సభకు సహకరించండి. Please go back to your seats. You can't do this everyday. It is not appropriate. ప్రతిరోజూ ఈ విధంగా సభను అడ్డుకోవద్దు, దయచేసి సహకరించండి.

(వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

I fail to understand, what is this? చర్చ జరిగిన తర్వాత కదా ఓటింగ్ ఉత్పన్నమయ్యేది. మీకున్న అనుమానాలు గాని, సలహాలు గాని, సూచనలు గాని. . .

(వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి సభకు తీవ్ర అంతరాయం)

I request the Floor Leader to please call back your Members. This is not the way. సభా సమయాన్ని వృథా చేయకండి. మాట్లాడే అవకాశం మీకే ఉంది, దయచేసి కూర్చోండి.

('వుయ్ వాన్ట్ వోటింగ్' 'వుయ్ వాన్ట్ వోటింగ్'. . . అంటూ వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యులు పదే పదే నినాదాలు చేయసాగారు.)

ఒక సీక్వెన్స్, ఒక పద్ధతి ఫాలో కావాలి కదా. చర్చ జరిగిన తర్వాత కదా మీరు లేవనెత్తిన అంశంపై మాట్లాడుకొనేది. ఇదేం పద్ధతండీ. చర్చలో పాల్గొనండి. అనంతరం సభ్యులుగా మీకు హక్కులున్నాయి. మీకు ఆ వెసులుబాటు కల్పించుకోడానికి అవకాశముంది. సమయాన్ని వృథా చేయకండి. చర్చలో పాల్గొనకుండా ఈ విధంగా సభకు అడ్డుపడడం ఏ మాత్రం సమంజసం కాదు. దయచేసి కూర్చోండి. This is not the way we can waste the time. Please go back to your seats.

(INTERRUPTIONS CONTINUED)

The House is adjourned for half-an-hour.

(The House then adjourned at 9.05 a.m.)

ఉ.9.20

(స్వల్ప విరామం అనంతరం సభ ఉదయం 9.29 గంటలకు సమావేశమయింది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

## సభా కార్యక్రమము

(సభ తిరిగి సమావేశం కాగానే వైఎస్ఆర్‌సిపి సభ్యులు కొంత మంది 'జై సమ్యైక్య ఆంధ్ర ప్రదేశ్' అని రాసివున్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని 'జై సమ్యైక్య ఆంధ్ర ప్రదేశ్' ........ 'జై సమైక్య ఆంధ్ర ప్రదేశ్'......అని గట్టిగా నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు.)

మిస్టర్ స్పీకర్‌ః దయచేసి మీ స్థానాలలో మీరు కూర్చోండి. Please go back to your seats. దయచేసి వెళ్లి కూర్చోండి.. I will give opportunity to Vijayamma garu. Please go back to your seats. Please co-operate.

(గౌరవ సభాపతి సూచన మేరకు "ఓటింగ్‌కు అనుమతిస్తారా సార్" అని ప్రశ్నిస్తూ పోడియం వద్ద వున్న వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ తమ స్థానాల వద్దకు వెళ్లిపోయారు.)

ఉ.10.30

©©శ్రీమతి వై.ఎస్. విజయలక్ష్మి (పులివెందుల)ః అధ్యక్షా, ఎన్నిసార్లు ముఖ్యమంత్రిగారికి విన్నవించినా, బిఎసిలో మా విధానం తమకు చెప్పినా, ఈ అసెంబ్లీలో తీర్మానం పెట్టమని అడిగినా, బిల్లుకు సంబంధించి ఓటింగ్ గురించి విజ్ఞప్తి చేసినా, దురదృష్టవశాత్తు ఈ అప్రజాస్వామిక విభజన ప్రక్రియ మాత్రం ముందుకు పోతుంది. బిల్లు యొక్క ఉద్దేశాలు, కారణాలు చెప్పకుండా అనేక ప్రధాన అంశాలకు సమాధానం ఇవ్వకుండా ఈ బిల్లును పంపించారు. దీనికి మనందరం ప్రజలకు జవాబు చెప్పాలి. ఈ విభజన బిల్లు శాసనసభకు వచ్చినప్పటి నుండి మా పార్టీ తరపున మేము ఒకటే అభిప్రాయం చెబుతూ వస్తున్నాము. ఈ శాసనసభలో విభజనకు వ్యతిరేకమా, విభజనకు అనుకూలమా అనేది శాసనసభలో నిగ్గు తేల్చవలసి ఉంది. కాని ఈ రోజు ఫలానా అంశం మీద చర్చ జరగాలనేది ప్రజలను వంచించడమే అవుతుంది. ఈ బిల్లుకు సంబంధించి సభలో తీర్మానం చేయాలని, బిల్లుకు సంబంధించి ఓటింగ్ పెట్టాలని బిఎసిలో అడిగాము. రూల్ 77, 78 క్రింద కూడా మేము ఇవ్వడం జరిగింది. మా పార్టీ అన్ని రకాలుగా మిమ్ములను అడుగుతూ వస్తుంది. ఈ విభజన బిల్లును తిరస్కరించే అవకాశం వస్తే, సభలో ఓటింగ్ నిర్వహిస్తారా లేదా అనేది క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నాను లేదా ముఖ్యమంత్రిగారు అయినా క్లారిటీ ఇస్తారా అని అడుగుతున్నాము. ఓటింగ్ క్లాజుల వారీగా ఉంటుందా, షెడ్యూల్ వారీగా ఉంటుందా అనేది ప్రజలకు చెప్పవలసిన అవసరం ఉంది. ఓటింగ్ ఎప్పుడు ఉంటుందో కూడా స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని కోరుతున్నాము.

©© An asterisk before the name indicates confirmation by the Member

ఎలాంటి స్పష్టత లేకుండా ఎలా చర్చ చేయాలి? సభ ఎందుకు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు చెప్పవలసిన అవసరం ఉంటుంది. సమాధానమైతే దొరకడం లేదు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచుతుందో అర్థం కావడం లేదు. విభజన వద్దు, విభజనను అడ్డుకుందామని మా పార్టీ నినాదం .

దీనిలో ఎలాంటి తావు లేకుండా రాష్ట్రపతిగారికి అఫిడవిట్సు రూపంలో చెప్పడం జరిగింది. శాసనసభలో శాసనసభ్యుల అభిప్రాయాలు పిటిషన్ రూపంలో 164 నిబంధన క్రింద ఇవ్వడం జరిగింది. విభజన బిల్లులో మొదటి క్లాజు నుండి 108వ క్లాజు వరకు డిలిట్ చేయాలని చెబుతూ 23 మంది సభ్యులు అమెండ్‌మెంట్సు ఇవ్వడం జరిగింది. విభజన ఎలా జరగాలనే చర్చలో మేము భాగస్వాములము కాదలచుకోలేదు. సమైక్య ముసుగులో అధికార పక్షం, ప్రధాన ప్రతిపక్షం కలిసి విభజనకు చేస్తున్న కుట్రలో ........

(టిడిపి పార్టీ నుండి అంతరాయం)

అబద్ధపు సాక్షులుగా మేము పాల్గొనబోము. అదే సమయంలో గౌరవ రాష్ట్రపతిగారు అడిగిన మేరకు మా వంతు వచ్చినప్పుడు విభజనకు వ్యతిరేకంగా మా అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియ చేస్తాము. ఇది పది కోట్ల మందికి సంబంధించిన అంశము. కాంగ్రెస్ పార్టీ ఇంటి విధానమో, ఇంకొక పార్టీ లెటర్ ఇచ్చిందనో కాదు. వీళ్ల స్వార్థం కోసం తెలుగు జాతిని బలి చేయకండి. సమైక్యంలోనే అభివృద్ధి అని శ్రీకృష్ణ కమిటీ చెప్పింది. 1972లో ఇందిరాగాంధీగారు కూడా చెప్పారు. విభజన బిల్లు అంగీకరిస్తున్నామా, తిరస్కరిస్తున్నామా అనేది కూడా చెప్పాలి.

మిస్టర్ స్పీకర్ః మీ ప్రొటెస్ట్ మీరు చెప్పండి మీరు ఈ విధంగా మాట్లాడుకుంటూ వెళితే ఇబ్బంది అవుతుంది.

శ్రీమతి వై.ఎస్. విజయలక్ష్మిః నేను ఒకటే బాధ వ్యక్తం చేస్తున్నాము. 60 సంవత్సరాలు కలిసి ఉన్న ప్రజలు ఎందుకు విడిపోవాలి? 2700 సంవత్సరాలు కలిసి ఉన్న తెలుగు జాతి ప్రజలు, బ్రిటిష్ పాలనలో, నిజాం పాలనలో కలిసి ఉన్న ప్రజలు ఈ రోజు ఎందుకు విడిపోవాలని అనుకుంటున్నారు?

మిస్టర్ స్పీకర్ః ఒక్క నిమిషం కూర్చోండి. ప్రొటెస్ట్‌కు మీకు అవకాశం ఇస్తున్నప్పుడు దయచేసి ఉపయోగించుకోండి. Please register your protest.

శ్రీ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ః వస్తారు మైకు తీసుకుంటారు.......

(అంతరాయం)

శ్రీమతి వై.ఎస్. విజయలక్ష్మిః నేను ఒకటే మనవి చేస్తున్నాను. ఎన్.టి. రామారావుగారి టైమ్‌లో ఉద్యమం లేదు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిగారి టైమ్‌లో ఉద్యమం ప్రబలంగా లేదు. తరువాతి కాలంలో ఎందుకు ఈ ఉద్యమం వచ్చింది? భావోద్వేగాలను సమాధానపరిచే విధంగా కాంగ్రెస్ కాని కేంద్రంలో ఉన్న ప్రభుత్వం కాని, బిజెపి కాని ఎందుకు చేయలేక పోతుంది?

మిస్టర్ స్పీకర్ః ఒక్క నిమిషం కూర్చోండి. I cannot allow you like that. You said you want to register your protest. సుదీర్ఘంగా మాట్లాడడానికి అవకాశం ఉండదు. మీ పార్టీకి సమయం కేటాయించినప్పుడు మీరు ఉపయోగించుకోండి. We have given you the opportunity to protest. Use the opportunity to protest.

శ్రీమతి వై.ఎస్. విజయలక్ష్మిః భావోద్వేగాలు ఉన్నాయని చీల్చుకుంటూ పోతే ఎలా? 1947కు ముందు 543 రాజ సంస్థానాలు ఉన్నట్టుగా విభజనకు అంగీకరిస్తే, భారతదేశం చీలికలు, పీలికలు అవుతుందని మా బాధ. ఈ సభ రాష్ట్ర విభజనకు అనుకూలంగా ఉందా లేదా అనేది ఓటింగ్ నిర్వహించాలని మిమ్ములను కోరుతున్నాను. మా అభిప్రాయం చెప్పమన్నప్పుడు మా ఎమ్‌ఎల్‌ఎలు అభిప్రాయం చెబుతారు. మా విధానం సమైక్యము, విభజనకు వ్యతిరేకమని స్పష్టం చేస్తున్నాము. ఈ రోజు దీని గురించి వాకౌట్ చేస్తున్నాము. మేము అడిగిన ప్రశ్నలకు ఎటువంటి జవాబులు లేవు కాబట్టి ఈ రోజు మేము వాకౌట్ చేస్తున్నాము.

(ఈ దశలో వైఎస్ఆర్‌సిపి సభ్యులు సభ నుండి బయటకు వెళ్లారు. )

శ్రీ ఆనం రామనారాయణ రెడ్డిః అధ్యక్షా, ఈ రోజు సభలో వైఎస్ఆర్‌సిపికి సంబంధించిన నాయకురాలు విజయ లక్ష్మిగారు ఇప్పుడు ఏదైతే మాట్లాడారో ఆ మాటలే మూడు నాలుగు రోజుల నుండి ప్రొటెస్ట్ అని చెప్పి తమ అనుమతితో మాట్లాడి, వాకౌట్ చేయడం జరుగుతుంది. ఒక విషయం పైన ఎన్ని రోజులు శాసనసభ జరిగితే అన్ని రోజులూ ప్రొటెస్ట్ చేసే పద్ధతి లేదు. ఒక ప్రత్యేకమైన పరిస్థితి ఈ రోజు రాష్ట్రంలో నెలకొందిఈ. ఆ విషయం పట్ల మిమ్ములను రెక్వెస్ట్ చేస్తే గౌరవ సభ్యురాలికి అనుమతి ఇవ్వడం జరిగింది. ప్రొటెస్ట్ చెప్పడానికి ప్రయత్నం చేసేటప్పుడు తమ పార్టీ సభ్యులు చర్చలో పాల్గొనలేకపోతున్నారని చెప్పి వాకౌట్ చేయడం సరైందే కాని ప్రతిసారీ వాకౌట్ పేరుతో, ప్రొటెస్ట్ పేరుతో పది, పదిహేను నిమిషాలు వాళ్ల పార్టీ విధానాలు, సమాధుల పైన ప్రమాణం చేసిన దాని గురించి , పాదయాత్రలో ఎక్కడైనా వాళ్లు చేసిన ప్రమాణాల గురించి, వాళ్ల పార్టీ నాయకురాలు ఇంకొక పాదయాత్రలో చేసిన ప్రమాణాల గురించి మాట్లాడిన విషయాన్ని చెప్పుకోవడానికి ఈ శాసనసభను వాడుకోవడం సరైంది కాదు. కాంగ్రెస్ పార్టీ ఇంటి వ్యవహారం కాదు అన్నప్పుడు మరి ఆర్టికల్ 3 ప్రకారం విభజన చేయండని ఉత్తరం వ్రాసిన వాళ్ల అధ్యక్షుడు ఎవరి ఇంటి వ్యవహారమని ఆ ఉత్తరం కేంద్రానికి పంపించాడు అధ్యక్షా?

ఎవరి ఇంటి వ్యవహారమని ప్రమాణం చేశారు అధ్యక్షా? వాళ్లు ప్రజల వద్దకి వెళ్లడానికి దిక్కు లేక, దారి లేక సమైక్య వాదంతో విభజన జరగాలనుకుంటున్నారు. ఇంత దుర్మార్గమైన ఆలోచన చేసే వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఉన్నారు. కేవలం శాసన సభ సమయాన్ని వృధా చేయడానికి, శాసనసభలో జరిగే చర్చను అడ్డుకోవడానికి, చర్చ యొక్క ఫలితాలను రాష్ట్ర ప్రజలకు అందకుండా చేయడానికి వాళ్ల యొక్క ఆలోచనలతో తమరిని కూడా ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దయచేసి తమరైనా గమనించండి. మరొక సారి ఈ విషయంపై వాకౌట్ చేయడానికి, ప్రొటెస్ట్ చేయడానికి అవకాశం ఇవ్వొద్దు. వారిని చర్చలో పాల్గొనమనండి. అందరితోబాటు వారు కూడా చర్చలో పాల్గొంటే బాగుంటుంది కాని ప్రతిరోజు ఒకే విషయంపై ప్రొటెస్ట్‌కి అవకాశం కోరడం సరైన విధానం కాదని నేను తమరిని కోరుతున్నాను. బిల్లుపై చర్చ జరగాలని అందరూ కోరుకుంటున్నారు. సభ్యులందరూ సహకరించి చర్చలో పాల్గొంటే బాగుంటుందని నా అభిప్రాయం. దానికి తమరు కూడా అనుమతించాలని కోరుతున్నాను.

శ్రీ పి. కేశవ్ (ఉరవకొండ): సార్, ఎంతో సున్నితమైన సమస్య సభ ముందు ఉంది. ఇప్పటికీ అన్ని పక్షాల వారికి ఆందోళనలు, అనుమానాలు, అపోహలున్నాయి. అయినా సరే ఈ సభ మీద, తమరి మీద ఉన్న నమ్మకంతో సభకి వచ్చి చర్చను ప్రారంభించడం జరిగింది. బయట ప్రజల ఆశలను, ఆకాంక్షలను వినిపించాల్సింది ఈ సభలోనే సార్. వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఇక్కడ చెప్పాల్సింది బయట చెబుతారు. బయట సమైక్యాంధ్ర నినాదాన్ని వినిపిస్తారు, ఇక్కడేమో ఆ ముక్క మాట్లాడకుండా బయటకెళ్తున్నారు. వాళ్ల విధానం వారిది. కాని మా మీద దుమ్మెత్తిపోసే ప్రయత్నాన్ని ఖండించకపోతే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని మాట్లాడుతున్నారు. ఈ రాష్ట్రంలో ఈ విభజన సమస్యకు కారణం డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు. 2000 సంవత్సరంలో ఆయన ప్రారంభించినట్టి ఈ విభజన కార్యక్రమంలో భాగంగా చిన్నారెడ్డి గారి నెతృత్వంలో ఢిల్లీకి వెళ్లి చెప్పుకున్నప్పుడు మొదలయ్యిందనే విషయాన్ని విజయమ్మ గారు తెలుసుకుంటే మంచిది. రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రిగా రాజశేఖర రెడ్డి గారు, నా ప్రభుత్వం తెలంగాణాకు సమ్మతిస్తోందని అధికారికంగా చేసిన ప్రకటన కాపీని వాళ్లకు పంపిస్తాను. ఎవరిని మభ్య పెట్టడానికి వై.ఎస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ రకమైన పనిచేస్తోంది? వాళ్లకి తెలియక కాదు సార్. వాళ్లకు అన్ని విషయాలు తెలుసు. వాళ్ల మనసులో రాష్ట్రం అర్జెంట్‌గా విడిపోవాలని ఉంది. సభ జరగకూడదని ఉంది. ఎందుకు స్పీకర్ గారు ఇంత లేట్ చేస్తున్నారు, ఒక్క రోజులో చర్చను ముగించి పంపించవచ్చు అని జగన్మోహన రెడ్డి గారు అంటున్నారు. ఒక్క రోజు అంటే, ఢిల్లీ పెద్దలకి పెత్తనం ఇచ్చి, మరుసటి రోజునే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి, రాష్ట్రాన్ని మరుసటి రోజునే చీల్చమని జగన్మోహన రెడ్డి గారి కోరిక. చర్చలో పాల్గొనమంటే పాల్గొనరు. ఇక్కడకి వచ్చి మేము ప్రొటెస్ట్ చేస్తామంటారు. వారిని చర్చలో పాల్గొనమని మేము రిక్వెస్ట్ చేస్తున్నాము. వారి అభిప్రాయాన్ని చెప్పమనండి బిల్లుకు వ్యతిరేకమని బయట చెప్పడం కాదు. ప్రతి అనుమానానికి స్పీకర్ గారు అవకాశం ఇస్తారా సార్? సభ్యుల హక్కుల గురించి వారికి తెలియదా? ఈ సభలో

బిల్లుకు ఓటింగ్ కావాలనుకుంటే ఈరోజు నా స్పీచ్ అయిన తరువాత నేను మోషన్ మూవ్ చేస్తాను సార్. వాళ్లు సభలో నుంచి తప్పించుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఏ క్షణంలోనైనా ఓటింగ్ పెట్టే హక్కు సభ్యుడిగా నాకుంది సార్. అట్లాంటి పరిస్థితిలో, వాళ్లు ఓటింగ్‌లో పాల్గొనకూడదు, బయటకి పోవాలనే దురుద్దేశంతో బయటకి వెళ్తున్నారు సార్. ఆర్టికల్ 189 ఏమి చెప్పింది సార్, వెరీ స్పెసిఫిక్‌గా చెబుతున్నాను.

> "Save as otherwise provided in this Constitution, all questions at any sitting of a House of the Legislature of a State shall be determined by a majority of votes of the Members present and voting, other than the Speaker or Chairman, or persons acting as such.
>
> The Speaker or Chairman, or person acting as such, shall not vote in the first instance, but shall have and exercise a casting vote in the case of an equality of votes".

అంటే ఏంటి సార్? వాళ్లకు, ప్రజలకు అర్థం కావడం కోసం చెప్పాలి సార్. ఈ సభలో ఏ సమస్య ఉత్పన్నమైనా, ఏ ప్రశ్నకైనా సమాధానం ఓటింగ్ ద్వారానే తేలుతుందని రాజ్యాంగం మనకిచ్చిన హక్కు సార్. ఆ సాకుతో పదే పదే ఓటింగ్ పెట్టమని అంటే ఏమిటి సార్? వాళ్లేదో ఓటింగ్ అడుగుతున్నట్లు, మేము ఏదో అడగనట్లు ఉంది. మా హక్కుల గురించి మాకు స్పష్టత ఉంది సార్. ఈ సభలో ఓటింగ్ కోసం ఎట్లా పట్టుబట్టాలో వారికి జ్ఞానోదయం కల్పించమంటున్నాము. నిద్ర నటించొద్దని వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు చెబుతున్నాము. అసంబద్ధమైన విషయాలను చెప్పారు. ఆర్టికల్ 3 మనకు ఏమి చెప్పింది సార్. **"Its views"** అని రాష్ట్రపతి చెప్పిన తరువాత సభ వ్యూ పంపించాలి కదా. ఒక మోషన్ ద్వారా, ఒక రిజల్యూషన్ ద్వారా సభ వ్యూ వస్తుంది. మోషన్, రిజల్యూషన్ ఓటింగ్ ద్వారా క్యారీ అవుతుంది. ఇవన్నీ తెలిసి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నటిస్తోంది. ప్రజలను మోసం చేయడానికి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నటిస్తోంది సార్. దయచేసి ఇటువంటి డ్రామాలకు ఈ శాసనసభను వేదిక కానివ్వొద్దని చెబుతున్నాను. వాళ్లు సభలో ఉన్నది 17 మంది సభ్యులు మాత్రమే. పదే పదే విజయలక్ష్మి గారు మాట్లాడుతూ 23 మంది అంటున్నారు. ఈ అక్రమ సంతానం ఎక్కడి నుండి వచ్చింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి? చర్చలో పాల్గొనడానికి మాకు అభ్యంతరం లేదు. వాళ్లను వెలకమ్ చేస్తున్నాము. ప్రజల వాణిని వినిపించండి అంటున్నాము.

శ్రీ కె. తారక రామారావు (సిరిసిల్ల) : స్పీకర్ సార్, విజయలక్ష్మి గారు మాట్లాడిన మాటలతో పూర్తిగా విభేదిస్తూ వారికి కొన్ని విషయాలు చెబుతున్నాను. సోదరుడు కేశవ్ గారు ఇందాక చెప్పినట్లు, 2000 సంవత్సరంలో 42 మంది తెలంగాణా కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆనాడు సోనియాగాంధీ గారికి వినతి పత్రాన్ని ఇప్పించి, తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ఆనాడు టిఆర్ఎస్ పార్టీ పుట్టక ముందే బీజం వేసింది రాజశేఖర్ రెడ్డి గారు సార్. చరిత్రను చింపేస్తే చిరిగిపోదు. 2004లో టిఆర్ఎస్ పార్టీ ఏ సింగల్ పాయింట్ అజెండాతో పుట్టిందో తెలిసి కూడా తెలంగాణా రాష్ట్ర ఏర్పాటే ఏకైక అజెండాగా పనిచేస్తున్న టిఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవడమే కాకుండా, 25 సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కావాలనే కలను టిఆర్ఎస్ పార్టీతో పొత్తుపెట్టుకొని సాధించారని

నేను గుర్తు చేస్తున్నాను. మొదటి ఎస్ఆర్సిని గౌరవిస్తామని ఒప్పందం కుదిరిన తరువాత కాంగ్రెస్, టిఆర్ఎస్కు పొత్తు కుదిరింది. మొదటి ఎస్ఆర్సిని గౌరవించడం అంటే తెలంగాణా రాష్ట్రాన్ని ఇవ్వడమే అధ్యక్షా. సోదరుడు కేశవ్ గారు చెప్పినట్లు రాజశేఖర రెడ్డి గారు శాసన సభా వేదికగా చేసిన ప్రకటన అధ్యక్షా. తెలంగాణాకు ఓకే అంటూ ముఖ్యమంత్రి గారి హోదాలో రాజశేఖర రెడ్డి గారు శాసన సభా వేదికగా చేసిన ప్రకటన ఇది. అసంబద్ధంగా మాట్లాడే ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తెలుసుకొని మాట్లాడిదే మంచిది. ఒక శాసనసభలోనే కాదు, బయట ఎన్నికల ప్రచార సరళిలో రాజశేఖర రెడ్డి గారు మాతోనే తెలంగాణ అంటూ, సోనియా ద్వారానే పరిష్కారమంటూ కేంద్రప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా సమ్మతిస్తానని ఒకటికి పలుమార్లు చెప్పారు. కాబట్టి ఈ రోజు విజయమ్మ గారు చెప్పిన మాటలు అవకాశవాద రాజకీయానికి పరాకాష్ఠ అని చెబుతున్నాను. రాజశేఖర రెడ్డి గారికి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు నిజమైన వారసులైతే ఖచ్చితంగా రాజశేఖర రెడ్డి గారి ఆశలు నెరవేరుతున్నందుకు సంతోషించాలి. జగన్మోహన రెడ్డి గారు కూడా ప్లీనరీ సమావేశంలో చెప్పారు. కేంద్రమే తేల్చాలి అన్నారు. ఆర్టికల్ 3ని ఎక్కడ మరచిపోతుందో అని అఖిల పక్షంలో ఆర్టికల్ 3ని గుర్తుచేసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షా. కాబట్టి ఈ అసంబద్ధమైన వాదనను కట్టిపెట్టి వారిని చర్చలో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కేశవ్ గారు చెప్పినా, విజయమ్మ గారు చెప్పినా ఒకటి మాత్రం వాస్తవం. రాష్ట్రపతి గారు చాలా స్పష్టంగా తమరికి పంపిన కరెస్పాండెన్స్లో చెప్పారు. శాసన సభ అభిప్రాయాలు మాత్రమే కోరారు తప్ప ఓటింగ్ గురించి ఎక్కడా లేదు. కేశవ్ గారితో ఒక్క విషయంలో మాత్రం ఏకీభవిస్తాను. అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తరువాత క్రోడీకరించి పంపే అవకాశం మీకుంటుంది కాబట్టి డెఫినెట్గా నెంబర్స్ తెలుస్తాయి. నెంబర్ తెలియదని నేను అనడం లేదు. శాసనసభకు లేని అధికారాన్ని ఆపాదించవద్దని చెబుతున్నాను. ఆ విధంగా ఆపాదించే ప్రయత్నాన్ని విభేదిస్తున్నాను. ముఖ్యమంత్రి గారు చెప్పినా, ఎవరు చెప్పినా ఒక్క విషయం మాత్రం వాస్తవం. కేవలం అభిప్రాయాల సేకరణకు మాత్రమే ఈ కార్యక్రమం పరిమితం. 42 రోజులు గడువిచ్చిన తరువాత కూడా ఉద్దేశ్యపూర్వకంగా కొన్ని రోజులు దుర్వినియోగం చేసి ఇప్పుడు మళ్లీ సమయాన్ని పొడిగించాలని దుర్మార్గమైన ప్రతిపాదనను తిరస్కరించాలని కోరుతున్నాను.

ఉ.10-50

MR.SPEAKER: When I have agreed to let you speak. It was meant to counter what Smt.Vijayalaxmi said. You cannot go on speaking several subjects. సభలో మనం ఒక పద్ధతి ప్రకారం నడచుకోవాలి. మీరు అన్ని విషయాలను ఇపుడే ప్రస్తావిస్తామంటే ఎలా? మీకు సమయం కేటాయించినపుడు మీ ఉపన్యాసంలో ప్రస్తావించండి. ఇప్పుడు కాదు. దయచేసి కూర్చోండి.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులనుంచి అంతరాయం)

Please sit down. Ask your members to please resume their seats.

శ్రీ కె.తారక రామారావుః అధ్యక్షా, ధన్యవాదాలు. మీకొక విషయం గుర్తు చేస్తున్నాను. ఎక్కడైతే అదనపు సమయానికి సంబంధించి ఆయా శాసనసభలో తీర్మానం చేసి రాష్ట్రపతి గారిని కోరడంతో గౌరవ రాష్ట్రపతి గారు గడువు ఇచ్చిన మాట వాస్తవం. ఆ విధంగా గౌరవ రాష్ట్రపతి గారు గడువు ఇచ్చారు. ఆ విషయాలను ముఖ్యమంత్రి గారు గమనంలోకి తీసుకోవాలని కోరుతున్నాను.

(తెలుగుదేశం పార్టీ శాసనసభా పక్ష ఉపనాయకుడు శ్రీ పి.అశోక్ గజపతిరాజు గారు మైక్ ఇవ్వాలని కోరారు)

MR.SPEAKER: Please sit down.

©©డా.ఎస్.శైలజానాథ్ (శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి)ః అధ్యక్షా, ఇంతకు మునుపు గౌరవనీయులు కేశవ్ గారు, తారక రామారావు గారు దివంగత రాజశేఖర రెడ్డిగారి గురించి మాట్లాడారు. రాజశేఖర రెడ్డిగారు ఎక్కడో రహస్య ఒప్పందాలు చేసుకొని మాట్లాడలేదు. ఈ సభలోనే వారు స్పష్టంగా ప్రకటించారు.

> "Right from the beginning we were for the Constitution of Second State Re-organization Commission to go into the issue. There are many valid reasons for formation of separate states in Vidarbha and Telangana. However, the re-organization of existing states raises a large number of issues, the Congress Party feels that the whole matter could be best addressed by another States Re-organization Commission to look into all the issues involved.
>
> The Government of Andhra Pradesh has no objection for the formation of Telangana State in principle and feels that the time has come to move forward decisively on this issue. However, before taking a decision many of the issues need to be resolved as serious concerns have been raised by the stakeholders.
>
> The Government has, therefore, decided to constitute a Committee of Members of both the Houses to deliberate the issues and concerns on the formation of Telangana and further steps could be taken after the report from the Joint Committee of Members from both the Houses is submitted to Government. This was the statement given by Dr.Rajasekhar Reddy".

ఈ అంశంలో మొట్టమొదటి నుంచి స్పష్టమైన విధానం కలిగిఉన్న కాంగ్రెస్ పార్టీ సెకండ్ స్టేట్స్ రీఆర్గనైజేషన్ కమిటీనే దీనికి పరిష్కారమని నమ్మిన కాంగ్రెస్ పార్టీ ఒక సమస్య ఎదురైనపుడు ఆ సమస్యను సమస్యగా చూస్తూ ఆ సమస్య పరిష్కారంలో భాగంగా ఒక కమిటీ ఏర్పాటుచేసుకోవడం, మేం ఎవరికీ వ్యతిరేకం కాదని చెప్పడం ఒక గొప్ప స్టేట్‌మెంట్‌గా భావిస్తున్నాను. అంతేగానీ, తెలంగాణ ఇస్తామని గానీ....................

(తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

©© An asterisk befpre the name indicates confirmation by the Members

అధ్యక్షా, ఎవరి అవకాశవాదం ఏమిటో, ఎవరు ఏయే సమయాలలో అవకాశవాదంతో ప్రవర్తించారో, ఎవరు ఎపుడు రాజకీయావసరాల కోసం తన పంతాలు, మాటలు, వేషాలు మార్చుకున్నారో ఈ రోజు కూడా నాయకత్వాన్ని ఏ విధంగా మార్చుకున్నారో అవసరం వచ్చినపుడు మాట్లాడవచ్చు. కానీ అవకాశవాదం గురించి మీతో చెప్పించుకొనే దుస్థితి ఎవరికీ లేదు. అందులో మాస్టర్ డిగ్రీలు సంపాదించుకున్నవారు మీరు.

MR.SPEAKER: Please leave it at that.

డా.ఎస్.శైలజానాథ్ః అధ్యక్షా, సభ్యులు మాట్లాడేటప్పుడు సభ్యతగా మాట్లాడాలని కోరుతున్నాను. ఈ రోజు తెలంగాణ ప్రజానీకానికి ఎవరైనా ద్రోహం చేస్తున్నారంటే అది కేవలం తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ వారే. వారి దారుణమైన రాజకీయావసరాల కోసం, రాజకీయ పదవుల కోసం చేస్తున్నారు.

MR.SPEAKER: Please leave it at that. what is this? రావుల చంద్రశేఖర్ రెడ్డిగారూ.

(తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

రావుల చంద్రశేఖర్ రెడ్డిః అధ్యక్షా, ఇవాళ

(తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR.SPEAKER: : Please ask your Members to show some restraint.

రావుల చంద్రశేఖర్ రెడ్డి (వనపర్తి)ః అధ్యక్షా, నాకు ఇవాళ ఈ బిల్లు మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు నేను ప్రత్యేకంగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రాంతంలో ప్రత్యేకించి అనేక దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజానీకం ఉద్యమం చేస్తున్న సందర్భంలో ఎలాంటి హింసకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో వారి మనోభీష్టాన్ని నెరవేర్చే ప్రక్రియ బిల్లు రూపంలో వచ్చింది. ఈ బిల్లుపై మాట్లాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రాంత ప్రజల మనోభీష్టాన్ని ప్రతిబింబించే ప్రయత్నం నేను చేస్తున్నాను.

(తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి శాసనసభా వ్యవహారాల మంత్రితో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేస్తూ గౌరవ సభాపతితో వాగ్వాదానికి దిగారు)

(అంతరాయం)

("మంత్రిగారు క్షమాపణలు చెప్పాలి", "శైలజానాథ్ డౌన్ డౌన్", "కాంగ్రెస్ పార్టీయే ద్రోహి" అని నినాదాలు చేయసాగారు)

MR.SPEAKER: Please go back to your seats.

(తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు తమ సీట్లకు తిరిగి వెళ్లారు)

Please advise your Members.

ఉ.11.00

శ్రీ కె.టి.రామారావు: స్పీకర్ సర్, శాసన సభ వ్యవహారాల మంత్రి గారు మొన్నటి వరకూ సీమాంధ్ర ఎంఎల్ఏలకు కన్వీనర్‌గా వున్నారు, బహుశా ఇప్పుడు కూడా ఉన్నట్లున్నారు. కానీ వారు ప్రస్తుతం శాసన సభా వ్యవహారాల మంత్రి. కేవలం సీమాంధ్ర ఎంఎల్ఏలకు మాత్రమే వారు ప్రతినిధి కాదు. వారు ఈరోజు "అవకాశవాదం" అన్న ఒక మాటను అన్‌పార్లమెంటరీ మాట అన్నట్లుగా చాలా అన్యాయంగా మాట్లాడారు. అందులోనూ "టిఆర్ఎస్ పార్టీ చేస్తున్నంత దుర్మార్గం తెలంగాణాకు ఎవరూ చేయడం లేదు" అని వారు మాట్లాడటం నిజంగా చాలా శోచనీయం. అధ్యక్షా, "రాజశేఖర్ రెడ్డి గారు తెలంగాణాకు సూత్రప్రాయంగా ఓకే అన్నారు కానీ ఏదో కమిటీ వేస్తారన్నారు" అని మంత్రి గారన్నారు. అధ్యక్షా, ఆ కమిటీ ఏమైంది? తెలంగాణాలో ప్రచారం చేసేటప్పుడు ఇదే రాజశేఖర్ రెడ్డి గారు కాదా అధ్యక్షా, తెలంగాణాకు ఓకే అన్నది? కానీ అదే రాజశేఖర్ రెడ్డి గారు నంద్యాలకు వెళ్లగానే గడియారం చూసుకుంటూ "రేపు హైదరాబాద్ పోవాలంటే పాస్‌పోర్టు, వీసా కావాలి" అని మాట్లాడలేదా, అది అవకాశవాదం కాదా అని నేనడుగుతున్నాను.

2004 లో కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చింది. ముఖ్యమంత్రి గారు కూడా ఒప్పుకున్నారు. ఇదే శాసన సభా వేదికగా "అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తూ.చ.తప్పకుండా పాటిస్తాను" అని కిరణ్ కుమార్ రెడ్డి గారు చెప్పారు. కానీ ఈరోజు తిరగబడుతున్నారు. ఇది అవకాశవాదం కాదా అని నేనడుగుతున్నాను. "అవకాశవాదం" అంటే అదేదో అన్‌పార్లమెంటరీ అంటూ మంత్రి గారు మాట్లాడటాన్ని నేను ఖండిస్తున్నాను. ఆ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని నేను వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. వారు వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుంటారో లేదో వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. చివరగా ఒకటే చెబుతున్నాను. అవకాశవాదం గురించి మాట్లాడే నైతికత ఈరోజు అక్కడ కూర్చున్న ముఖ్యమంత్రి గారికి గానీ, శైలజానాథ్ గారికి గానీ లేదనే మాటను ఖచ్చితంగా చెబుతున్నాను.

శ్రీ ఎస్.కిరణ్ కుమార్ రెడ్డి (ముఖ్యమంత్రి): సార్, నేను మొన్ననే సభలో చెప్పాను. నేను మాట్లాడేటప్పుడు మా హైకమాండ్ తీసుకున్న నిర్ణయానికి నేను భిన్నంగా, వ్యతిరేకంగా ఎందుకున్నానో కూడా ఈ సభకు చెబుతానని అన్నాను. మా హైకమాండ్ నిర్ణయాన్ని నేను పాటిస్తానని చెప్పిన మాట వాస్తవమే. పబ్లిక్ మీటింగులో చెప్పాను, ఈ సభలో కూడా చెప్పాను. కానీ ఆ నిర్ణయం ఎందుకు హేతుబద్ధంగా లేదో, ఎందుకు సక్రమంగా లేదో, ఎందుకు నేను ఆ నిర్ణయాన్ని విభేదిస్తున్నానో నేను మాట్లాడేటప్పుడు ఈ సభకు చెబుతాను, ప్రజలకు కూడా చెబుతాను. వారి నుంచి నేను సూత్రాలు గానీ, నీతి వాక్యాలు గానీ నేర్చుకోవలసిన అవసరం లేదు.

అధ్యక్షా, నేను ఎందుకు వ్యతిరేకం, తెలంగాణాకు ఏమి నష్టం జరుగుతుంది, ప్రజలకు ఏమి నష్టం జరుగుతుందో నేను స్పష్టంగా ఈ సభలో చెబుతాను. నేను చెప్పిన తరువాత మీ రియాక్షన్ ఏ విధంగా ఉంటుంది, తెలంగాణాకు ఏమి సమాధానం చెబుతారు, తెలంగాణ ప్రజలకు జరిగే నష్టాన్ని ఏ విధంగా పూడుస్తారో మీరు చెప్పే సమాధానాన్ని బట్టి చూద్దాం.

**భారత రాజ్యాంగంలోని 3వ పరిచ్ఛేదం క్రింద గౌరవ భారత రాష్ట్రపతి నిర్దేశించిన విధంగా 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ (నాల్గవ రోజు) (కొనసాగింపు)**

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డిః అధ్యక్షా, ఈ బిల్లు మీద మాట్లాడే అవకాశం రావడం నేను అదృష్టంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రి గారు మొన్న సభలో మాట్లాడేటప్పుడు చాలా సున్నితమైన అంశం కాబట్టి సభలో భావోద్వేగాలు రెచ్చగొట్టవద్దని చెప్పారు. మనం కూడా అది పాటిస్తే బాగుంటుంది. ముఖ్యమంత్రి గారు చెప్పిన తరువాత చీఫ్‌విప్ గండ్రవెంకట రమణా రెడ్డి గారి ప్రసంగం చూస్తే భావోద్వేగాలు రెచ్చగొట్టడం తప్ప వేరే ఏమీ లేకుండా ఆయన చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. అసలు అంశంలోకి పోలేదు. సార్, తెలంగాణ కోరిక ఈనాటిది కాదు, దశాబ్దాలుగా ప్రజల్లో ఉంది. తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. తెలంగాణ ప్రాంతం మొదటి నుంచి భూస్వాములు, పెద్దవాళ్ల ఆధిపత్యంలో నలిగిపోయిన ప్రాంతం. ఆ నలిగిపోయిన ప్రాంతంలో ఎందుకు ఉద్యమాలు వచ్చాయో గమనించినట్లైతే ఆనాటి కొమరం భీం ఉదంతం తీసుకుంటే "జల్ జంగిల్ జమీన్" అని ఆ ప్రాంతంలో పెత్తందార్ల ఆధిపత్యాన్ని ఎదిరించిన ఒక సంఘటనను మనం గుర్తు చేసుకోవాలి. కొమరం భీం మొదలుకొని అనేక మంది ఈ ప్రాంతంలో పోరాడిన వాళ్లున్నారు. పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ ఉదంతం తీసుకున్నా.......

(శ్రీ గాదె వెంకటరెడ్డిచే అంతరాయం)

మీకు తొందరుంటే మీతోనే ప్రారంభిస్తాను. నేను హిస్టారికల్‌గా ముందు మాట్లాడదాము అనుకున్నాను. వద్దంటే మీతోనే ప్రారంభిస్తాను.

మిస్టర్ స్పీకర్ః చంద్రశేఖర్ రెడ్డి గారూ......

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డిః సార్, మేము పోరాడుతున్నది కూడా ఇందుకే. ఆనాటి నుండి కూడా ఈ పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని నేను చెబుతుంటే ఇప్పుడు నయా పెత్తందార్లు మాట్లాడితే నేను ఏమి చేసేది? సార్, చాకలి ఐలమ్మ ఉదంతం తీసుకున్నా, లేకుంటే ముస్లిం యువకుడు బందగీ అమరత్వం తీసుకున్నా ఇది పోరాటాల గడ్డ. దీనికి ప్రత్యేకత ఉంది. అందుకనే నేను ఈ అంశాన్ని చెబుతున్నాను. తెలంగాణ ప్రాంతంలో భావోద్వేగాలున్నాయి. వాస్తవం. ఎందుకంటే తరతరాలుగా ఒత్తిడికి లోనైన ప్రజానీకం సంఘటితమై పోరాటం చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల్ని మనమందరం అభినందించాలి. ఎలాంటి హింసకు తావులేకుండా

ఎంతో నిబ్బరంగా ఈ ఉద్యమాన్ని నడిపించిన సందర్భంగా తెలంగాణ ప్రజానీకాన్ని మనస్ఫూర్తిగా ఈ సభ అభినందించాలి. అనేక మంది మేధావులు, విద్యావంతులు, కళాకారులు, యువకులు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు సంఘటితంగా కేంద్ర ప్రభుత్వం మీద పోరాటం చేశాయి. ఫలితంగానే ఈరోజు కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లు మీద మాట్లాడేందుకు నాకు అవకాశం కలిగించిన మా పార్టీ అధ్యక్షునికి, అదే విధంగా నన్ను ఎన్నుకుని ఈ శాసన సభకు పంపిన మా వనపర్తి నియోజక వర్గ ప్రజలకు కూడా ఈ సందర్భంగా నేను కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. చారిత్రాత్మకంగా తెలంగాణ అంశం మీద మాట్లాడే అవకాశం నాకు రావడం నిజంగానే నేను అదృ ష్టంగా భావిస్తున్నాను. ఈరోజు ప్రభుత్వ పక్షం నుంచి ఈ బిల్లు మీద ముందుగా మంత్రి గారు మాట్లాడారు. వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మాటలేమన్నా చెబుతారేమో అనుకున్నాను కానీ దురదృ ష్టవశాత్తూ ఆయన వట్టి మాటలనే ఆశ్రయించారు. సార్, ఈ బిల్లును ఈ సభకు ఎవరు పంపించారు – రాష్ట్రపతి గారు పంపించారు. రాష్ట్రపతి గారికి ఈ బిల్లు ఎవరు పంపించారు – కేంద్రంలో ఉన్న ప్రభుత్వం పంపించింది. కేంద్రంలో ప్రభుత్వంలో ఎవరున్నారు – కాంగ్రెస్ పార్టీ ఉంది.

(శ్రీ మల్లాది విష్ణుచే అంతరాయం)

మీ పేరులో విష్ణు ఉంది గానీ మీరు అట్లా ప్రవర్తించట్లేదు. సార్, ఈ సైడ్ ట్రాకింగ్.......

MR. SPEAKER: That will not go into the records. Why do you respond to that? Please address the Chair.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: సార్, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం పంపించిన ఈ బిల్లును, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఈ రాష్ట్రంలో మంత్రిగా ఉన్న వట్టి వసంత కుమార్ గారు పదే పదే మా కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పుకునే మీరు, మీ పార్టీ ఢిల్లీలో అధికారంలో వుండి బిల్లు తయారు చేసి రాష్ట్రపతికి పంపిస్తే, ఆ బిల్లును రాష్ట్రపతి గారు శాసన సభకు పంపిస్తే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రి బిల్లును వ్యతిరేకించడం ఇదెక్కడి న్యాయ సూత్రం, ఇదెక్కడి ధర్మ సూత్రం సార్?

ఇవేళ రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రులు.... నేను ముందుగా ఎవరన్నా శాసన సభ్యులు మాట్లాడతారేమోనని వూహించాను కానీ సాక్షాత్తూ మంత్రి గారే మొదలు పెట్టారు. మంత్రి గారి ప్రసంగం ఏ విధంగా ఉందంటే ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తయారు చేయడమే తప్పు, ఈ బిల్లును రాష్ట్రపతికి పంపడం తప్పు, ఈ సభకు రావడం మరింత తప్పని అన్నారు. ఇన్ని తప్పులు జరుగుతుంటే, ఇదే ప్రభుత్వంలో మంత్రిగా మీరు కొనసాగడం మరో తప్పు. మీరు మంత్రిగా కొనసాగడమే కాకుండా ఈ ప్రభుత్వం కొనసాగడం కూడా మరింత తప్పనే విషయాన్ని కూడా మీరు దయచేసి అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. సార్, భావోద్వేగాలు రెచ్చగొట్టవద్దని......

(శ్రీ కె.పార్థసారధిచే అంతరాయం)

సార్, మరో మంత్రి పార్థసారధి గారికి కూడా తొందరుంటే మనం ఏమి చేస్తాం? మీరందరూ తప్పు చేస్తున్నారు సార్, అది నా భావన. నేను మాట్లాడేది నిజంగా తప్పైతే మీరు మైకు తీసుకుని మాట్లాడండి.

MR. SPEAKER: Chandrasekhar Reddy garu, I need to advise you. That will not go into the records. Please address the Chair. ప్రతీ దానికి మీరు కౌంటర్ చెప్పుకుంటూ పోతే ఎలా? You know the practice very well.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డిః సార్, నేను ఒప్పుకుంటాను. కానీ మంత్రులుగా ఉండే వాళ్లే చర్చను అడ్డుకునే దుష్ట సాంప్రదాయం ఈ సభలో పెడితే రాబోయే జనరేషన్ కూడా ఇది పద్ధతేమో అనుకుని వాళ్లు కూడా పాటించే ప్రమాదం లేకపోలేదు. So the Ministers should have restraint and some patience. సార్, ఈ బిల్లును తీసుకు వచ్చిన సందర్భంలో రకరకాల రాజకీయ పార్టీల ఆలోచనా విధానాన్ని మనం గమనించినట్లైతే ఒక్కొక్క పార్టీ ఒక్కో విధానం తీసుకున్నది.

ఉ.11.10

ఈ విధానాల్లో ప్రతి రాజకీయ పార్టీ కూడా తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేస్తూ మాట్లాడుతూ వస్తోంది. ఈ సందర్భంగా నేను ఒక విషయం చెప్పదల్చుకున్నాను. తెలుగుదేశం పార్టీకి సంబంధించినంత వరకు, 2004 ఎన్నికలకు ముందు మాది సమైక్య పార్టీ. సమైక్యవాదంతోనే మేం ఎన్నికలకు వెళ్లాం. అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ 2004కు ముందు సమైక్యవాదం మీద ఎన్నికల్లోకి వెళితే..

(ఈ దశలో గవర్నమెంట్ విప్ శ్రీ ద్రోణం రాజు శ్రీనివాస రావు గారు 'రెండు కళ్ల సిద్ధాంతం' అని అన్నారు)

శ్రీనివాసరావు గారూ... తరువాత మాట్లాడేది మీరే అనుకుంటాను. మీకు మైకు వస్తుందనుకుంటాను. తొందరెందుకు? అధ్యక్షా, 2004లో సమైక్యవాదం మీద మేం ఎన్నికలకు వెళితే, కాంగ్రెస్ పార్టీ మాత్రం టిఆర్ఎస్ పార్టీతో ఒప్పందం చేసుకుంది. వేర్పాటువాదం కోసమే ఉద్భవించిన ఆ పార్టీతో మీరు (కాంగ్రెస్ పార్టీ) ఒప్పందం చేసుకుని ఎన్నికలకు వెళ్లారు. ఆ ఎన్నికల్లో మేం ఓడిపోయాం. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో నెగ్గింది. మీరూ (కాంగ్రెస్ పార్టీ) మంత్రులయ్యారు, వాళ్లూ (టిఆర్ఎస్‌పార్టీ వారు) మంత్రులయ్యారు. ఇక్కడా, ఢిల్లీలో అంతటా మంత్రులయ్యారు. అయినా తెలంగాణా రాష్ట్రాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదనే దానికి, ఇవాళ సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీ రెండు పార్టీల మీద ఉంది.

ఆ తరువాత వచ్చిన తెలంగాణా ఉద్యమ నేపథ్యంలో మా పార్టీ ఒక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీ నిర్ణయం తీసుకుని, తేదీ.18.10.2008 నాడు రాష్ట్రపతి గారికి ఉత్తరం వ్రాశాము. చాలా స్పష్టంగా తెలంగాణా ప్రక్రియకు అంగీకరిస్తూనే, మా పార్టీ పోలిట్ బ్యూరో ఒక తీర్మానం కూడా చేసింది. దాన్ని కూడా రాష్ట్రపతికి పంపే లేఖకు జత చేసి పంపడం జరిగింది. ఆవిధంగా 18, అక్టోబర్, 2008 నాటి లెటర్‌తోబాటు పంపిన తీర్మానంలో ఉన్న విషయమేమిటంటే – "కోర్ కమిటీ తెలియజేసిన అంశాలపై కూలంకషంగా చర్చించిన తెలుగుదేశం పోలిట్ బ్యూరో తెలంగాణా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, వారి అభీష్టం మేరకు ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయించింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై తెలుగుదేశం పార్టీ మొదటి నుండి దృష్టి కేంద్రీకరించింది. ఈ దశలో నిరంతరం శ్రమిస్తూనే ఉంటుంది. తెలుగు వారి ఆత్మగౌరవ పరిరక్షణ, వారి సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంతో గౌరవనీయులు శ్రీ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ, తెలుగు వారు ఏ ప్రాంతంలో నివసించినా అందరికీ సమన్యాయం జరిగేలా కృషి చేస్తుంది." ఇదీ మా తీర్మానం. ఆ తీర్మానానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది. ఆనాడూ కట్టుబడి ఉంది. ఇవ్వాళ కూడా కట్టుబడి ఉంది. మా పార్టీ ఎక్కడా మారలేదు, స్టాండ్ కూడా మార్చలేదు.

ఈ సందర్భంగా మరో విషయం చెప్పాలి. డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు సభలో ఉన్నప్పుడు, ఈటెల రాజేందర్ గారు అక్కడ కూర్చుని ఉండగా, ఆయన (డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు) చేసిన ఉపన్యాసంలోని మాటలు మేం ఇంకా మర్చిపోలేదు. ఆయన్ని (ఈటెల రాజేందర్ గారిని) నిలదీశారు. రకరకాల మాటలతో తూట్లు పొడిచినట్లుగా మాట్లాడారు. 2009 ఎన్నికల్లో భాగంగా హైదరాబాదులో 4 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిస్తే, నంద్యాలకు పోయి వారు చేసిన ప్రసంగాన్ని పరిశీలిస్తే, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గానీ, వాకౌట్ చేసి తప్పించుకుపోయిన వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి పార్టీగానీ సమాధానం చెప్పాల్సిన అవసరముంది.

డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఆ తరువాత జరిగిన పరిణామాల్లో ఇదే హౌస్‌లో.. ఇంతకుముందు మంత్రి గారు చదివి వినిపించారు. రెండు చోట్ల క్లియర్‌గా ఉంది. తేదీ.12.02.2009 నాడు రాజశేఖర్ రెడ్డి గారు ఈ హౌస్‌లో ప్రసంగం చేసిన రోజున మేమిక్కడే ఉన్నాము. ఆయన చేసిన ప్రసంగంలో పలు సందర్భాల్లో ఏమన్నారంటే – Congress party leaders of the region have raised the issue of separate telangana because of negligence. The Congress Legislators from Telangana met the Congress President Mrs. Sonia Gandhi after 1999 Assembly elections and expressed their concern that the Government should develop to Telangana in the integrated state of Andhra Pradesh. The Government of Andhra Pradesh has no objection for the formation of Telangana State in principle and keep that the time has come to move forward decisively on the issue. నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సిన సందర్భం వచ్చిందని ఎప్పుడు చెప్పారు సార్? తేదీ.12.02.2009 నాడు చెప్పారు. ఆ తరువాత ఆయన చనిపోవడం దురదృష్టకరం. ఆయన దుర్మరణం పొందడం, తరువాత రాజశేఖర్ రెడ్డి గారి

తనయుడు ఈ పార్టీని టేకోవర్ చేయడం జరిగింది. ఈ టేకోవర్ చేసిన సందర్భంలో ఇడుపులపాయలో వాళ్ల పార్టీ ప్లీనరీ జరిగింది.

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ : టేకోవర్ అంటారేమిటి? (మైకు లేకుండా)

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: టేకోవర్ అంటే మా భాషలో మీది తల్లి కాంగ్రెస్, వాళ్లది పిల్ల కాంగ్రెస్ కనుక. ఆయన ఒక సెపరేట్ దుకాణం పెట్టారు...

(ఈ సందర్భంలో మంత్రివర్యులు శ్రీ కె. పార్థసారథి అభ్యంతరం వ్యక్తం చేశారు)

ఆయన మరో మంత్రి సార్...
శ్రీ కన్నా లక్ష్మీనారాయణ : స్పీకర్ సార్, రికార్డ్స్ స్ట్రెయిట్ చేయాలి.

MR.SPEAKER: Chandrasekhar Reddy garu, I am advising you, please do not answer to any side comments.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: రైట్ సార్. ఆయన టేకోవర్ చేయలేదు. కొత్త దుకాణం తెరిచాడు సార్...

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ : స్పీకర్ సార్ ఒక్క నిమిషం..

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: రైట్ సార్. ఆయన టేకోవర్ చేయలేదు. మరో దుకాణం తెరిచాడు సార్. మరో దుకాణమంటే ఇప్పుడున్న దుకాణమని అర్థం చేసుకోవాలి.

మిస్టర్ స్పీకర్: లక్ష్మీ నారాయణ గారూ...

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ: అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిది. వాళ్ల నాయకుడు కూడా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి, కాంగ్రెస్ పార్టీని వెన్నుపోటు పొడిచి ఇంకొక పార్టీలోకి వెళ్లిపోయారు. అలాగే, జగన్మోహన్ రెడ్డి గారు కూడా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి, కాంగ్రెస్ పార్టీని గుండెల మీద తన్ని ఈ రోజున ఇంకో పార్టీని పెట్టారు. కాంగ్రెస్ పార్టీలో ఎదిగిన తరువాత, కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని కాళ్లతో తన్నుతోంది వాళ్లిద్దరే. అంతేగానీ, కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ టేకోవర్ చేసిన పరిస్థితి లేదు. ఈ రోజున ఇద్దరూ కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఎదిగి, కాంగ్రెస్ పార్టీని గుండెల మీద తన్ని, కాంగ్రెస్ పార్టీనే విమర్శిస్తున్నారు.

(ఈ దశలో తెలుగుదేశం పార్టీకి చెందిన సభ్యులు కొందరు తమ స్థానాల వద్ద నిలబడి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

మిస్టర్ స్పీకర్: ఒక్క నిమిషం చంద్రశేఖర్ రెడ్డి గారూ... I am advising you again. ఒక్క నిమిషముండండి. I am advising you again, please do not respond to the side conversations. Please address the Chair.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: స్పీకర్ సార్, మంత్రులకు ఇట్లా మధ్య, మధ్యలో ఇంటర్‌ఫియర్ అవ్వడానికి మీరు అవకాశం ఇస్తుంటే ఇబ్బందులు వస్తున్నాయి. మీ ఔదార్యాన్ని వాళ్లు దుర్వినియోగం చేస్తున్నారు సార్. ఇక్కడ నేను అన్నది కూడా కరెక్టే. కాంగ్రెస్‌పార్టీ కన్నతల్లే. ఇప్పుడు ఎక్కడుంది సార్ కాంగ్రెస్ పార్టీ? కాంగ్రెస్(ఐ), వైఎస్సార్ కాంగ్రెస్.. ఇలా దేశంలోనే ఆల్ఫాబెటికల్‌గా ఆ పార్టీ చీలిపోయింది సార్. మరి ఇవాళ నిజంగానే కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి వంటిది. ఎవరికి సార్! కబ్జాదారులకు కన్న తల్లి, అవినీతిదారులకు కన్నతల్లి, అక్రమాలు చేసే వాళ్లకు కన్నతల్లి. దానికో పిల్ల కాంగ్రెస్ ఇది.

MR.SPEAKER: I don't see how you are taking the debate. డిబేట్ కొనసాగించడానికి మీరు సహకరించాలి గానీ, ఈ విధంగా మీరు మాట్లాడటం సబబు కాదు. What is this?

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి గారి పార్టీ అయినటువంటి వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ వాళ్ల రకరకాల విన్యాసాలు మనం చూశాము. ఇడుపులపాయలో చేసిన తీర్మానం ఏమంటే – తెలంగాణా ప్రజల మనోభావాలను గౌరవిస్తున్నాం. తెలంగాణా ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదని చెప్పారు. ఆ రోజున తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదన్న వైఎస్సాఆర్ పార్టీ..

(ఈ సందర్భంలో గవర్నమెంట్ చీఫ్ విప్ శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి గారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ తమ స్థానం వద్ద నిలబడ్డారు)

మిస్టర్ స్పీకర్: ఒక్క నిమిషమండీ..

(తె.దే.పా. సభ్యులు శ్రీ డి. నరేంద్ర కుమార్‌చే అభ్యంతరం)

What do you want to do? Repeatedly, I am advising him not to respond to the side comments.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి : అధ్యక్షా, వారు ప్రసంగం ప్రారంభించేటప్పుడే సీఎం గారు ఏదైతే అడ్రస్ చేశారో.. అందరం కూడా సహనంతో మాట్లాడాలనే మాట మాట్లాడుతూ నా పేరు కోట్ చేశారు. సరే నేను ఆ విషయంలోకి పోవడం లేదు. కానీ, రావుల చంద్రశేఖర్ రెడ్డి గారు

కొంచెం పెద్దమనిషి, కొంచెం పద్ధతిగా మాట్లాడతారని ఆశించాను. కానీ, ఈ రోజు వారు మాట్లాడే మాటల్లో సబ్జెక్టుని వదిలిపెట్టి.. అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ జపం చేయకుండా వాళ్లు బ్రతకలేరా? ఈ రోజు అవన్నీ వారు మాట్లాడితే, మేం కూడా మాట్లాడాల్సి వస్తుంది. అవన్నీ కూడా ..

మిస్టర్ స్పీకర్: ఓకె. మీరు అప్పీల్ చేయండి.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి: సార్, సబ్జెక్టు డీవియేట్ కాకుండా మాట్లాడమనండి. పద్ధతి ప్రకారం మాట్లాడితే మాట్లాడనిస్తాము. లేకపోతే, వారు మాట్లాడే ప్రతి మాటకూ మేం కూడా అడ్డుచెప్పాల్సి వస్తుంది. దయచేసి, పెద్దలు రావుల చంద్రశేఖర్ రెడ్డి గారిని ఆ పద్ధతుల్లో మాట్లాడమని కోరుతున్నాను. అంతేగానీ, కాంగ్రెస్ పార్టీని విమర్శించడం పద్ధతిగా ఉండదు. ఏదన్నా విషయంలో వచ్చినప్పుడు మాట్లాడండి. ఇంతకుముందు మంత్రి గారి గురించి కొన్ని విషయాలు మాట్లాడారు. కాంగ్రెస్.. కాంగ్రెస్.. అని ఎందుకంటారు? పాపం రెండుసార్లు అధికారంలోకి రాకపోయినందుకు వాళ్లకు బాధ ఉండొచ్చు. అంతేగానీ, ఎందుకు సార్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని ..

(ఈ దశలో తెలుగుదేశం పార్టీకి చెందిన సభ్యులు కొందరు తమ స్థానాల వద్ద నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

MR.SPEAKER: Yes. Please advise your members to resume their seats.

(ఈ సందర్భంలో శాసన సభా వ్యవహారాల శాఖామాత్యులు డా.ఎస్. శైలజానాథ్ గారు తమ స్థానం వద్ద నిలబడి తనకు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరసాగారు)

Please leave it at that. Please leave it at that. You are speaking next.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: స్పీకర్ సార్, వాళ్లు ప్రసంగిస్తుంటే, మధ్య మధ్యలో నేను మాట్లాడినట్టు నాకనిపిస్తోంది. ప్రసంగం నాది. నన్ను మాట్లాడనివ్వండి.

డా.ఎస్. శైలజానాథ్: ఒక్క నిమిషం అధ్యక్షా.. (మైకు లేకుండా)

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: మంత్రి గారూ.. Please have patience. అధ్యక్షా, డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి కుమారుడు పెట్టిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.

డా.ఎస్. శైలజానాథ్: ఒక్క నిమిషం అధ్యక్షా.. (మైకు లేకుండా)

MR.SPEAKER: You are speaking next. I will give you an opportunity. You are next in line.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డిః సార్, ఈ సందర్భంగా ఒక విషయం చెబుతాను. వాళ్లు అఖిలపక్షం పెట్టినప్పుడు, వాళ్ల పార్టీ కేంద్ర హోం శాఖా మంత్రి సుశీల్ కుమార్ షిండే గారికి తేదీ.28.12.2012 నాడు ఒక లేఖ వ్రాసింది. "Our party addressed this issue at the first plenary of the party held on 8th and 9th July, 2011. As per the decisions taken in the meeting, we reiterate that our party respect the sentiments of the people of Telangana despite the fact that Art. 3 of the Constitution of India authorized the Central Government alone with the power to take the decision to keep the State in tact or to reconstitute it. You have been plying havoc with our lives. All that we request you is, a solution acceptable to all without injustice. రాష్ట్ర పార్టీలకు సంబంధించి కూడా ఒక పదం చెప్పారు. As part of this, Article 3 was incorporated in the Constitution of India which gave full powers to Central Government alone to make law whether to keep the State in tact or to reconstitute it without giving scope to involvement of political parties and the State Government.

ఉ.11.20

ఏ రాజకీయ పార్టీలకు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇందులో జోక్యం లేని విధంగా ఆర్టికల్-3 క్రింద కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటుకు అధికారం ఉందని మీరు లెటర్ రాసారు. కేంద్ర ప్రభుత్వానికి ఉన్న సార్వభౌమాధికారాన్ని ఉపయోగించి ఈ బిల్లును ఇక్కడకు పంపిస్తే మీరు రకరకాలుగా మాట్లాడుతున్నారు. డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారి కుమారుడు, పేరును విత్‌డ్రా చేస్తున్నాను సార్. ఆ పార్టీ అధ్యక్షుడు జైలుకు వెళ్లక ముందు భిన్నంగా ప్రసంగం చేస్తారు. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత సమైక్యవాదం, ఆ తర్వాత సమన్యాయం అంటారు. అంతకు ముందు తీర్మానం పెట్టండని ఈ రోజు మరలా ఓటింగ్ పెట్టండని అంటాడు. ఎన్నిసార్లు స్టాండ్లను మారుస్తారు? పరకాల ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ విజయమ్మ గారు ఏమి చెప్పారు? తెలంగాణ ఏర్పాటుకు మేము అనుకూలమని చెప్పారు. ఇక్కడికి వచ్చిన తర్వాత రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించినంతవరకు మేమిచ్చిన లేఖకు కట్టుబడి ఉన్నాము, విత్‌డ్రా చేసుకోలేదు. తెలంగాణ విషయంలో తెలుగుదేశం పార్టీ చాలా స్పష్టంగా ఉందనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాము.

తెలుగుదేశం పార్టీని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు, మా మీద ఎందుకు రాళ్లు వేస్తున్నారనే విషయాన్ని ఈ సందర్భంలో గమనించినట్లయితే ప్రస్తుతం ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క ప్రాంతానికి పరిమితమైపోయింది. కానీ తెలుగుదేశం పార్టీ రెండు ప్రాంతాల్లో ఈరోజున ఉంది. ఓట్లు ఉన్నాయి ప్రజలు ఉన్నారు. ఏ చెట్టుకైతే కాయలు పండ్లు ఉంటాయో ఆ చెట్టు పైనే రాళ్లు వేసినట్లుగా తెలుగుదేశం పార్టీ మీద రాళ్లు వేస్తున్నారు. రెండు ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారి అభివృద్ధిని కాంక్షిస్తుంది తెలుగుదేశం పార్టీ అనే విషయాన్ని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకొస్తూ, తెలుగుదేశం పార్టీ విధానాన్ని ప్రశ్నించే ప్రతి రాజకీయపార్టీని ఆత్మ విమర్శ చేసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేయడం ద్వారా మీరు పబ్బం గడుపుకుంటారా? అసలు ప్రపంచంలో ఎక్కడైనా ఈ విధంగా జరుగుతుందా? అధికారంలో ఉన్న రాజకీయపార్టీ నిర్ణయం తీసుకుంటుంది దానికి ప్రతిపక్ష పార్టీలను బాధ్యులనుగా చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవిస్తున్నామని ఇదే హౌసులో చెప్పిన ముఖ్యమంత్రి గారు, భావోద్వేగాలను రెచ్చగొట్టొదని చెప్పిన ముఖ్యమంత్రి గారు, తుపాన్‌ని అయితే ఆపలేను గానీ తెలంగాణాను ఆపుతానని ముఖ్యమంత్రి గారు భావోద్వేగాలను రెచ్చగొట్టలేదా? మ్యాచ్ అయిపోయింది సార్ ఆవార్డ్ ఇవ్వడమే మిగిలింది. కానీ ఇంకా బాల్స్ వేస్తానంటున్నాడు క్రికెటర్ ముఖ్యమంత్రి గారు.

ఈ సందర్భంగా మేము చెప్పదల్చుకున్నదేమంటే, రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పరిమితిని, శాసన సభకు ఉన్న పరిమితిని గురించి ఒక్కసారి మనం సమీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీ పరంగా మేము చెప్పిన అంశాలను గమనిస్తే మేము ఎక్కడా కూడా విభేదించలేదు భిన్నంగా మాట్లాడలేదు. అదే విధంగా ఈ ప్రాంతంలో ఉన్న ప్రజల మనోభావాలను కూడా దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయాలను తిరగదోడే ప్రయత్నం కూడా చేయలేదనే విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ రోజు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. మీరు నిర్ణయం తీసుకున్నారు. మీ ప్రభుత్వం ఇక్కడ కూడా అధికారంలో ఉంది. దీనికి భిన్నంగా మీరు ఏ విధంగా వ్యవహరిస్తారని కాంగ్రెస్ పార్టీని అడుగుతున్నారు.

అదే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సమైక్య ఉద్యమం పేరుతో వారు తిరుగుతున్నారు. అర్థం కాని విషయమేమంటే, మనది ఎంత గొప్ప ప్రజాస్వామ్య దేశమంటే ఎవరైనా జేబు దొంగను పట్టుకుంటే జేబు రుమాలును అడ్డం పెట్టుకొని పోతాడు. వేల కోట్లను తిని కూడా ఇంకా నవ్వుకుంటూ రోడ్ల మీద తిరిగే రాజకీయ పార్టీ రావడం అత్యంత దురదృష్టకరం, బాధాకరమైన విషయం. అట్లాంటి వ్యక్తి యొక్క అవినీతిని గురించి ఈరోజున ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గనుకనే సమైక్యవాదం అనే ఒక క్రొత్త ముసుగులో ఈరోజున పార్టీని తీసుకుపోతున్నట్లుగా మేము, ప్రజలు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కూడా ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. మీరు చేసిన ప్రసంగాలను మీరిచ్చిన లేఖలను గురించి ఒక్కసారి సమీక్ష చేసుకోండి. శాసనసభలో మేమేదో అడ్డుకొని వాకవుట్ అవుతున్నాం లేకపోతే టాకవుట్ అవుతున్నామనే భావనతో వెళితే ప్రజలు ఎవరినీ క్షమించే పరిస్థితుల్లో లేరని మనవి చేస్తున్నాను.

వాస్తవంగా ఒకప్పుడు రాయలసీమకు, రతనాలసీమ అనే ఒక గొప్ప పేరు ఉండేది. మీరు అడగాలి, రాయలసీమకు ఏ సమస్య ఉంది, వారికి ఉన్న ఇబ్బందులు ఏమిటి? ఈ రోజున వాళ్లను మాట్లాడమనండి. ఈ శాసనసభను వేదికగా చేసుకొని ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలను

ప్రతిబింభించే విధంగా మీరు హోమ్ వర్క్ చేయండి, ప్రిపేర్ చేయండి. ఆయా ప్రాంతాల ప్రజల స్థితిగతులను గురించి రిప్రజెంట్ చేసే ప్రయత్నం చేయమని వారిని కోరుతున్నాను.

ఈనాడు కొన్ని ప్రతిపాదనలను కూడా మేము సభ ముందు పెట్టాము. ఈ ప్రతిపాదనల సారాంశమేమంటే ఈ బిల్లును తయారు చేసేప్పుడు ఈ ప్రాంతంలో ఉండే ప్రజల మనోభావాలను సంపూర్ణంగా పరిగణనలోనికి తీసుకోలేదు. కనుక పార్లమెంటు కొన్ని మార్పులను చేయాలనే భావనతో కొన్ని సూచనలను మేము చేయడం జరిగింది.

ఆ మార్పుల్లో ప్రత్యేకించి గవర్నర్‌కి ఇచ్చే అధికారాలను సమీక్ష చేయమంటున్నాం. ఎలెక్టెడ్ గవర్నమెంట్స్ ఉన్నప్పుడు ఎగ్జిక్యూటివ్ పవర్స్‌ని గవర్నర్‌కి ఇవ్వకూడదు అందుకు సంబంధించిన క్లాజ్–8ని సవరణ చేయండని పార్లమెంటును రిక్వెస్ట్ చేయమని సూచించాము. అట్లాగే ఉమ్మడి రాజధానికి సంబంధించి కూడా కొన్ని సూచనలు చేయడం జరిగింది. ఎక్కువ కాలం ఉమ్మడి రాజధానికి ఉండటం వలన ప్రయోజనం కంటే ఆ ప్రాంత ప్రజలకు నష్టం ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రెండేళ్లకు పరిమితం చేయమని క్లాజ్–5 సబ్‌క్లాజ్ 1లో సూచించడం జరిగింది.

అదే విధంగా రెండు ప్రాంతాలకు ఒకే హైకోర్టు అన్న విషయంలో ప్రస్తుత పరిస్థితుల్లో అది సమంజసం కాదన్నది మా భావన. అందుకు ఒకే ఒక్క ఉదాహరణను చెబుతాను. హైకోర్టులో ఈ రోజున ఎందుకు అంత భావోద్వేగాలు వచ్చాయి. అక్కడ ఉద్యోగస్తులు, న్యాయవాదులు ఎందుకు ఇబ్బందులు పడుతున్నారంటే, అక్కడ ఎందుకో inequality వచ్చింది. హైకోర్టులో పని చేస్తున్న సిబ్బందిని మనం చూసినట్లయితే, రిజిస్ట్రార్ జనరల్ ఒక్కరు పనిచేస్తుంటే, తెలంగాణకు సంబంధించిన వారు ఆ పదవిలో ఎవ్వరూ లేరు. రిజిస్ట్రార్లు 8 మంది పని చేస్తుంటే, అందులో తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన వారు ఇద్దరు ఉన్నారు. జాయింట్ రిజిస్ట్రార్లు 5 మంది పని చేస్తుంటే వారిలో ఒక్కరు కూడా తెలంగాణా ప్రాంతానికి చెందిన వారు లేరు. డెప్యూటీ రిజిస్ట్రార్లు తొమ్మిది మంది పని చేస్తుంటే ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు 34 మంది పని చేస్తుంటే వారిలో ఆరు మంది మాత్రమే తెలంగాణా ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. సెక్షన్ ఆఫీసర్లు, స్క్రూటినీ ఆఫీసర్లు, కోర్టు ఆఫీసర్లు 112 మంది పని చేస్తుంటే 10 మంది మాత్రమే తెలంగాణకు సంబంధించిన వారు ఉన్నారు. కోర్టు మాస్టర్లు 134 మంది పని చేస్తుంటే వారిలో 30 మంది మాత్రమే తెలంగాణ వారు ఉన్నారు. డెప్యూటీ సెక్షన్ ఆఫీసర్లు 62 మంది పని చేస్తుంటే వారిలో 7 మంది మాత్రమే తెలంగాణాకు చెందిన వారు ఉన్నారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు 90 మంది పని చేస్తుంటే వారిలో 9 మంది మాత్రమే తెలంగాణా ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు 269 మంది పని చేస్తుంటే వారిలో కేవలం 35 మంది మాత్రమే తెలంగాణా ప్రాంతానికి చెందిన వారున్నారు. టైపిస్టులు 119 మంది పని చేస్తుంటే కేవలం 15 మంది మాత్రమే తెలంగాణా ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. అందుకని ఈ

బిల్లును అమలు చేసిన వెంటనే హైకోర్టును ఏర్పాటు చేయాలి. సుదీర్ఘ కాలం జాయింట్‌గా కొనసాగించడం వలన మరిన్ని ఇబ్బందులు వస్తాయని భావించి ఈ సూచన చేయడం జరిగింది. దానికితోడు పెన్షనర్లకు సంబంధించిన ఆర్టికల్ 59ని కూడా read with Scheduled 8 అని, పెన్షనర్లు ఎవరైతే ఉన్నారో వారిని nativity basis మీద తీసుకోమని కోరడం జరిగింది. అలాగే ఉద్యోగులను అలోకేట్ చేసేటప్పుడు Part-8 Class-76 to 83 "allocation of Employees to the Successor state made on the basis of nativity" ఈ సూచనను కూడా పార్లమెంటు పరిగణనలోనికి తీసుకోవాలని కోరాము.

అలాగే పవర్ సెక్టార్‌కి సంబంధించి Class 92 read with Scheduled-12ని కూడా సవరణ చేయమని పార్లమెంటును కోరాము. అట్లాగే యూనివర్శిటీలకు సంబంధించి హెల్త్ యూనివర్శిటీ, వెటర్నరీ యూనివర్శిటీ, హార్టికల్చర్ యూనివర్శిటీలకు సంబంధించి కూడా పార్లమెంటులో తుది చట్టం వచ్చేటప్పుడు మార్పులు చేయాల్సిందిగా సూచనలు చేయడం జరిగింది. అట్లాగే గిరిజనులకు సంబంధించిన ఒక యూనివర్శిటీని కూడా ఇందులో పొందుపరచమని కోరుతూ ఒక ప్రతిపాదనను కూడా ఇవ్వడం జరిగింది.

ఇవన్నీ ఒక వైపు అయితే 610 జీఓకు సంబంధించి అప్పుడున్న లోపాలు ఏవైతే ఉన్నాయో సవరించేందుకు ఎన్‌టి రామారావు గారు ఒక జీఓను ఇచ్చిన విషయాన్ని ఈ సభ మర్చిపోకూడదు. దానిని అమలు చేసే విషయంలో నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండి గిర్‌గ్లాని కమిటీని వేసిన విషయాన్ని, అదే విధంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి గారి అధ్యక్షతన ఉద్యోగస్తులకు సంబంధించి వేసిన హౌస్ కమిటీ రిపోర్టులను కూడా ఈ బైఫర్‌కేషన్ సందర్భంలో పరిగణనలోనికి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాము. అదే విధంగా శాసన సభకు ఈ బిల్లును పంపించేటప్పుడు రాష్ట్రపతి గారు రాసిన లేఖను గమనించండి.

ఉ. 11.30

అదే విధంగా శాసనసభకు ఈ బిల్లును పంపించేటప్పుడు రాష్ట్రపతి గారు రాసిన లేఖలో ఉన్న సారాంశం "Now, therefore, in pursuance of the proviso to Article 3 of the Costitution of India, I hereby refer the said Bill, i.e The Andhra Pradesh Reorganisation Bill,2013, to the State Legislature of Andhra Pradesh for expressing its views thereon by the twenty-third day of January,2014". దీంట్లో స్పష్టంగా అభిప్రాయాలను మాత్రమే చెప్పమన్నారు. కానీ, ఇటీవల మీరు టేబుల్ చేసిన ఈ పుస్తకంలో ప్రభుత్వం సమాచారం అంటూ టేబుల్ చేశారు. ఇందులో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అనిల్ గోస్వామి గారి లేఖను కూడా పొందుపర్చారు. ఇందులోని పేరా నెం.3 మరియు 4 లో ఒక మాట రాశారు. The purpose of the Draft Bill is abundantly clear, it seems to reconstitute the existing State of Andhra Pradesh into two separate States. The draft bill seeksto provide for the territories of the two States and make necessary supplemental and incidental provisions relating to the representation in

Parliament by the State Legisatures. Distribution of revenues and apportionment of assets and liabilities, managment and development of water resourses, power and other resources and other matters..."Sir, in this letter it has been stated that " since it is a Draft Bill, it awaits clause by clause comments by the Andhra Pradesh State Legislatuare"... జనవరి 6, 2014న గోస్వామి గారు ఈ లేఖను రాశారు. ఈ సభలో పెట్టిన దాంట్లో కామెంట్స్ అనే పదం కూడా వారు వాడారు కాబట్టి ఇది కూడా దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు సంబంధించి కాలయాపన లేకుండా కేవలం వివిధ పార్టీల సూచనలు, సలహాలను కేంద్రానికి పంపించే క్రమంలో మేమిచ్చిన సూచనలు, సలహాలను పొందుపర్చాలని కోరుతున్నాను.

కాంగ్రెస్ పార్టీ, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలు తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేసిన విషయంలో గతంలో కూడా చెప్పాను. అనని మాటను అన్నట్లుగా ఈ రెండు పార్టీలు చిత్రీకరిస్తున్నాయి. దిన పత్రికలకు ఎంత స్వేచ్ఛ ఉన్నదనేది మనకందరికీ తెలుసు. చంద్రబాబు నాయుడు గారు ఇటీవల డిసెంబర్ 30, 2013న ప్రకాశం జిల్లాకు వెళ్లినప్పుడు వారు చేసిన ప్రసంగం గురించి డిసెంబర్ 31, 2013 పత్రికలలో రాసిందేమిటంటే సాక్షి పేపర్, కర్నూల్ ఎడిషన్‌లో "రాష్ట్రాన్ని విభజించాల్సిందే. మరోసారి స్పష్టీకరించిన చంద్రబాబు నాయుడు". అదే విషయాన్ని కరీంనగర్ ఎడిషన్‌లోనేమో "అసెంబ్లీ తీర్మానిస్తేనే విభజన". "ఆర్టికల్ - 3 ప్రకారం విభజించొద్దు, లేదంటే ఒప్పుకోను" స్పష్టం చేసిన చంద్రబాబు. ఒకే సమావేశంలోని ప్రసంగాన్ని సాక్షి పేపర్ ఒక్కొక్క జిల్లా ఎడిషన్‌లో ఒక్కొక్క రకంగా ప్రచురించింది. వీరా మా గురించి మాట్లాడేది? ఫోటో, అక్షరాలు ఏం మారలేదు. కావాలంటే డిసెంబర్ 31, 2013 సాక్షి పేపర్ కర్నూల్, కరీంనగర్ ఎడిషన్‌లను తెప్పించుకొని చూడండి. దీనికి ఎవరు బాధ్యులని నేను ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాను. ఒక పద్ధతి ప్రకారం మా మీద బురద జల్లుతున్నారు. వారు బిల్లు ప్రతులను కాలుస్తామంటున్నారు. కాల్చాల్సి వస్తే బెయిల్ ప్రతులను తప్ప బిల్లులను కాదని రాజశేఖర్ రెడ్డి గారి కుమారుడిని నేను ఈ సందర్భంగా కోరుతున్నాను. కాంగ్రెస్ పార్టీ, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఎప్పటికైనా కలిసిపోతాయని నిన్ననే ఒక పెద్దాయన టి.వి ఛానల్‌లో చెప్పారు.

రాజశేఖర్ రెడ్డి గారి కుమారుడు పదహారు నెలలు జైల్లో ఉండగా బెయిల్ వచ్చే ముందు రోజున జరిగిన ఉత్కంఠ గురించి మనకందరికీ తెలుసు. టి.విలో ప్రతి సోమవారం "పాడుతా తీయగా" అనే ప్రోగ్రాం వస్తుంది. ఈ ప్రోగ్రాంను శ్రీ మేథ అనే సంస్థ స్పాన్సర్ చేస్తున్నది. ఈ ప్రోగ్రాంలో ఒక యాడ్ వస్తుంది. అది ఏమంటే ఒక మహిళ ఇస్త్రీ చేసుకుంటూ రాంబాబు సీ.ఏ పాస్ అవుతాడా అంటుంది. ఇంకొకతను వ్యవసాయం చేస్తూ రాంబాబు సీ.ఏ పాస్ అవుతాడా అంటాడు. మరొకతను ఆటోరిక్షా తుడుస్తూ రాంబాబు సీ.ఏ పాస్ అవుతాడా అంటాడు. ఈలోపు జగపతిబాబు గారు వచ్చి శ్రీ మేథలో చేరాడు, రాంబాబు సీ.ఏ పాస్ అయ్యాడని చెబుతాడు. జగన్‌బాబుకు బెయిల్ వస్తుందా, జగన్‌బాబుకు బెయిల్ వస్తుందా అంటే జగన్‌బాబు కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపాడు కాబట్టే వెంటనే బెయిల్ వచ్చింది...........

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి (మైకు లేకుండా ): అధ్యక్షా, ఒక నిమిషం అవకాశమివ్వండి.

MR.DY.SPEAKER: Yes, Gandra Venkata Ramana Reddy Garu.

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి గారికి రాజకీయాలలో చాలా అనుభవమున్నది. అసలు జగన్ మోహన్ రెడ్డి గారి బెయిల్‌కు, కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధమని అడుగుతున్నాను. రాజ్యాంగంలోని న్యాయసూత్రాలకు అనుగుణంగా కోర్టులు పనిచేస్తాయి. కోర్టు నుంచి జగన్ మోహన్ రెడ్డి గారికి బెయిల్ వచ్చిందా లేదా అన్నది కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు. వారు ప్రతి సందర్భంలో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపినందుకే బెయిల్ వచ్చిందని అంటున్నారు. వారికి వ్యవస్థ మీద నమ్మకం లేదు. నిజంగా రాజ్యాంగం మీద గౌరవం ఉంచి మాట్లాడాల్సిన మాటలు ఇవి కావు కాబట్టి సంబంధిత అంశాన్ని రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నాను.

MR.DY.SPEAKER: Chandrasekhar Reddy Garu please carry on.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: అధ్యక్షా, చీఫ్ విప్ గారు అంత అమాయకంగా నటిస్తే ఎలాగండీ! జగన్ మోహన్ రెడ్డి గారికి బెయిల్ ఎలా వచ్చిందనేది ఎల్.కె.జి పిల్లలకు కూడా తెలిసిపోయింది. ఈ విషయం నేను చెప్పడం కాదు కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులే స్పష్టంగా చెప్పారు. కోర్టులను నిందించడానికి లేదు. జగన్ మోహన్ రెడ్డి గారి బెయిల్ గురించి వాదనలు జరగబోతున్నాయి, సి.బి.ఐ. వేసే మెమోలో కోర్టు బెయిల్ మంజూరు చేస్తే మాకేం అభ్యంతరం లేదని ఉన్నది. జేబు దొంగలు కూడా జేబు రుమాల్‌ను అడ్డం పెట్టుకుంటారు. కానీ దురదృష్టకరమైన విషయమేమిటంటే జగన్ మోహన్ రెడ్డి గారు జైయిల్ నుంచి వస్తున్నప్పుడు స్వాతంత్ర పోరాట యోధుడి మాదిరిగా చేతులూపుకుంటూ రావడమేంటండీ?

ఇందాక గండ్ర వెంకటరమణా రెడ్డి గారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి గారి బెయిల్‌కు మాకేం సంబంధమున్నదని అన్నారు. సి.బి.ఐకి ఉన్న స్వయంప్రతిపత్తిని లోక్‌పాల్ బిల్లు రాకముందు ఎంత దుర్వినియోగం చేశారన్న విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ అని దేశమంతా కోడై కూసిన విషయాన్ని మర్చిపోవద్దు. సి.బి.ఐ. డైరెక్టర్‌గా పనిచేసిన జె.డి లక్ష్మీనారాయణ గారికి ఇప్పటివరకూ పోస్టింగ్ ఇవ్వలేదంటే వీరి ఒప్పందంలోని భాగంగానే వారికి పోస్టింగ్ ఇవ్వడం లేదని బయట జనం చెప్పుకుంటున్నారు కానీ నాకంత అనుభవం లేదు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం అటువంటి అధికారుల మీద కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారా లేదంటే పక్క దారి పట్టిస్తున్నారా, లేదంటే ఒప్పందంలో భాగమా అన్నది కూడా చెప్పాలి.

సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు, మాటల మాంత్రికుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తడిగుడ్డతో గొంతు కోసిందని అన్నారు. ఈ విషయాన్ని దిన పత్రికలన్నీ

ప్రధాన శీర్షికలు పెట్టి ప్రచురించిందంటే మీరొకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. మాట్లాడితే మమ్మల్ని కుమ్మక్కయ్యారని అంటున్నారు. మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారికి బెయిల్ కావాలా? వారేమైనా కేసులలో ఉన్నారా? అసలు కాంగ్రెస్ పార్టీతో ఎందుకు మేం కుమ్మక్కు కావాలి? తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పనిచేసిన మంత్రులు, అధికారులు ఇప్పుడు మీ పార్టీలో ఉన్నప్పటికీ ధైర్యంగా కాలర్ ఎత్తుకొని మీ పక్కన తిరుగుతున్నారు. మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పనిచేసిన అధికారులకు ఉన్నతమైన పదవులు వచ్చాయి. రిజర్వ్ బ్యాంకు గవర్నర్లు అయ్యారు. మీ ప్రభుత్వంలో పనిచేసిన ఐ.ఏ.ఎస్ అధికారులు జైలు నుంచి బయటికొచ్చేటప్పుడు చిక్కిశల్యమై అనారోగ్యంతో బయటికొస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ సీమాంధ్రలో తుడిచిపెట్టుకుపోయినా సరే, జగన్ మోహన్ రెడ్డి గారు బెయిల్ మీద బయటికొచ్చి ఆ పార్టీని ఒడ్డెక్కిస్తాడనే ఉద్దేశంతోనే రెండు పార్టీలు ఒప్పందం చేసుకున్నాయని నేను చెబుతున్నాను. తెలంగాణ, సీమాంధ్రులకు సంబంధించి తెలుగుదేశం పార్టీ పరంగా స్పష్టంగా నేను చెబుతున్నదేమిటంటే మా నాయకుడిచ్చిన లేఖను విరమించుకోకుండా కొనసాగిస్తున్నాము. ప్రభుత్వం పునరాలోచన చేసుకోవలసిన అవసరమున్నది. మీరు చేసిన నిర్ణయాలను, విధి విధానాలను ఒకసారి సమీక్షించుకోవాలి.

తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతున్న ఈ సందర్భంలో మేం తెలంగాణ బిల్లు గురించి చర్చిస్తుంటే ముఖ్యమంత్రిగారేమో ముప్పై లక్షల టీపర్లులను తయారు చేయిస్తున్నారని అంటున్నారు. ఇది మాకైతే అర్థం కావడం లేదు. ఈ బిల్లు మీద ఓటింగ్ వస్తుందని, ఇంకొకటి వస్తుందని ముఖ్యమంత్రి గారు చెబుతున్నారు. నాకు సంబంధించినంతవరకు గోస్వామి గారు రాసిన లేఖ ప్రకారం comments of the legislature అని అడిగారు కాబట్టి దానిపట్ల దశ, దిశలొద్దు. చాలా స్పష్టంగా ఉన్నదని నేను భావిస్తున్నాను. గడువు పెంచే విషయంలో కూడా రకరకాల వ్యాఖ్యానాలు వస్తున్నాయి. కేటాయించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరమున్నది. అవసరమనుకుంటే రాత్రింబవళ్లూ ఎంత మంది సభ్యులు మాట్లాడితే అంత మంది సభ్యులకు అవకాశమిచ్చి మాట్లాడనివ్వండి. రాష్ట్ర శాసనసభలో తెలంగాణ బిల్లుపై చర్చకు జనవరి 23వ తేదీ చివరి తేదీ కాబట్టి తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఫిబ్రవరి మొదటి వారంలో ఉండాల్సిందేనని ప్రజలు ఆశిస్తున్నారు.

ఉ.11.40

అందులో చాలా క్లారిటీ ఉందని నేను అనుకుంటున్నాను. అదే విధంగా ముసాయిదా బిల్లు పైన చర్చ నిమిత్తం గడువు పెంచే విషయంలో కూడా రకరకాలుగా వ్యాఖ్యానాలొస్తున్నాయి. కానీ సమయం కావల్సినంతగానే భారత రాష్ట్రపతి గారు ఉభయ సభలకు ఇచ్చారు. ఇచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. అవసరమైతే రాత్రింబవళ్లు గౌరవ సభ్యులందరిచేత సభలో మాట్లాడించండి. 23వ తేదీ అయిన కటాఫ్ డేట్

తరువాత తెలంగాణ ప్రాంత ప్రజానీకం ఎదురుచూస్తుంది. అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఫిబ్రవరి మాసం మొదటి వారంలో ఉండాల్సిన అవసరముందని కూడా తెలంగాణ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు. నేను ఏ ఒకరికీ వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేకత, స్వయంప్రతిపత్తి, ఒక ఆలోచన విధానం, జీవనశైలి ఉంది. అయితే సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రాన్ని ఏలిన దుష్ఫలితాలు తెలంగాణ ప్రాంతంలో కనబడుతున్నాయి. స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామాధికారుల వ్యవస్థను రద్దు చేస్తే, ఇవాళ కేంద్ర ప్రభుత్వం రక రకాల భాషలను మాట్లాడుతోంది. నిజమైన స్వాతంత్ర్యం తెలంగాణ ప్రజలకు వచ్చిందనే విధంగా కేంద్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి మాట్లాడుతున్నారు. అదే విధంగా స్వర్గీయ శ్రీ ఎన్.టి. రామారావు గారు పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు విషయమై తీసుకున్న నిర్ణయంపైన ఆనాడు శ్రీ ఎస్. జైపాల్ రెడ్డి గారు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కూడా నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, నేను తెలంగాణ ప్రాంత ప్రజల మనోభిష్టాన్ని, వాళ్ల ఆలోచనలను రిఫ్లెక్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నాను. నేను మాట్లాడే అంశాలు ఇతరులకు నచ్చకపోతే అందుకు చింతవ్యుడను. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఢిల్లీకి ఎవరైనా విదేశస్థులు వస్తే హైదరాబాద్ నగర సందర్శనకు వెళ్లిరండని అందరూ సూచించేవారు. కానీ ఇవాళ ఆస్ట్రేలియా, అమెరికా వెబ్‌సైట్లో పెట్టారు. హైదరాబాద్‌కు వెళ్లాలంటే "మీ ఓన్ రిస్క్" అనే మాటలను చెబుతున్నారు. షాపుల ముందు ఒక బోర్డ్ ఉంటుంది. ఏమిటంటే "cycles kept at owner's risk" అని. హైదరాబాద్‌కు ఎవరైనా సందర్శనకు రావాలంటే భయపడే పరిస్థితిని కల్పించారు. హైదరాబాద్ నగరంలో ఏది మిగిల్చలేను. నేను శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారి గురించి ఎందుకు ఇంతగా చెప్పాల్సిన అవసరముందంటే తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆస్తులనన్నింటినీ కొల్లగొట్టినటువంటి అతను ఇవాళ మళ్లీ సమైక్యవాద ముసుగులో మరోసారి ఏవైనా చిన్న, చిన్న ఆస్తులు మిగిలి ఉంటే అవి కూడా కొల్లగొడతాడోననే భయం తెలంగాణ ప్రాంత ప్రజానీకానికి ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కూడా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఈ మధ్యే హైదరాబాద్ నగరంలో ఒక ఉదంతం వెలుగులోకి వచ్చింది. అక్రమంగా స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తే, శ్రీమతి నిరజా రావు అనే మహిళ ఒంటరి పోరాటం చేయడం జరిగింది. దేశంలో చట్టాలు బాగున్నాయి, న్యాయ వ్యవస్థ బతికుంది కనుకనే శ్రీమతి నిరజారావు ఒంటరి పోరాటం ఫలితంగా తనకు చెందిన ఆస్తిని స్వాదీనం చేసుకునే క్రమంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని జి.హెచ్.ఎం.సి. అధికారులు కూల్చివేయడం జరిగింది. తద్వారా అవినీతి కోటలు బద్దలవడం ప్రారంభమైందనే విషయాన్ని ఈ సందర్భంగా నేను గుర్తుచేస్తున్నాను. తెలంగాణ ప్రాంత ప్రజల ఆస్తులను కొల్లగొట్టిన వారి ఆస్తులను కూడా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్వాదీనం చేసుకొని ఉండాల్సింది.

అధ్యక్షా, సి.బి.ఐ. వేసిన పది చార్జ్‌షీట్లలో మొదటి ముద్దాయి. పది చార్జ్‌షీట్లలో మొదటి ముద్దాయి అయిన వ్యక్తి కొల్లగొట్టిన ఆస్తులన్నీ తెలంగాణ ప్రాంతానికి చెందినవే. ఆ భూములు

హైదరాబాద్ మరియు రంగారెడ్డి జిల్లాలకు చెందినవే. భూములన్నీ కొల్లగొట్టబడినవే. రేపొద్దున తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని యాక్టివిటీస్‌కు భూములు అవసరం. ప్రభుత్వం కొల్లగొట్టబడిన భూములను స్వాదీనం చేసుకుని ఆ భూములు మళ్లీ తెలంగాణ ప్రాంతానికే చెందే విధంగా నిర్ణయం తీసుకోమని నేను ఈ సందర్భంగా సభాముఖంగా కోరుతున్నాను. తెలుగు దేశం పార్టీని పదే పదే నిందించి పబ్బం గడుపుకునే రోజులు పోయాయనే విషయాన్ని నేను ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తున్నాను. మేం అధికారంలో ఈనాడు లేం, ప్రతిపక్షంలో ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ. ప్రభుత్వ నిర్ణయాలను మేం ప్రభావితం చేయలేం. ఎవరితోనూ కుమ్మక్కు కావల్సిన అవసరం మాకు లేదు. మాకు జైలు లేదు, బైలు లేదు, లావాదేవీలు లేవనే విషయాన్ని కూడా నేను మరొకసారి స్పష్టంగా చెప్పదలచుకున్నాను.

అధ్యక్షా, ఈనాడు టి.వి. చానళ్లు కూడా విరివిగా అసత్య ప్రచారాలు సాగిస్తున్నాయి. ఒక టి.వి. చానల్ ఉంది. గతంలో మనకు ఒక స్పోర్ట్స్ చానల్ ఇ.ఎస్.పి.ఎన్. అనేది ఉండేది. కానీ ప్రస్తుతం "ఎ.ఎస్.పి.ఎన్." చానల్ ఉంది. అంటే "ఆత్మ స్తుతి పర నింద" పొద్దున్నే మమ్మల్ని పొగడాలి, మిమ్మల్ని తిట్టాలి. ఇదేమైనా " సుప్రభాత సేవ" నా సార్. ఇంత దౌర్భాగ్యమా? అన్నింటిని రాజకీయ పార్టీలు చేసే వ్యయం క్రింద లెక్కించాల్సిన అవసరముంది. మా పార్టీకి చానళ్లు, దిన పత్రికలు లేవు. ప్రజల మనోభావాలే మాకు రక్ష. అదే విధంగా మా పార్టీ ఎవరితోనూ కుమ్మక్కు కాదు.

మన దేశంలో ఉన్న పత్రికా స్వేచ్ఛను ఆర్టికల్ 14 క్రింద గానీ, ఆర్టికల్ 19 క్రింద గానీ ఉన్న స్వేచ్ఛను దుర్వినియోగం చేశారు. ఆ దుర్వినియోగ ఫలితమే తెలంగాణ ప్రాంత ఆస్తులు కొంత మంది చేత కొల్లగొట్టబడటం. ఆ విధంగా కొల్లగొట్టిన వ్యక్తులే ఇవాళ మళ్లీ సమైక్యవాదం పేరుతో సభకు వచ్చి రణరంగం సృష్టించి వాకౌట్‌ల పేరుతో కొత్త డ్రామాకు తెరదీస్తున్న విషయాన్ని నేను తమకుచెప్పదలచుకున్నాను. ముసాయిదా బిల్లును సమర్థిస్తునే, బిల్లులో ఉన్న లోపాలపైన, తెలంగాణ ప్రాంతానికి కావల్సిన సౌకర్యాలపైన మా అభిప్రాయాలను చెబుతున్నాం. మేం అమెండ్‌మెంట్స్ ఇవ్వలేదు కానీ ప్రతిపాదనలను ఇచ్చాం. అమెండ్‌మెంట్స్ చేసే అవకాశం లేదనేదే మా భావన. అందుకే మేం ప్రతిపాదనలిచ్చాం. అన్నింటినీ ఈ సభ పరిగణలోకి తీసుకుని పార్లమెంట్ దృష్టికి తీసుకుపోవాల్సిన అవసరముందని కోరుతూ వ్యవసాయానికి సంబంధించి, ఇరిగేషన్‌కు సంబంధించి కొన్ని విషయాలను నేను ప్రస్తావించదలచాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: చంద్రశేఖర్ రెడ్డి గారూ ముగించండి. అందరూ మాట్లాడాల్సిన అవసరముంది. అందరి అభిప్రాయాలను సభ తీసుకోవాల్సి ఉంది. దయచేసి త్వరగా మీ ప్రసంగాన్ని ముగించండి.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: ముగించమంటారా సార్. ఇది చాలా సుదీర్ఘ పోరాటం సార్.

అధ్యక్షా, నీటి పారుదల ప్రాజెక్ట్ అయినటువంటి పోలవరం ప్రాజెక్ట్‌ను "జాతీయ ప్రాజెక్ట్" గా గుర్తిస్తున్నట్టుగా ముసాయిదా బిల్లులో పొందుపర్చబడింది. అందుకుగాను ఎవరికీ అభ్యంతరం లేదు కానీ "ప్రాణహిత - చేవెళ్ల" ప్రాజెక్ట్‌ను కూడా జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించాల్సిన అవసరముంది. తప్పనిసరిగా తెలంగాణ ప్రాంత ప్రజలు అదే కోరుకుంటున్నారు. ఆ ప్రాజెక్ట్ వల్ల తెలంగాణ ప్రాంతంలోని ఆరేడు జిల్లాల్లో వ్యవసాయానికి నీరు అందుతుంది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మేం ఒక మార్పును ప్రతిపాదించాం. "ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్ట్" ను కూడా జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించి కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించమని మేం కోరడం జరిగింది. అదే విధంగా నేను ప్రస్తావించిన విశ్వవిద్యాలయాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ నిధులతో స్థాపించాల్సిన అవసరముంది. తద్వారా కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం పైన ఆర్థిక భారం పడదు. తెలంగాణ ప్రాంత వనరులు కొంత మంది స్వార్థ ప్రయోజనాల కొరకు కొల్లగొట్టబడ్డాయి. అందువల్ల పునర్నిర్మాణం కావలంటే ఎక్కువ సమయంతో పాటు ఆర్థిక భారం కూడా పడుతుంది. కేంద్ర ప్రభుత్వమే తాను ప్రస్తావించిన అంశాల్లో ఉదారంగా వ్యవహరించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా సభా ముఖంగా కోరుకుంటూ మరొకసారి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని మా ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తెరిగి నేను ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. ఎవరు కోరినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లో కూడా మీరు ముసాయిదా బిల్లుపైన జరిగే చర్చకు సంబంధించి గడువు పెంచడానికి ఇష్టపడవద్దు. గడువు పెంచడం వల్ల తెలంగాణ ప్రాంతానికి ప్రయోజనం కంటే నష్టమే జరుగుతుంది. ఎందుకంటే భావోద్రేకాలు రెచ్చగొట్టమని చెబుతూనే అప్పుడప్పుడు మనం స్లిప్ అవుతుంటాం. అందుకే రిస్ట్రెన్‌గా ఉండటానికి, 23వ తేదీ వరకు అందరికీ తగినంత సమయం ఉంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ముసాయిదా బిల్లు పైన డిబేట్‌ను కొనసాగిస్తూ, ఎవరైతే డ్రామా ఆడుతున్నారో వారి ఆట కట్టించవలసిన సమయం ఆసన్నమైంది. క్రికెట్ గురించి గౌరవ ముఖ్యమంత్రి గారికి బాగా తెలుసు. క్రికెట్‌లో మూడు రకాల ప్లేయర్స్ ఉంటారు. కొందరు వ్యకిగా ఆడుకుంటారు, కొందరు టీమ్ స్పిరిట్‌తో ఆడుకుంటారు అదే విధంగా మరి కొందరు గ్యాలరీ కొరకు ఆడతారు. ప్రస్తుతం వాకౌట్ చేసి వెళ్లిపోయిన వాళ్లు గ్యాలరీ కోసం ఆడే టీమ్ సార్. అంటే జనాల కోసం ఆడతారు. వ్యక్తి కోసం, శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మెప్పు కోసం, గ్యాలరీని మెప్పించడం కోసం ఆడే టీమ్ అది. టీమ్ కోసం మేం ఆడుతున్నాం. తెలంగాణ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించమని మా పార్టీ కోరుతోంది. అన్యాయం గానీ, నష్టం గానీ ఏ ప్రాంతంలోనైనా జరిగితే మీరు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించి, సమస్యలను పరిష్కరించే అవకాశం మీకు ఉంది. కానీ విభజనను అడ్డుకోవడం ద్వారా మరింత అగ్గిని మీరు రాజేసిన వాళ్లౌతారు. తద్వారా ఎవరికీ సత్ఫలితాలు రావనే విషయాన్ని ఈ సందర్భంగా చెబుతున్నాను. ఎవరైనా ఒకటే చెబుతారు. ఇప్పటికే భిన్నమైన ఆలోచనలు సంస్కృతి, సాంప్రదాయాలున్నాయి. రెండు రాష్ట్రాలుగా విడిపోయినా మనం అన్నదమ్ములుగా కలిసి ఉందామని మేం చెబుతున్నాం. కొత్తగా ఏమీ మేం చెప్పడం లేదు. అందుకే అందరూ విశాల దృక్పథంతో ఆలోచించాల్సిన అవసరముంది. చర్చకు విశాలమైన దృక్పథంతో మీరు అంగీకరించారు కనుక చర్చలో చెప్పదలచుకున్న అన్ని

అంశాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించే ప్రయత్నం చేయమని సభాముఖంగా కోరుకుంటున్నాను. అదే విధంగా మేమిచ్చిన చిన్న చిన్న సూచనలన్నింటినీ కూడా తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరముంది. ఇక్కడ మేం కోరేదొక్కటే. ఇంకా ప్రజలను మభ్యపెట్టే ధోరణితో ప్రభుత్వం ముందుకుపోవద్దు. గౌరవ ముఖ్యమంత్రి గారు క్రికెట్ పరిభాషలో మాట్లాడుతున్నారు. చివరి బంతి, చివరి బ్యాటింగ్, నేను బ్యాటింగ్ చేస్తున్నా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిల్చిపోతుంది, నేను స్టార్ బ్యాట్స్‌మెన్ అనే విధంగా మాట్లాడుతున్నారు. అవన్నీ వద్దు. ఇప్పటికే సమయం మించిపోయింది. మ్యాచ్ అయిపోయింది. ఆ విషయంపైన మన దృష్టి కేంద్రీకరించి ప్రజల్లో భావోద్రేకాలను రెచ్చగొట్టవద్దనే విషయాన్ని సభా నాయకుడికి నేను విజ్ఞప్తి చేస్తూనే, ఇందులో ఎవరు గెలవొద్దు, ఓడిపోవద్దు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాడటం వల్ల మేం ఎవరిమీద గెల్చినట్టుగా భావించడం లేదు. అదే విధంగా ప్రత్యేక రాష్ట్ర ం ఏర్పడింది కనుక మీరు ఓడినట్టుగా కూడా భావించవద్దు. రెండు రాష్ట్రాలుగా విడిపోయి అన్నదమ్ములుగా కలిసి ఉందామని విజ్ఞప్తి చేస్తూ, ఈనాడు సభలో తెలంగాణ ముసాయిదా బిల్లుపైన మాట్లాడేందుకు మీరిచ్చిన అవకాశానికి, మా పార్టీ అధ్యక్షుడు నాకిచ్చిన అవకాశానికి, నా నియోజకవర్గ ప్రజలకు మరొకసారి కృ తజ్ఞతలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను. నమస్కారం.

(సభలో ప్రతిపక్ష సభ్యుల చప్పట్లు)

శ్రీ జూలకంటి రంగారెడ్డి (మిర్యాలగూడ): అధ్యక్షా, విభజనకు సంబంధించిన ముసాయిదా బిల్లుపైన అధికార పక్షం, ఇతర పక్షాలకు సంబంధించినటువంటి గౌరవ సభ్యులు సభలో మాట్లాడినటువంటి విషయాలను రాష్ట్ర ప్రజలందరూ వినడం, టి.వీ.ల్లో, పత్రికల్లో చూడటం జరుగుతోంది. ఒకే పార్టీకి సంబంధించిన సభ్యులు రెండు రకాలుగా అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్న విషయాన్ని కూడా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. ఇవాళ ఎ.ఐ.సి.సి. అధ్యక్షురాలు ఒక నిర్ణయం తీసుకుని రాష్ట్ర విభజనకు పూనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా ఇక్కడి పి.సి.సి.అధ్యక్షులు సమైక్యంగా రాష్ట్రం ఉండాలనే విధంగా మాట్లాడుతున్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రి గారు విభజనకు అనుకూలంగా ఒక నిర్ణయం తీసుకుంటే, అందుకు భిన్నంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు రాష్ట్ర విభజన ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీలు లేదనే ధోరణిలో ఇక్కడ మాట్లాడుతున్నారు. అంటే కేంద్రంలో ప్రధాన మంత్రి గారు ఒక అభిప్రాయం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి గారు ఒక అభిప్రాయం, ఎ.ఐ.సి.సి. అధ్యక్షురాలు ఒక అభిప్రాయం, పి.సి.సి. అధ్యక్షులు ఒక అభిప్రాయం, అదే విధంగా మంత్రులు, ఎం.పి.లు, ఎమ్మెల్యేలు ఒకే పార్టీకి చెందిన సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తపర్చడం జరుగుతోంది. తద్వారా ప్రయోజనం ఉండదు. తెలంగాణ అంశమనేది ముఖ్యమైన రాజకీయపరమైన అంశం. అందరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరముంది. అందరూ గుండెల మీద చేయి వేసుకుని ఆలోచన చేయాలి. ఆషామాషీ సమస్య కాదు తెలంగాణ అంశం. మన రాష్ట్రం ఏర్పడి యాభై ఏడు సంవత్సరాలైంది. విభజనకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చర్చ సభలో జరుగుతుంటే ఆషామాషీగా సభ్యులు ఎవరి

ఇష్టమొచ్చినట్టుగా వారు మాట్లాడమంటే దాని అర్థం ఏమిటి? ఇది అవకాశవాదం, ద్వంద్వ వైఖరి తప్ప మరొకటి కాదు.

ఉ.11.50

ఇది అవకాశ వాదం, ధ్వంద వైఖరి, ప్రజలను కన్‌ఫ్యూజ్ చేసి వారికి మరింత నష్టం కలిగించేటువంటి ఆలోచన తప్ప మరొకటి కాదని నేను చెప్పదలచుకున్నాను. అదే విధంగా కేంద్రంలో కానీ, రాష్ట్రంలో కానీ చూస్తే 40 సంవత్సరాలపైన కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో 17 సంవత్సరాల పాటు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నాయి. నాటి నుండి నేటి వరకు పరిపాలన సాగించిన పాలకుల యొక్క వైఫల్యాలే ఈ నాటి ఈ పరిస్థితికి కారణం. రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో కుదుర్చుకున్న పెద్ద మనుష్యుల ఒప్పందం సక్రమైన పద్దతుల్లో అమలు జరుగుతోందా? లేదా? వెనుకబడిన ప్రాంతాలను మనం ఏ రకంగా అభివృద్ధి చేస్తున్నాం? తరువాత ఒకే ప్రాంతానికి సంబంధించిన వారు ఎక్కువ కాలం అధికారంలో ఉండి పెత్తనం చేసేటువంటి పరిస్థితి ఇప్పుడు వుంది. దానితో మిగతా ప్రాంతాల వారు బాధ పడుతున్న పరిస్థితి ఈ నాడు వుంది మరి దానిని మీరు ఎందుకు గమనించలేకపోయారు? కాంగ్రెస్ పార్టీ జాతీయపార్టీ. కాబట్టి అది రాష్ట్రంలోని అన్నిప్రాంతాల నాయకులను దృష్టిలో ఉంచుకొని సక్రమైన పధ్ధతుల్లో పరిపాలన సాగించాలి దానిని గురించి ఎప్పడైనా ఆలోచించారా సార్? ఎంతసేపూ సీట్లు ఓట్లు, అధికారం తప్ప మరొకటి లేదు. తరువాత ఎవరికి తోచిన పధ్ధతుల్లో వారు వారి ప్రభుత్వాలను కొనసాగించి బయటకు పోవడం తప్ప మరొకటి కాదు. మన రాష్ట్రం ఏ పరిస్థితుల్లో ఏర్పడింది? అలా ఏర్పడిన రాష్ట్రం సమైక్యంగానే ఉండాలంటే సమగ్రంగా అభివృద్ధి జరగాలి. సమగ్రంగా అభివృద్ధి కావడానికి ఒక ప్రణాళిక, ముందు చూపు, చిత్తశుద్ధి అనేటువంటివి ఉండాలి. అవి ఏమి లేకపోవడం వల్లనే ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు బలపడ్డాయి. అదే నేడు ఈ పరిస్థితి రావడానికి కారణంగా మారింది. నాటి నుండి నేటి వరకూ అధికారంలో ఉండి పరిపాలిస్తున్న పాలకులయొక్క వైఫల్యమే ఇందుకు బలమైన కారణం.

(శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస రావు తమ స్థానం నుండి లేచి మాట్లాడేందుకు ప్రయత్నం చేశారు)

వారియొక్క పాపాలవల్లనే, వారియొక్క నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి రావడం జరిగింది. అందుకు అధికారంలోఉన్నటువంటి పాలకులు బాధ్యత వహించాలి. మీరు ఎంత కాదు అన్నప్పటికీ అది నూటికి నూరు శాతం వాస్తవమే. మీరు జాగ్రత్తలు తీసుకొని సరియైన పధ్ధతుల్లో పరిపాలన సాగించి ఉండి ఉంటే, అన్నీ ప్రాంతాల ప్రజల్ని దృష్టిలో ఉంచుకొని న్యాయమైన పరిపాలన సాగించి ఉంటే, ప్రాంతీయ అసమానతలు వచ్చి ఉండేవే కావు. ఆర్థిక అసమానతలు పెరిగేవీ కావు. అది జరగని కారణంతోనే ఈ సమస్యలు ముందుకు వచ్చాయి. ఈ సమస్యలు బలపడడానికి అవకాశం కల్పించారు తప్ప మరొకటి కాదు. ఈ రోజు మీరెంత కేకలేసినా, మీరు మాట్లాడుతున్నది "

గాజుకొంపల్లో కూర్చొని రాళ్లేసుకున్నట్లు" "దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా" ఉంది. ఎవరైతే ఈ తరహా పాపాలు చేశారో వారే ఇప్పుడు మాట్లాడుతున్నారు. వీటిని ప్రజలెవరూ నమ్మేటువంటి పరిస్థితి లేదని చెప్పదలచుకున్నాం. ముఖ్యంగా ఈ రోజు ఉద్యమం నడుస్తోంది, రాజకీయ పార్టీలు దేశ, రాష్ట్ర భవిష్యత్తు కోసం చట్ట సభల్లో కొన్ని చట్టాల్ని తీసుకు వచ్చేందుకు, అందరూ లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. కానీ నేడు రాజకీయపార్టీలు ఉద్యోగ సంఘాల ఉద్యమంలో పాల్గొన వలసిన పరిస్థితి ఈ నాడు నెలకొంది. వారు కూర్చోమంటే కుర్చోవడం, లెమ్మంటే లేవడం, రాజీనామా చేయమంటే చేయటం, రాజీనామ చేయద్దంటే చేయకుండా ఉండటం ఇదేనా సార్ ? రాజకీయ పార్టీలు చేయాల్సింది? రాజకీయపార్టీలు రాష్ట్రం సమైక్యంగానే ఉండాలన్నా, విడిపోవాలన్నా లేదా ఎటువంటి చట్టాలు తీసుకురావాల్సి వచ్చినా ఆ అవసరం ఉందో లేదో గమనించి ప్రజల సమస్యల్ని ఏ రకంగా పరిష్కారించ గలమనేటువంటి విషయాలపై రాజకీయంగా ఆలోచించాలి, కానీ రాజకీయ పార్టీలు ఉద్యోగ సంఘాల ఉద్యమంలో పాల్గొనడం వారి వెంట పోవటమనే పరిస్థితి ఉండకూడదు. దీనిని రాజకీయ పార్టీగా మీ నిర్ణయమేమటి? మీకు గల బాధ్యతపై మీరేమి ఆలోచిస్తున్నారనేటువంటి విషయాన్ని మీరు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉందని ఈ సందర్భంగా రాజకీయ పార్టీలకు నేను తెలియజేస్తున్నాను. మేము ఎక్కడ కూడా, ఈ పోరాటంలో లేము.

తెలంగాణా ఉద్యమంలో గానీ సమైకాంధ్ర ఉద్యమంలో గానీ మేము లేము. మా పార్టీ అభిప్రాయాన్ని మొదటి నుండి చెబుతునేవున్నాం. మొదటి నుండి కూడా అయ్యా ఇలాంటి పరిస్థితి వస్తుందని సుందరయ్యగారు రాష్టాన్ని సమగ్రంగా అభివృద్ధి చెయకపోతే రాబోయే కాలంలో ప్రాంతీయ, ఆర్ధిక అసమానతలు పెరిగి మళ్లీ పెద్దఎత్తున ఉద్యమాలు వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ముందుజాగ్రత్తగా ఈ రాష్టాన్ని సమగ్రంగా, ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాల్సి ఉందని ఆనాడే ఈ శాసనసభలో చెప్పారు. వారి మాటలు ఎవరైనా పట్టించుకున్నారా సార్ ? అందుకోసమే మా పార్టీ మొదటి నుంచి చిన్న రాష్ట్రాలుగా ఉండటం వల్ల ఆయా రాష్ట్రాలు బలహీనంగా ఉండి కేంద్రంపై పోరాటం చేసి నిధులు తెచ్చుకోజాలవనీ, రాష్ట్రం పెద్దదిగా ఉండడం వల్లనే అది సాధ్యమౌతుందని, ఉన్నటువంటి వనరులను వినియోగించుకొని మరింతగా అభివృద్ధికి వీలయ్యే అవకాశం ఉందని జాతీయ స్థాయిలో మేము ఒక నిర్ణయం తీసుకున్నాం. దానికే కట్టుబడే మేం ఉండటం జరిగింది.

రాష్ట్రాభివృద్ధి అనేది పెద్ద రాష్ట్రమా? చిన్నరాష్ట్రమా? అనేదాన్ని బట్టి కాదు, పరిపాలించే వారి బుద్ధిని బట్టి ఉంటుంది. పాలకుల బుద్ధి సరిగా లేని కారణంగానే ఈ నాడు ఈ పరిస్థితి రావడం జరిగింది. దీనికి కచ్చితంగా బాధ్యత వహించాలి, లేని యెడల తగిన శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కూడా ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. 1956వ సంవత్సరంలో రాష్ట్రం ఏర్పడిన తరువాత ఒక ప్రణాళికా బద్ధంగా కొన్ని కార్యక్రమాలు చేయనందున ఆ నాడు " విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలి " అని కమ్యూనిష్టులు డిమాండ్ చేశారు. ప్రజారాజ్యం రాలేదు సార్, ప్రజల్ని విభజించేటువంటి రాజ్యాలు పరిపాలన చేశాయి. ప్రజారాజ్యం రాకపోవడం వల్లనే ఈ రోజు ప్రజల

మధ్య ఐక్యత లేకుండా అనేక అసమానతలు పెరిగి అనేక తత్వాలు బలపడడానికి అవకాశం ఏర్పడింది. ప్రజల్ని విభజించేటువంటి పద్ధతుల్లో ఎల్లవేళలా అవకాశ వాదంగా, అధికారంలోకి రావడం కొరకు ఓట్ల పథకాలు, కోట్ల పథకాలు, ఓట్లు రావడానికి తాత్కాలికంగా వందరూపాయల పథకాలు, వేల రూపాయల పథకాలు ప్రజలకు చూపించి అధికారంలోకి వచ్చిన తరువాత పాలకులు కోట్ల పథకాలు చేపట్టడం జరిగింది. ఓట్ల పథకాలు, కోట్ల పథకాల చుట్టూ తిప్పారు తప్ప శాశ్వతంగా ఈ రాష్ట్రాభివృద్ధికి కావల్సిన పరిశ్రమలు కానీ, ప్రాజెక్టులు కానీ, నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం కానీ, నిరక్ష్యరాశ్యత లేకుండా సంపూర్ణ అక్ష్యరాస్యతను సాధించే విషయంలోకానీ, ఏ రకంగానూ ప్రభుత్వాలు పనిచేయలేదు. నాటి నుండి నేటి వరకు పరిపాలించిన పాలకులు అత్యధిక కాలం కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో పరిపాలన చేస్తూ, కొంతకాలంపాటు ఇతర పార్టీలు అధికారంలో ఉండి కూడా కొన్ని విషయాలను నిర్లక్ష్యం చేయడం జరిగింది. దీనిలో అందరికీ తలాకొంత పాపం ఉంది. ఆ పాపం 80 శాతం కాంగ్రెస్ పార్టీది కాగా, 20 శాతం ఇతర పార్టీలదని ఈ సందర్భంగా చెప్పక తప్పదు. అదే విధంగా 1969వ సంవత్సరంలో తెలంగాణా ఉద్యమం వచ్చింది. ఆ సందర్భంగా 400 మంది ప్రజలు బలైపోయారు. 1972వ సంవత్సరంలో జై ఆంధ్రా ఉద్యమం వచ్చింది, 1969వ సంవత్సరంలో తెలంగాణ ఉద్యమం నడిచినప్పుడు, 1972వ సంవత్సరం జై ఆంధ్రా ఉద్యమం జరిగినప్పటినుండైనా కనీసం, మనకు ఒక ఆలోచనా విధానం ఉండాలి కదా? అది లేదు. రాష్ట్రం ఏర్పడినప్పటికీ అదిఏర్పడిన సందర్భంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయలేదు, ఉద్యమాలు వస్తున్నాయి ఇకనుంచైనా కచ్చితంగా పెద్దమనుషుల ఒప్పందం, ఆరు సూత్రాల పథకం 610 జీఓ ఇవన్నీ కూడా కచ్చితంగా అమలు చేద్దామన్న ఆలోచన మీకు కలిగిందా? ఎంతమంది మరణించినా, ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఆసమయంలో తాత్కాలికంగా మాట్లాడి, ఆ ఉద్యమాలను వెనక్కు నెట్టడం తప్ప మరొకటి జరగడం లేదు. ఇకనుండైనా జాగ్రత్తగా మనం వ్యవహరిద్దాం, రాష్ట్రంలో ఇకముందు ఇటువంటి ఉద్యమాలు రాకుండా రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధిచేద్దామనే ఆలోచన చేయాల్సివుంది.

ఆనాటి ఆకారణాల మూలంగా ఈనాడు ఈ పరిస్థితి రావడం జరిగింది. ప్రాంతీయ బోర్డులు ఏర్పాటు చేశారు, కానీ ఆ బోర్డులకు నిధులు, విధులనేవి లేవు. కీర్తి శేషులు ఉప్పునూతల పురుషోత్తమ రావు గారిని తెలంగాణా ప్రాంతీయ బోర్డు ఛైర్మన్‌గా నియామించారు. వారిని ఒక సందర్భంలో ఫండ్స్ ఇవ్వాల్సిందిగా కోరుతూ నేను కలిశాను అయినా ఇవ్వలేదు, కేవలం నాకు ఒక పదవీ, ప్రభుత్వ వాహనం మాత్రమే ఇచ్చారని వారన్నారు. నాకు విధులు కానీ నిధులు కానీ ఇవ్వలేదన్న నిరాశతో వారు నాతో మాట్లాడారు.

మ.12.00

విధులు, నిధులు లేకుండా బోర్డులు ఎందుకండి నెత్తిన కొట్టుకోడానికా? ఆ బోర్డులకు తగినన్ని నిధలిచ్చి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సరైన ప్రయత్నం చేశారా, అదీ చేయలేదు. దాని కారణంగానే ఈ సమస్యలు మరింత జఠిలం కావడానికి అవకాశం ఏర్పడిందే తప్ప

మరొకటి కాదు. తెలంగాణా ప్రాంతమే కాదు, రాయలసీమ ప్రాంతాన్ని ఏమి అభివృద్ధి చేశారు? అదే విధంగా ఆంధ్రా ప్రాంతంలో వెనుకబడిన జిల్లాలను ఏమి అభివృద్ధి చేశారు? తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఉన్న జిల్లాలను అభివృద్ధి చేయలేదు, వెనుకబడిన ప్రాంతాలను ఏమీ అభివృద్ధి చేయలేదు. ఎంతసేపు మీరూ, మీ చుట్టూ ఉన్న వాళ్లు అభివృద్ధి కావటం, ఓట్లు, సీట్లు, పదవులు అన్నటువంటి ఆలోచనే తప్ప రాష్ట్రంలో వెనుకబడిన, కరువు ప్రాంతాలను, ఫ్లోరిన్‌తో బాధ పడుతున్న ప్రాంతాల్లోన్ని ప్రజలను ఆదుకోకుండా తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేశారు, కోస్తాంధ్ర ప్రాంతాలకు కూడా అన్యాయం చేశారు. ఈ రకంగా రాష్ట్రం మొత్తంలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసే ప్రణాళికను అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే ఈ పరిణామం రావడం జరిగింది. ఈ పాపం మీదే, ఈ పాపం చేసినందుకు మీరు ఖచ్చితంగా అనుభవించాల్సిందే, ఇప్పుడు అనుభవిస్తున్నారు, ఇంకా అనుభవిస్తారని నేను తెలియజేస్తున్నాను.

2000 సంవత్సరం నుంచి మరలా తెలంగాణా ఉద్యమం ప్రారంభమయింది, దాని తరువాత ముఖ్యంగా కెసిఆర్ గారి నాయకత్వంలో ఈ ఉద్యమం బలంగా ప్రారంభమంది. ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి నలుగురు ముఖ్యమంత్రుల మారారు, ఈ నలుగురు ముఖ్యమంత్రులు మారిన సందర్భంలో ఇప్పటికైనా వారు ఏమి చేయాలి, ఏమి చేశారు? ఈ ఉద్యమం వస్తున్నది, కొన్ని ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నాం, మనం గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఉద్యోగ నియామకాలు, ప్రమోషన్స్ విషయాల్లో కానీ, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణంలో కానీ రక రకాల సమస్యలు ఉన్నాయి. కనుక ఆ విషయాలకు సంబంధించి ఒప్పందాలను ఇప్పటికైనా ఖచ్చితంగా అమలు చేశారా అంటే, అదీ ఏమీ చేయలేదు. చంద్రబాబు నాయుడు గారు, రాజశేఖర రెడ్డి గారు, రోశయ్య గారు ముఖ్యమంత్రులుగా వచ్చారు. ప్రస్తుతం కిరణ్‌కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు, ఇటువంటి పరిస్థితులు వచ్చినప్పుడు వీటిని ఏవిధంగా పరిష్కరించాలనే ఆలోచన చేయకుండా, మన సభలో తెలంగాణా సమస్యపైన తీర్మానం పెట్టాలని డిమాండ్ చేసినప్పుడు ఇక్కడ తీర్మానం చేయడానికి వీలు లేదు ఈ అంశం మన పరిధిలోకి రాదు, కేంద్రం ప్రభుత్వమే చేపట్టాలన్నారు. మీరందరూ సిఎల్‌పి మీటింగ్ ఏర్పాటు చేసుకొని కేంద్రం చేసిన తీర్మానానికి కట్టుబడి ఉంటామని, ఒక తీర్మానం చేసి పంపి. రోశయ్య గారు ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్నటువంటి నాయకులు కూడా అదే విధంగా చెప్పారు, తరువాత చిదంబరం గారు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అఖిలపక్ష సమావేశానికి పార్టీల అధ్యక్షలు హాజరు కారా? ఇంతకంటే ముఖ్యమైన సమ్యస్య రాష్ట్రంలో ఏమి ఉంది? రాష్ట్రాన్ని ఒకటిగా ఉంచాలా లేక రెండుగా చేయాలా అనేదానిపై చర్చ జరుగుతూ ఉంటే, రాష్ట్ర పార్టీలకు చెందిన అధ్యక్షులు హాజరు కావడంలేదు. ప్రాంతానికి ఒకరినో, ఇద్దరినో పంపించి ప్రాంతీయ వాదాన్ని అక్కడ వినిపించడం జరిగింది, మరి ఇది అవకాశ వాదం కాదా? అందరూ ప్రేక్షక పాత్ర వహించారు. పిసిసి అధ్యక్షలు హాజరు కారు, ముఖ్యమంత్రి హాజరైనా ఏమీ మాట్లాడనటువంటి పరిస్థితి ఉంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, ప్రధాన ప్రతిపక్ష నాయకులు ఎవరూ హాజరు కావడంలేదు, దీని వల్ల సమస్యలు బలపడుతూ, బలపడుతూ రావడం జరిగింది. ఈ సమస్య ఇంతగా బలపడడానికి మీరు ఇచ్చిన

అవకాశవాదం కారణం కాదా? మీరు ప్రేక్షక పాత్ర వహించి వైఫల్యం చెందడం వల్లనే ఈ సమస్యలు వచ్చాయనే విషయమై మీరు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఇప్పటి వరకు వెయ్యిమందికిపైగా చనిపోయారు. ముఖ్యంగా గత నాలుగున్నర సంవత్సరాల నుంచి సంభవించిన పోరాటాలు, బంద్‌లు, ఆందోళనల వల్ల మనకు రావలసిన పెట్టుబడులు, పరిశ్రమలు రాకపోవడం వల్ల మా అంచనా ప్రకారం లక్షల కోట్ల రూపాయల ఆస్థి నష్టం రాష్టానికి సంభవించింది. దేశంలో మన రాష్ట్రం యొక్క పరువు పోయింది, మన రాష్ట్రానికి ఎవరూ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి కారణం మీరు కాదా? ఎందుకు నానబెట్టి, నాన్చుడు ధోరణి అవలంభించారు. ఇంత ముఖ్యమైన సమస్యను అవునా, కాదా అనే విధంగా తొందరగా పరిష్కారం కావడానికి చర్యలు తీసుకోలేదు, ఏళ్ల తరబడి నాన్చారు. రెండు ప్రాంతాల నుంచి ప్రతినిధులను పంపితే వారు ఎవరి అభిప్రాయాలను వారు వెలిబుచ్చారు, మీవి రాజకీయ పార్టీలు కాదా, మీకు వేరే పార్టీలేమైనా ఉన్నాయా? సోనియా గాంధీగారే కదా అందరికీ అధ్యక్షురాలు ! ప్రతిపక్ష పార్టీలకు కూడా ఒక్కరే కదా నాయకులు ! ఇది అవకాశం వాదం తప్ప ఇంకొక్కటి కాదు. ఇంత ముఖ్యమైన సమస్య వచ్చినప్పుడు ఖచ్చితమైన అభిప్రాయం చెప్పాలి. ఒకసారి మన అభిప్రాయం చెప్పినప్పుడు మనం ఎన్నికల్లో ఓడిపోవచ్చు, అధికారం రాకపోవచ్చు. మీకు ఓట్లు, సీట్లు ముఖ్యమా లేక రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ముఖ్యమా? ఈ సమస్యను మనం ఓట్లు, సీట్లు రావడానికి చూడకుండా, రాష్ట్రం ఒకటిగా ఉండడం వల్ల ఉపయోగమా, లేక రెండుగా ఉండడం వల్ల ఉపయోగమా లేక ప్రజలకు ఏవిధంగా ఉపయోగం అనేది చూడాలే తప్ప, ఈ మాట అంటే ఓట్లు వస్తాయో రావో అనే అవకాశ వాదంగా వ్యవహరించడం వల్లనే ఈ సమస్య మరింత జఠిలమై ఈ పరిస్థితి రావడం జరిగింది. ఈ రకంగా ద్వంద్వ వైఖరిని అవలంభించిన ప్రాధాన పార్టీ కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు కూడా అవకాశవాదాన్ని ప్రదర్శించాయని ఈ సందర్భంగా చెప్పక తప్పదు. ఇటువంటి పరిస్థితి వచ్చిందంటే అందుకు కారణం మీ దివాళాకోరు రాజకీయాలే తప్ప మరొకటి కాదు.

రాష్ట్రం ఒకటిగా ఉన్నా, లేక రెండుగా ఉన్నా మా అభిప్రాయంలో మొదటి నుంచి మార్పేమీ లేదు కానీ, మీరు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి బిల్లులో కూడా పొందుపరచలేదు, కేంద్రం ప్రభుత్వం పంపిన బిల్లులో కూడా ఏమీ లేదు, ఉద్యమం నడుస్తోంది కాబట్టి మేము విభజన చేయదలచుకున్నామని, 10 సంవత్సరాల వరకు రాజధానిగా నిర్వహించుకోవచ్చని చెప్పారు వారి బాధ్యత ఇదేనా? వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి మీరు చెప్పిన మాటలు ఏమిటి? కరువు ప్రాంతాలను ఏవిధంగా బాగుచేయదలచుకున్నారు, ప్రాజెక్టులకు మీరు కేటాయించిన డబ్బేది, అటువంటి విషయాలేమీ ఇందులో లేవు. ఇంతకు ముందు ఏర్పడిన రాష్ట్రాలు ఇప్పటి వరకు రాజధానిని నిర్మించుకోలేదు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఇప్పటికీ గెస్ట్ హౌస్‌లోనే సెక్రెటేరియట్ నడుపుతున్నారు. కేంద్రం ప్రభుత్వం గురించి మనకు తెలియనిది కాదు, వరదల ద్వారా నష్టపోయిన రైతాంగానికి సహాయంగా ఇస్తామన్న రూ.1000 కోట్లు ఇప్పటి వరుకూ ఇవ్వలేదు.

మీరు పోట్లాడుకుంటున్నారు కాబట్టి మేము రాష్ట్ర విభజన చేస్తున్నాం, మీ చావు మీరు చావండి అని చెప్పి బాధ్యత లేకుండా కేంద్రం వ్యవహరిస్తోంది, కానీ వారి బాధ్యత అది కాదు. రాష్ట్రాన్ని విభజన చేయదలచుకున్నప్పుడు తెలంగాణా ప్రాంతానికి, రాయలసీమ ప్రాంతానికి, ఇంకా వెనుకబడిన ప్రాంతాలకు ఇన్ని లక్షల కోట్లు ఇస్తాం, మీరు అభివృద్ధి చేసుకోవడానికి నేను బాధ్యత తీసుకొని నిధులు కేటాయిస్తున్నాను అనే మాటలేమీ లేకుండా బాధ్యతా రహితంగా బిల్లును తయారు చేసి పంపించారు తప్ప, స్పష్టంగా రాష్ట్రం ఒకటిగా ఉన్నా, రెండుగా ఉన్నా అభివృద్ధి చేయడానికి కావలసిన నిర్దిష్టమైన పద్ధతులను ఈ బిల్లులో పేర్కొనలేదు, కనుక దీనివల్ల ఉపయోగం ఉండదు, ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి అనేదే ఈ సందర్భంగా మేము చెప్పదలచుకున్నాం.

మ. 12.10

ఇవాళ వెనుకబడిన ప్రాంతాల విషయంలో, కరవుకాటకాలకు గురవుతున్న ప్రాంతాల విషయంలో, అదే విధంగా నిరక్షరాస్యతను నిర్మూలించడానికి, నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడానికి, పెండింగ్ ప్రాజెక్టులని పూర్తి చేయటానికి, అనేక ప్రాంతాల్లో పరిశ్రమలను నిర్మాణం చేయటానికి కావల్సినటువంటి పద్ధతుల్లో ఒక ప్రణాళికా బద్ధంగా, ఇప్పటికైనా ఒక రకంగా చెప్పాలంటే కేంద్రప్రభుత్వంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్ర విషయంలో సమగ్రమైనటువంటి ఆలోచనతో ఎప్పుడైనా మీ నాయకత్వం మిమ్మల్ని కూర్చోబెట్టి రాష్ట్రాన్ని ఏవిధంగా పరిపాలన చేస్తున్నారని, అన్ని ప్రాంతాలనూ మీరు సరిగా చూసుకొంటున్నారా లేదా? అన్ని ప్రాంతాలను సరైన పద్ధతుల్లో అభివృద్ధి చేస్తున్నారా లేదా అనేది ఎప్పుడైనా రెవ్యూ చేశారండీ? ఎప్పుడు వచ్చినా మీరు దండలు వేసి, డబ్బా కొట్టి పంపటం తప్ప, ఎవరికి వాళ్లే పొగడ్తలతో పంపేయడం తప్ప, ఏనాడైనా ...

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ముఖ్యమంత్రి గారూ మీరు మాట్లాడండి.

శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి (గౌరవ ముఖ్యమంత్రి): సర్, మా కేంద్ర నాయకత్వం పరిపాలన ఏ విధంగా ఉందని మమ్మల్ని రెవ్యూ చేసేటప్పుడు సభ్యులు శ్రీ రంగారెడ్డిని పిలిచి రెవ్యూ చేస్తారా? రంగారెడ్డిగారిని ఆయన గురించీ, ఆయన పార్టీ సిద్ధాంతం గురించి మాట్లాడమనండి. హౌస్‌లో ఆయనొక్కరే ఉన్నారు. పార్టీలను బట్టి ప్రజలు ఆలోచించడం లేదు. ప్రాంతాలను బట్టి ప్రజలు పూర్తిగా వేరే అభిప్రాయాల్లో ఉన్నారు. ప్రజల్లో పార్టీల మాట వినే పరిస్థితి లేదు. మీకు ఆ ఇబ్బంది లేదు. మీరొక్కరే ఉన్నారు, మీ సిద్ధాంతం కూడా మారలేదు. I appreciate that. మొదట్నుంచీ "కలిసుండాలని" సిద్ధాంతం ఒకటే ఉంది. కానీ మీరు ఇక్కడ గమనించాల్సింది ఒకటి ఉంది. సీమాంధ్రకు సంబంధించిన లెజిస్లేటర్స్ గానీ, మినిస్టర్స్ గానీ, లేక ఎం.పీ.లు గానీ రాష్ట్రాన్ని విభజించాలని ఎప్పుడూ కూడా కోరలేదు. మా పార్టీ ఫోరంలో మేము disciplined గా వారికి చెప్తూ వచ్చాము తప్ప, బయట మాట్లాడలేదు. కానీ నిర్ణయం వచ్చినపుడు ప్రజల అభీష్టం మేరకు మేము కూడా చెయ్యాల్సినవసరం ఉంటుంది. మేము వాస్తవంగా జరిగే నష్టాలు కానీ లేక జరగ

బోయే నష్టాల గురించి మేం మాట్లాడతాం. మీ అభిప్రాయం ఏముందో దయచేసి చెప్పండి. మా పార్టీలో కూడా ఎప్పుడు ఏమేం కరెక్షన్స్ చేశామో, తెలంగాణా ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశామో, ఏవిధంగా సరిచేయాలనే ప్రయత్నం చేశామనేది కూడా నేను మాట్లాడేటప్పుడు ఖచ్చితంగా చెప్తాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రంగారెడ్డిగారూ మాట్లాడండి.

శ్రీ జూలకంటి రంగారెడ్డి: అధ్యక్షా, మేము కూడా మొదట్నుంచీ ఎటు ఊపు ఉంటే అటే, ఎటు గాలి ఉంటే అటే, సీట్లు, ఓట్లు అనేవి ముఖ్యం అనుకుంటే మాక్కూడా చాలా చాలా వచ్చేవి. మేము ఎన్నడూ అలా ఆలోచించలేదు. పొత్తు పెట్టుకున్నప్పుడు ఎప్పుడైనా కమ్యూనిస్టులే బలైపోయారు. ఎవరితో పొత్తు పెట్టుకున్నా, ఎవరికి సాయంచేసినా కూడా మిమ్మల్ని గెలిపించి, నెత్తిమీద పెట్టుకుని మేం త్యాగాలు చేశాం తప్ప, మిమ్మల్ని ఉపయోగించుకుని మేం పెద్దగా ఒరగపెట్టుకునేదేం లేదని అందరికీ తెలుసు. కమ్యూనిస్టుల్లో ఒక్కరున్నా, కమ్యూనిస్టులు కమ్యూనిస్టులే. మీరు వంద మంది ఉన్నా ఏం మాట్లాడుతున్నారో, నేనొక్కడునున్నా ఏం మాట్లాడుతున్నానో అందరు గమనిస్తూనే ఉన్నారు. మీరుఇప్పుడు కమ్యూనిస్టుల్ని విమర్శించటం, వ్యంగ్యంగా మాట్లాడటం చూసి తర్వాత బాధ పడతారు. ఎందుకంటే ప్రపంచంలో ఇవాళ కమ్యూనిస్టు రాజ్యాలు ఎక్కడైతే ఉన్నాయో, అక్కడ మాత్రమే అందరికీ న్యాయం జరుగుతోంది. అక్కడ నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుంది, నిరక్షరాస్యత లేకుండా చేస్తున్నారు, అందరికీ కడుపు నిండా తిండీ, బట్ట, ఉపాధి అన్నీ కల్పిస్తున్నారు. ఎంతసేపూ ఈ ఓట్లూ, సీట్లూ చివరికి కార్పోరేట్ రాజకీయాలు తీసుకొచ్చారు. ఈ దేశంలో కార్పోరేట్ రాజకీయాలను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లాగ తీసుకొచ్చారు. మీరేదో ఉద్ధరిస్తున్నారని చెబితే ఎట్లా? మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి మీ గురించి చెబుతున్నాం. ఇంత కాలం రాష్ట్రంలో, కేంద్రంలో, అధికారంలో ఉండి మీరు పరిపాలన నడపలేదా? మీ నాయకత్వంలో ఈ వైఫల్యాలు జరగలేదా? ఎప్పటికప్పుడు అవకాశవాదంగా వ్యవహరించలేదా? మీరు అధికారంలో ఉండి పరిపాలన చేస్తున్నారు కాబట్టే, అధికారంలో ఉండి పరిపాలన చేసేవాళ్లు బిల్లును పంపించారు కాబట్టే ఈ బిల్లుపై మాట్లాడుతున్నాను తప్ప, కాంగ్రెస్ పార్టీ గురించి నేనేం మాట్లాడటం లేదు. అందుకే దయచేసి గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ బిల్లు మీద మాట్లాడేటప్పుడు, ఈ రాష్ట్ర విభజన సమస్య వచ్చినపుడు.... 57 సంవత్సరాల తర్వాత ఈ రాష్ట్రం ఒకటిగా ఉండాలా, రెండుగా ఉండాలా, మూడుగా ఉండాలా అనేది మాట్లాడుకోవాల్సిన కర్మ మనకు ఎందుకొచ్చింది? అది మీ వైఫల్యం కాదా? మీరు సరైన పద్ధతుల్లో పరిపాలన సాగిస్తే, సరైన పద్ధతుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ఈ పరిస్థితి ఎందుకు వచ్చేది? ఇది చెప్తే కూడా మీరు వినటానికి సిద్ధం కాకపోతే దానికి మేమేం చేస్తాం. మీరు ఎవరు చెప్పినా వినరు. మీరు ఆత్మ పరిశీలన చేసుకోరు. మీ కర్మ, మీ ఆలోచనతో మీరు చేసుకోండి. మాకేం ఇబ్బంది లేదు. దీనిపైన మాట్లాడేటప్పుడు మాత్రం ఖచ్చితంగా మేం చెప్పదలుచుకున్నాం, చెబుతాం, చెప్పి తీరుతాం. ఈ పరిస్థితి రావటానికి, నాలుగున్నర సంవత్సరాల కాలం నుండి లక్షల కోట్ల విలువ చేసేటువంటి నష్టం జరగటానికి, వెయ్యిమంది ప్రాణం పోవ

టానికి వీటన్నిటికీ కారణం మీరే అని చెప్పదలుచుకున్నాను. ఇప్పటికైనా, ఈ సమస్య పైన తొంద రగా ఏదో ఒక శాశ్వత పరిష్కారమనేది గైకొనాలి. శాశ్వత పరిష్కారమనేది గైకొనే పద్ధతిలో ఒక నిర్ణయం తీసుకోవాలి. గౌరవ కేంద్ర హోం మంత్రి శ్రీ సుశీల్‌కుమార్ షిండే గారు జరిపినటువంటి సమావేశంలో మా పార్టీనుండి వెళ్లిన సభ్యులు శ్రీ రాఘవలుగారు, నేను చెప్పాం 'అయ్యా, మా అభి ప్రాయాలు మావి, ఎవరి అభిప్రాయాలు వాళ్లవి, కానీ మీరు తొందరిగా దీనికి ఫుల్‌స్టాప్ పెట్టండి, తొందరగా ఒక శాశ్వత పరిష్కారం గైకొనండి' అని బలంగా చెప్పి రావడం జరిగింది. ఇంకా, ఇంకా కాలయాపన చేయకుండా దీనిపైన ఒక శాశ్వత పరిష్కారం గైకొనేటువంటి పద్ధతుల్లో, ఈ శాశ్వత పరిష్కారం కూడా ఈ 57 సంవత్సరాల కాలం నుండి వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టు కుని, చేసినటువంటి తప్పులను దృష్టిలో పెట్టుకుని, వైఫల్యాలన్నీ దృష్టిలో పెట్టుకుని, ఒక రాష్ట్రం ఉన్నా, రెండు రాష్ట్రాలున్నా మీరు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయకపోతే, ఇదే స్టైల్‌లో, ఇదే విధానాల్లో, ఇదే పద్ధతుల్లో పాలన చేసినంత కాలం ఇటువంటి ప్రాంతీయ అసమానతలు, ఆర్థిక అస మానతలు మరింత పెరిగి, మరిన్ని ఉద్యమాలు అనేక రూపాల్లో ముందుకు రావటానికి ఆస్కారముంటుంది. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది వాస్తవం. దానిని దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం వైపుగా, తొందరగా నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రానికి ఇప్పటికే నష్టం జరిగింది. ఇవాళ రైతుల సమస్యలను పట్టించుకునే దిక్కు లేదు. ఇవాళ కరెంటు రోజుకు మూడు గంటలు కూడా రావడం లేదు. దాని గురించి పట్టించుకునే దిక్కు లేదు. మేం నిన్ననే పెద్ద ఎత్తున రైతాంగంతో ఉద్యమం నడిపించాం. పంట నష్టపోయిన రైతాంగానికి, వరదలకు నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకొనే విషయంలో ఇంతవరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క పైసా కూడా ఇచ్చినటువంటి పరిస్థితి లేదు. ప్రజల సమస్యలు పట్టవా? ఇవాళ మంత్రులు ప్రాంతాల వారీగా విడిపోయి, ఎవరి కుర్చీ వాళ్లదే, ఎవరి నియోజకవర్గం వాళ్లే తప్ప... రాను రాను మంత్రులు కూడా ఎవరి నియోజక వర్గం వాళ్లు, ఎవరి జిల్లా వాళ్లు, ఈ విధంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమై పని చేస్తున్నారు. అందుకనే రాష్ట్రంలోని పరిపాలనలో మంత్రులు, ఎం.ఎల్.ఏ.లు, అధికారులు, ఉద్యో గుల్లో ఒక డివిజన్ వచ్చి, ప్రాంతాల వారీగా మాట్లాడుకునే పరిస్థితి, ప్రాంతాల వారీగానే కొన్నింటికి పరిమితమై పనిచేసే పరిస్థితి వచ్చింది. చాలా నష్టం జరిగింది, ఇంకా జరగబోతోంది. ఇంకా ఇంకా ఈ రాష్ట్రం నష్టపోవద్దు. రాష్ట్ర ప్రజలు నష్టపోవద్దు. ఇవాళ రాష్ట్రం ఏరకంగా ఉంటే ఉపయోగకరం అనేది ప్రధానంగా ఆలోచించాలి. రాష్ట్ర ప్రజల కొరకు, రాష్ట్ర భవిష్యత్ కొరకు ఏరకమైన ఆలో చన చేస్తే ఉపయోగంగా ఉంటుందనేది ఆలోచించాలి. నేను ఈ స్లోగన్ ఇస్తే, నేను ఈ విధానం చేప డితే నా పార్టీకేమైనా లాభమా లేదా, నాకు ఓట్లు వస్తాయా లేదా, సీట్లు వస్తాయా లేదా అనేవి పక్కన పెట్టండి. రాష్ట్రానికి ఏది ప్రయోజనం? రాష్ట్ర ప్రజల యొక్క ప్రయోజనం ముఖ్యమా, మన ప్రయో జనం ముఖ్యమా? ప్రజల ప్రయోజనం కంటే ఏ పార్టీకి ఆ పార్టీ ఓట్లు, సీట్లు, అధికారం వంటి వాటి చుట్టూ తిరగడమే జరుగుతోంది. ఇది సరైంది కాదు. ఇది మనం ప్రజలకు ద్రోహం, నష్టం చేసిన వాళ్లమవుతాం. అందుకనే సరైన పద్ధతిలో ఆలోచన చేసి, ఈ రాష్ట్రాన్ని ఇప్పటికైనా ఈ పరిస్థితి నుంచి బయట పడేసేందుకు కావల్సిన పద్ధతుల్లో, ఒక సమగ్రమైన ఆలోచనతో ముందుకు పోవాలని, ఒక శాశ్వత పరిష్కారం గైకొనాలని కోరుతున్నాను. ఈ బిల్లు పైన నేను ఒక్కటే సవ

రణ ఇచ్చాను. ఇప్పుడు "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు" స్థానంలో "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి బిల్లు" గా ఉండాలని చెప్పి ఒక సవరణ ఇవ్వడం జరిగింది.

మ.12.20

కాబట్టి, రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచుతారా? విడదీస్తారా? సమైక్యంగా ఉంచినా, విడదీసినా, మీ ఆలోచన మారాలి, మీ విధానం మారాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు ఉపయోగపడుతుంది తప్ప, ఇంకొకటి కాదని ఈ సందర్భంగా తెలియజేస్తూ, అవకాశవాద విధానాలు విడనాడండి. ద్వంద్వ వైఖరితో ఒకే పార్టీ వాళ్ళు రెండు విధానాలను అనుసరించడం సరైనది కాదు. ఇది చాలా ముఖ్యమైనటువంటి సమస్య. ఒకే విధానంతో, ఒక అభిప్రాయంతో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేటువంటి ఆలోచన చేసి రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని అందరూ, ఆ రకంగా వ్యవహరించాలని కోరుతూ, నాకు ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

MR DEPUTY SPEAKER: Yes, Sailajanath garu…...

డా.ఎస్.శైలజానాథ్: అధ్యక్షా, ఈ రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించేందుకు, ఈ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు వచ్చిన, 'ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ-2013 బిల్లు'ను నేను వ్యతిరేకిస్తున్నాను.

(ఈ సందర్భంలో సమైక్యాంధ్ర కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరిచారు.)

అధ్యక్షా, ఇది ఊరకనే ఏదో 'వ్యతిరేకిస్తున్నాను' అనేంత చిన్న విషయం కాదు. తెలుగు జాతి భవిష్యత్తు కోసం, ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం, వెరసి తెలుగు జాతి కోసం నేను ఈ రాష్ట్ర విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అధ్యక్షా, ఏదైతే ....

(అంతరాయం)

కేంద్ర ప్రభుత్వం ఇంత పెద్ద విషయాన్ని 'టేబుల్ ఐటమ్'గా తమ చర్చలోకి తీసుకొని, ఈ రాష్ట్రాన్ని విభజించడానికి మంత్రులతో ఒక ఉపసంఘాన్ని ఏర్పాటు చేసుకొని, కొద్ది కాలం చర్చలు జరిపి, రాష్ట్రపతి ద్వారా పంపిన ఈ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉందని నేను భావిస్తున్నాను కాబట్టి, ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అంతేకాదు, ఈ దేశం ఏర్పడప్పుడు, సర్వతంత్ర, గణతంత్ర, ప్రజాతంత్ర భారత దేశంగా తనకు తానుగా ప్రకటించుకున్న రోజున, రాష్ట్రాల సమాఖ్యగా చెప్పుకున్నందున, రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నందుకు నేను ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అంతేకాదు, భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి, భారత జాతీయ కాంగ్రెస్ విధానమైన భాషా ప్రయుక్త రాష్ట్రాల స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నందుకు నేను దీనిని వ్యతిరేకిస్తున్నాను.

(అంతరాయం)

అంతే కాకుండా, తెలుగు మాగాణాల్లో, తెలుగు భూభాగంలో....

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర రావు గారిచే అంతరాయం)

తెలుగు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో భూస్వాముల, దొరల, పెత్తందారుల వ్యతిరేక పోరాట స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నందుకు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అంతే కాదు, విశాలాంధ్ర కోసం, తెలుగు వారి ఐక్యత కోసం, ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది అమరుల త్యాగాల స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నందుకు దీన్ని వ్యతిరేకిస్తున్నాను.

(అంతరాయం)

అంతేకాదు అధ్యక్షా, వీర తెలంగాణా సాయుధ పోరాట స్ఫూర్తికి, ఆనాటి అమరుల ప్రాణ త్యాగాల స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నందుకు ఈ రాష్ట్ర విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అంతేకాదు, భారత ప్రభుత్వ విధానమైన.....

(తెలంగాణా ప్రాంత కాంగ్రెస్ సభ్యులు 'ఇది అన్యాయం అధ్యక్షా', ఇది అన్యాయం' అని పదే పదే అంటూ సభకు అంతరాయం కలిగించసాగారు.)

నేను మాట్లాడిన ప్రతీ మాటకు నా దగ్గర వివరణ ఉంది.

(అన్ని పార్టీల తెలంగాణా ప్రాంత సభ్యులచే అంతరాయం)

భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికగా, శాస్త్రీయబద్ధంగా మొదటి రాష్ట్రాల ఏర్పాటుకు 'ఫజల్-అలీ కమీషన్' ను ఏర్పాటు చేసి, 'భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు' ప్రాతిపదికగా కలిగిన భారత ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఉన్నందుకు, దీన్ని నేను వ్యతిరేకిస్తున్నాను.

(తెలుగు దేశం పార్టీ సభ్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర రావు గారు స్పీకర్ పోడియం వద్దకు చేరి అభ్యంతరం వ్యక్తం చేశారు)

అంతేకాదు, తెలుగు వాడిగా, ఆంధ్రుడిగా.... ఇంకో అంశం కూడా గోచరిస్తోంది అధ్యక్షా. ఆధిపత్య ధోరణి ఇందులో కనిపిస్తోంది. ప్రజాస్వామ భారత దేశంలో ఆధిపత్య ధోరణి ఏ రూపేణ కనిపించినా, ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా మేము ఉంటాము. అధ్యక్షా, ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా నేను ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ఒక్క నిముషం... ఎస్, దయాకర రావుగారూ...ఏమి రెచ్చగొట్టేటువంటి మాటలు? సభ సజావుగా నడవడానికి .....

శ్రీ ఎర్రబెల్లి దయాకర రావుః సార్, ఒక్క నిముషం. మీరూ తెలంగాణా వాళ్ళే...

(తెలంగాణా ప్రాంత కాంగ్రేస్ సభ్యుల నుంచి అభ్యంతరం)

.... ఆయన మంత్రి. సభా వ్యవహారాల మంత్రి. అది కేంద్ర ప్రభుత్వ బిల్లు. వాళ్ళ కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ద్వారా ఇక్కడకు వచ్చింది. ఆయనకు** • ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేయమనండి సార్. ఆయనొక మంత్రిగా ఉండి....

(తీవ్ర అంతరాయం)

MR. DEPUTY SPEAKER : Those words will not get into the records. Please sit down. Chief Whip garu, try to appeal the House……..

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి (భూపాలపల్లి)ః అధ్యక్షా, ఈ రోజు గౌరవ మంత్రి, శాసన సభా వ్యవహారాల మంత్రి గారు మాట్లాడేటప్పుడు కొద్దిగా చరిత్ర వక్రీకరించిన పద్ధతిలో మాట్లాడుతున్నారు. ఈ రోజు తెలంగాణా సాయుధ పోరాటం జరిగింది. ఆరోజు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 'ప్రజాస్వామ్యం రావాలి, భారత దేశంలో అంతర్భాగం కావాలి' అని పోరాటం చేసి అనేక మంది ప్రాణాలు అర్పించారు. ఆ రోజు వారు చేసిన పోరాటం, ఆంధ్ర, తెలంగాణా కలవడం కొరకు చేసిన పోరాటంగా వారి(డా.ఎస్.శైలజానాథ్) మాటల్లో చెప్పడాన్ని, రికార్డుల్లో సరిచేయాలని కోరుతున్నాను అధ్యక్షా. అదే విధంగా పెద్దలు దయాకర రావు గారు కూడా, వారు మైకు తీసుకొని మాట్లాడితే ప్రజాస్వామ్య పద్ధతిలో మాట్లాడాలి గాని, అన్‌పార్లమెంటరీ, అసభ్య పదజాలం, రెచ్చగొట్టే పద్ధతిలో మాట్లాడకూడదు. దయచేసి మీరు (ఇతర సభ్యులనుద్దేశించి) కూడా మాట్లాడొద్దు. ఈ రోజు ఒక విలువైనటువంటి బిల్లుపైన చర్చ జరుగుతున్నప్పుడు, ఇరు ప్రాంతాల ప్రజలు రెచ్చిపోయే విధంగా కాకుండా, సామరస్య విధంగా ఉంటే బాగుంటుందని నేను మీ ద్వారా కోరుతున్నాను.

డా.ఎస్.శైలజానాథ్ ః అధ్యక్షా, ఈ పవిత్రమైన శాసన సభలో ...

శ్రీ షేక్ మస్తాన్ వలిః (మైకు లేకుండా... )అధ్యక్షా, ఒక దళిత మంత్రి మీద.... ఒక దళిత మంత్రి మీద...

MR. DEPUTY SPEAKER: Please don't attribute the caste.

డా.ఎస్.శైలజా నాథ్ (శింగనమల)ః అధ్యక్షా, మీరు ఇప్పుడే చూశారు, అహంకారానికి ఇంతకంటే పరాకాష్ట ఎక్కడా చూసి ఉండరు. మనుష్యులు మాట్లాడే భాష, అధ్యక్షా! దయాకర్ రావు గారి దగ్గర నుంచి ఇంతకంటే భాషను నేను expect చేయను. ఈ తొమ్మిది సంవత్సరాలుగా చూశాను. దయాకర రావు గారికి వచ్చిన భాషను చూశాను. ఎవరికి ఏ భాష వస్తే, వాళ్ళు ఆ భాషలో

• Expunged as ordered by the Chair

మాట్లాడుతారు. దయాకర రావు గారికి వచ్చిన భాష వారు మాట్లాడారు, అది వారిష్టం. అధ్యక్షా! ఎవరి భాష వారిది. at the same time, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా నేనొక విషయం చెప్పాలనుకుంటున్నాను.....

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎర్రబెల్లి దయాకర రావు గారిచే అంతరాయం)

MR. DEPUTY SPEAKER: Dayakar Rao garu, please sit down......

డా.ఎస్.శైలజానాథ్ః అధ్యక్షా, హెడ్డింగ్‌లు మాట్లాడితేనే ఇంత భయపడుతున్నారే, వివరాల్లోకి వెళితే వీళ్ళ పరిస్థితేంది? ఒక్కొక్కటి, ఒక్కొక్కటి వలువబడుతాయి... అధ్యక్షా, కప్పిన ముసుగులు తొలగించ బడతాయి....

శ్రీ షేక్ మస్తాన్ వలిః (మైకు లేకుండా...)....క్షమాపణ చెప్పాలి.. ...క్షమాపణ చెప్పాలి...

డా.ఎస్.శైలజానాథ్ః మనుషుల మధ్య క్షమాపణ గానీ అంతకంటే.... ఎందుకయ్యా క్షమాపణ. వదిలేసెయ్యండి. ఎవరి భాష వారిది. అన్‌కాన్‌స్టిట్యూషనల్. అధ్యక్షా, ఈ రోజున... నేను ఈ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి, 23 జిల్లాలతో కూడిన రాష్ట్రానికి, సువిశాలమైన తెలుగువాళ్ళ రాష్ట్రానికి మంత్రిని నేను, మంత్రిని నేను, మంత్రిని నేను.

(అంతరాయం)

అధ్యక్షా, నేనింకా మాట్లాడలేదు... ఇంకా ఉపోద్ఘాతమే. ఉపోద్ఘాతానికే ఇంత భయపడితే ఎలా?

మ.12.30

వీర తెలంగాణ విప్లవ పోరాటం గురించి దొరలకు ఏమి తెలుసు? దళితులకు తెలుస్తుంది. పెట్టిన మా కేకలు, బాధలు, దొరల గడీలకు, పెత్తందారులకు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్‌దార్ల తాబేదారులకు ఏం తెలుసు.

(కొందరు తెలంగాణ ప్రాంతానికి చెందిన సభ్యులు బల్లలు చరిచారు)

ఒకప్పుడు ఇదే శాసనసభలో ఒక సభ్యుడు మీరు గడీ దొర కదా అంటే, అవును నేను గడీ దొరనే అని రొమ్ము విరుచుకొని మాట్లాడింది ఇప్పటికీ నా కళ్ల ముందు కదలాడుతుంది, ఇది అశ్చరమే. ప్రజాస్వామ్య భారతదేశంలో నేను గడీ దొరనే అని రొమ్ము విరుచుకొని ప్రకటించిన చరిత్ర ఈ శాసనసభ రికార్డుల్లో ఉంది. కనుక ఈ విప్లవ పోరాటం, వీర తెలంగాణ పొరాటం దేని కోసం అధ్యక్షా?

(ఈ దశలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి మరికొంతమంది సభ్యులు తమ తమ సీట్లల్లో నుంచి నిలబడి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు)

మిస్టర్ డిప్యూటి స్పీకర్: దయచేసి కూర్చోండి, కూర్చోండి.

శ్రీ డా.ఎస్ శైలజనాథ్: అధ్యక్షా, ఈ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం, రాజ్యాంగానికి అనుకూలంగా లేకుండా వచ్చిన బిల్లు.

(ఈ దశలో టీఆర్ఎస్ సభ్యులు తమ స్థానాల్లో నిలబడి అభ్యంతరం వ్యక్తం చేశారు)

అధ్యక్షా, ఇంతమంది నాకు అడ్డమా అని నాకు చాలా బాధగా ఉంది. మహాభారత యుద్ధంలో అభిమన్యుడి పాత్రనా నాది? నేను అభిమన్యుడిని కాదు, నేను గెలిచి ఇక్కడికి వచ్చాను.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు తమ శాసనసభాపక్ష నాయకులు శ్రీ ఈటెల రాజేందర్‌కు మాట్లాడడానికి అవకాశమివ్వాలని కోరసాగారు)

MR.DEPUTY SPEAKER: Please sit down.

శ్రీ డా.ఎస్ శైలజనాథ్: అధ్యక్షా, మాకు మాట్లాడడానికి అవకాశామివ్వండి. రెండు విభజన ఉద్యామాలు ఎదుర్కొన్న తరువాత 1962, 1972 సంవత్సరాలలో ఈ రాష్ట్రం గురించి ఆనాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ఆ రోజు ఆలోచించి ఈ రాష్ట్రాన్ని ఆరు సూత్రాల పథకమనే కవచంతో కప్పిపెట్టారు. దేశంలోని అనేకమందికి, రాజ్యాంగ నిపుణులకు, రాజనీతిజ్ఞులకు ఆర్టికల్ 3 ఆ తరువాత వచ్చిన ఆర్టికల్ 371డి నిలుస్తుందా, ఆర్టికల్ 3 నిలుస్తుందా అని అనుమానమొస్తుంది. ఆర్టికల్ 371డి పైన, ఈ రాష్ట్ర ఐక్యతపైన మన ముఖ్యమంత్రి గారికి కోరిక ఎక్కువ. ఆర్టికల్ 371డి అనే రక్షణ కవచాన్ని భారత రాజ్యాంగం ఇచ్చిన తరువాత అంతకు ముందున్న ఆర్టికల్స్ న్యాయానికి నిలబడతాయా, పోతాయా అన్ని ఒక మీమాంస.

(ఈ దశలో తెలంగాణా ప్రాంతానికి చెందిన సభ్యులనుంచి అభ్యంతరం వ్యక్తమయింది)

ఈ సవరణతో అంతకు ముందున్న అన్ని అంశాలు కూడా రద్దుచేయబడతాయని గాని, వాటికంటే ఇది పెద్దదని వాటిని అధిగమిస్తుందని ఆ మాట రాజ్యాంగంలో ఉంది నేను పేపర్లో చూపిస్తాను. ఇది నేను చెప్పింది కాదు, అనేకమంది చెప్పిన మాట. పేపర్లో చూసి విభజనవాదులందరూ వణికి ఉంటారు. కాకపోతే మేకపోతు గాంభీర్యం తప్ప, ఇంకొకటి కాదు. రాజ్యాంగానికి నేను చేయగలిగిందేదీ లేదు. ఇది భారత ప్రభుత్వ విధానానికి వ్యతిరేకం.

(అంతరాయం)

అధ్యక్షా, స్వతంత్ర పోరాటానికి మునుపు నుంచి, బ్రిటీష్ రాజ్యం నుంచి కూడా భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్ ఉంది. ఈనాటి ఉత్కళ దేశం కూడా అంతకు ముందు ఏర్పడింది. మొదటి రాష్ట్రాల పునర్విభజన కమిటీ సిఫారసుల ప్రకారం నేటి భారత ప్రభుత్వ విధానం ఏర్పాటు చేయబడింది. భాషా ప్రయుక్త రాష్ట్రమే తప్ప ఇంకొకటి కాదు. ఆ సిఫారసుల నుంచి భారత ప్రభుత్వం వైదొలగనంత కాలం భారత ప్రభుత్వ విధానం భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అనుకూల పరిస్థితిని ఇక్కడ గుర్తు చేస్తున్నాను. భారత ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఉన్న కారణాన ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాం. ఈ బిల్లు తెలుగుజాతి ఐక్యతకు వ్యతిరేకం. మాది 40, 60 ఏళ్ల పోరాటం అని చాలా మంది మాట్లాడుతుంటారు కాని వేల ఏళ్ల పోరాట చరిత్ర కలిగిన తెలుగుజాతి ఐక్యతా పోరాటం ఇది.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు తమ శాసనసభాపక్ష నాయకులు శ్రీ ఈటెల రాజేందర్‌కు మాట్లాడడానికి మైక్ ఇవ్వాలని పోడియం వద్ద వచ్చి శాసనసభాపతిని కోరసాగారు)

ఎప్పుడో మూడు వేల సంవత్సరాల క్రితం ఆంధ్ర శబ్దం వినపడిన నాటి నుంచి, ఆంధ్రము, తెలంగాణము వేరు కాకుండా రెండు పర్యాయ పదాలుగానే ఒకటికి ఒకటి సమాన అర్థం వచ్చే విధంగానే. . .

(ఈ సందర్భంలో పోడియం వద్దనున్న తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు "జై తెలంగాణ" "జై జై తెలంగాణ" అంటూ నినాదాలు చేస్తూ సభను అంతరాయం కలిగించసాగారు.)

అధ్యక్షా, ఎందుకు వీళ్లకు ఇంత భయం? మూడు వేల సంవత్సరాలుగా ఆంధ్ర జాతులు మొట్టమొదట రాయలసీమ ప్రాంతంలో స్థిరపడ్డాయి. రాయలసీమ ప్రాంతం నుంచి ఆంధ్రులు కృష్ణా, గోదావరి నదులు ప్రవహించే ప్రాంతాలకు తరలివచ్చారు. క్రీస్తుపూర్వం తొలి తెలుగు, ఆంధ్ర సామ్రాజ్యం శాతవాహనుల కాలంలో ఏర్పడితే వారిచే 300 సంవత్సరాల కాలం పాలించబడితే, నేటి భారత ప్రభుత్వం శాలివాహన శకాన్ని లెక్కించి అధికారికంగా ప్రకటిస్తుంది. ఇది ఆంధ్రుల గొప్పతనం. తరువాత విచ్ఛిన్నం కాబడితే తెలుగు గానం చేసిన ఈ తెలంగాణ ప్రాంతంలో ఈ ఆంధ్ర ప్రాంతంలో తెలుగువారి ప్రాంతంగా ఏర్పడ్డ ఆంధ్ర మహానగరి, కాకతీయ సామ్రాజ్యం ఓరుగల్లు రాజధానిగా ఉంది.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులచే సభకు తీవ్ర అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Sailajanath garu, please sit down.

(ఈ సందర్భంలో మంత్రివర్యులు శ్రీ కె. జానారెడ్డి గారు మాట్లాడేందుకు తమ స్థానం వద్ద నిలబడ్డారు)

మిస్టర్ డిప్యూటి స్పీకర్ : దయచేసి మీ మీ స్థానాల్లో కూర్చోండి. I request the TRS Floor Leader, to request their Members to resume their seats. Afterall, the debate on the Bill has to go on. Please go back to your seats. Rajender garu, please ask your Members to sit down. You don't want the debate to go on? The Bill is very important. The debate has to go on. Please go back to your seats. Please do not obstruct the debate on the Bill. Don't do this. Please go back to your seats. I do not see any reason for obstructing the debate on the Bill. Please go back to your seats.

మ. 12.40

శ్రీ కె.జానా రెడ్డిః అధ్యక్షా, నేను ఈ సందర్భంగా మీ ద్వారా ఈ సభకు ఒక సూచన, సలహా ఇవ్వదలచుకున్నాను. దాని కంటే ముందు నేను పోడియం వద్ద వున్న గౌరవ సభ్యులకు రిక్వెస్ట్ చేసేదేమంటే వాళ్లందరూ తమ తమ స్థానాల వద్దకు వెళ్లి కూర్చుంటే స్పీకర్ స్థానంలో వున్న మీరు వాళ్ల ఫ్లోర్ లీడర్‌కు మాట్లాడడానికి అవకాశమిస్తారు. తద్వారా ప్రశాంతంగా చర్చను కొనసాగించడానికి అవకాశం కలుగుతుందని నేను కోరుతున్నాను.

(పోడియం వద్దవున్న తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు తమ తమ స్థానాల వద్దకు వెళ్లిపోయారు.)

ఈ సభలో ఇప్పుడు చర్చిస్తున్న అంశం విభజన గురించి. విభజన అవసరమా, అవసరం లేదా అన్న విషయం గురించి, అంశాలవారీగా చర్చ జరగాలా లేదా అన్న విషయానికి సంబంధించి, ఎవరైనా విభజనకు అనుకూలమా లేక వ్యతిరేకమా అనే విషయం గురించి, అంశాలవారీగా చర్చించటానికి లేక వారు విభజన అవసరం లేదు అనే అంశం వరకు పరిమితమైతే ఆ అభిప్రాయం వున్న వారు దానికే పరిమితమై మాట్లాడితే ఫరవా లేదు. విభజన కావాలనుకునే వారు ఎందుకు కావాలో చెబుతూ దానిని భేదించటం,విభేదించటం సబబు.

కాని అధ్యక్షా, నేను సభా నాయకుడిని కూడా అడుగుతున్నదేమంటే ఇక్కడ జరుగుతున్న కొన్ని విషయాలు సభకు అగౌరవం కూడా. విభజనను వ్యతిరేకిస్తూ తెలియజేయాల్సిన అంశాన్ని రాజ్యాంగ వ్యతిరేకమని అనటం, కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యమనటం సబబు కాదు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వున్నప్పటికి రాజ్యాంగబద్ధంగా కొన్ని హక్కులుంటాయి. వాటిని వినియోగించుకొని పంపబడిన బిల్లు ఇది. దానిని వ్యతిరేకించటం అంటే అటు కేంద్ర ప్రభుత్వాన్ని , రాజ్యాంగాన్ని కించపరుస్తున్నట్లు, లేక రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నట్లూ వుంటుంది. అందుకనే, రాజ్యాంగ పరిధిలో విషయాలను చర్చించేదానిలో

విభజన ఎందుకు వద్దో, ఎందుకు అవసరమో అన్న వాటికే పరిమితమై ఆ విషయాలను వివరించే క్రమంలో సరియైన పదజాలాన్ని ఉపయోగించటంలో జాగ్రత్తగా ఉండటం సభకు హుందాగా వుంటుంది. అలా కాని పక్షంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి మనం కట్టుబడి వున్నామని ఏదైతే చెప్పుకుంటున్నామో వాటికి కట్టుబడకుండా ఈ సభలో ఎవరి ఇంటరెస్ట్ వారు కాపాడుకునేటట్లుగా మాట్లాడుకుంటుంటే మనం ఇక్కడ రాజ్యాంగాన్ని అపభ్రంశం కలిగిస్తున్నట్లు దేశం, జాతి మొత్తం అనుకునే అవకాశముంది. అందుకనే స్పీకర్‌గా మీరైనా క్లారిఫికేషన్ ఇచ్చి చర్చ సక్రమమైన పద్ధతిలో జరగడానికి ప్రయత్నం చేయాలని నా సూచన. సంబంధిత ఫ్లోర్ లీడర్ అయినా ఇది గమనించి సభ సక్రమ పద్ధతిలో నడవడానికి సహకరించాలని, సభ మొత్తం కూడా దీనిని దృష్టిలో పెట్టుకొని సభ సజావుగా నడవడానికి సహకరించాలని నేను మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఈటెల రాజేందర్ః అధ్యక్షా, వారు మాట్లాడుతున్నప్పట్నుంచి చూస్తున్నాము. చర్చ సజావుగా జరగాలని మేమే కోరుతున్నాము. కలిసి వుండటానికి కారణాలు చెప్పమని కూడా మేము కోరాము. కాని వారు చర్చ మొదలుపెట్టినప్పట్నుంచి అబద్ధాలు మాట్లాడుతున్నారు. బాధ్యతాయుతమైన స్థాయిలో మంత్రిగా వున్న వారు మాట్లాడవలసిన పద్ధతి ఇది కాదు. ఏమంటున్నారు ఆయన? తెలంగాణా సాయుధ పోరాటం ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం జరిగిందంటున్నారు. కాదు అధ్యక్షా. తెలంగాణా సాయుధ పోరాటం ఆనాడు కొనసాగుతున్న వెట్టి చాకిరీ, దోపిడీలకు వ్యతిరేకంగా జరిగిందన్న విషయం మరచిపోకూడదు.

ఇక రెండవది. పదే పదే ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, కేంద్ర ప్రభుత్వానికి అసలు చట్టమే తెలియదన్నట్లుగా, కేంద్ర ప్రభుత్వమే రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లుగా మాట్లాడే మాటలు ఎంత అవమాన కరం అధ్యక్షా? ఇవ్వాళ మంచికో చెడుకో ఈ దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పరిపాలించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్న విషయం మీకు తెలియదా? ఈ సందర్భంగా నేను అడుగుతున్నదేమంటే పదే పదే మీరు ఈ సమైక్యరాష్ట్రానికి 23 జిల్లాలు మాత్రమే వున్నాయంటున్నారు కదా? ఆనాడు మేనిఫెస్టోలో పెట్టిన నాడు మీరు ఇది మాకు సమ్మతం కాదని చెప్పి రిజెక్ట్ చేసే దమ్ము ధైర్యం, అలా మాట్లాడే సత్తా మీకు ఎందుకు లేకపోయిందని నేను అడుగుతున్నాను.(తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులచే హర్షధ్వానాలు )

అధ్యక్షా, నేను ఇప్పటికి కూడా కోరుతున్నాను. గంట కాదు ఐదు గంటలు మాట్లాడండి. కాని మీరు ఎందుకు మాట్లాడలేకపోతున్నారు? పారిపోతున్నది మేము కాదు. మీరు పారిపోతున్నారు. కాళ్లు కదులుతున్నది మీకు. అవాస్తవాలలో బతుకుతున్నది మీరు. దుర్మార్గంగా మాట్లాడుతున్నది మీరు. చర్చ జరిగితే ఆర్గ్యుమెంట్ చేయలేమనే బుద్ధిహీనతతో సభను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. మీరు సభను అడ్డుకుంటున్నారు తప్ప మేము సభను కొనసాగించాలనే కోరుతున్నాము. 294 మంది సభ్యులచేత కూడా మాట్లాడించమని కోరుతున్నాము. కాని వాస్తవాలకు అనుగుణంగా మాట్లాడే ప్రయత్నం చేయండి. బాధ్యతాయుతంగా మాట్లాడే ప్రయత్నం

చేయండి. కాని ఒక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీఫార్మ్ మీద గెలిచి, మంత్రై ఇవ్వాళ ఈ విధంగా ఆ పార్టీని, ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం వంటి నీచ సంస్కృతికి ఒడిగట్టడం మీకు సంస్కారం కాదని గుర్తు పెట్టుకోవలసిందిగా తెలియజేస్తున్నాను.

(అధికార పక్షం సభ్యులచే అభ్యంతరాలు)

SRI P.ASHOK GAJAPATHI RAJU: I wish to be a resistance to you. Right or wrong all of us have sworn on the Constitution of India. There are Articles. We have Article 3 under which we have got this Legislation. We have Article 168 which defines a Legislature. Then we have Article 189 which clearly tells us that the view of this Legislature will be decided on majority here. When these articles were debated in the Constituent Assembly, the Chairman of the Constituent Assembly Drafting Committee has gone on record and said that he has got a list of doubts about Article 3. I have got a list of doubts, in that, the method of consulting which the President will adopt will be to ask\ either the Prime Minister or Governor to table a Resolution, which may be discussed in the particular State Legislature so that ultimately, the initiation will be from the local Legislators and not by the Parliament. So, the letter and spirit is very clear. There are other articles of the Constitution which enjoin the Ministers of the Government to take collective responsibility. Sir, unfortunately here the Ministers in our State Government are collectively irresponsible. Each one is giving different statements here. I think Mr.Chief Minister is also a Minister. It is your duty as you are in the Chair as Speaker to take this ambiguity beyond any doubt. Unfortunately, that is not being clarified. Certain Members say that the view of the Legislature is the view of the Legislators here. In such a situation, hate has been the norm. My personal opinion is that right from top to bottom, all these sentimental issues are used to cover up a greater evil in society called dishonesty. Nobody talks about it

Sir, let us rise to the occasion . Let us be responsible. Let the Ministers in Government behave like Ministers in Government and act by the Constitution. Nothing stops them from resigning. I have been a Member in this House from 1978. When I stepped in this House, Members debated, Ministers did not debate. Today, Members are not debating, it is Ministers who are debating. This is a very unfortunate state of affairs, let us correct it. Let us demonstrate to the world that we believe in the Constitution of India. If Ministers are to give diametrically opposite statements, it results in pandemonium. My appeal through you to Ministers is to behave as Ministers.

మ.12.50

డా.ఎస్. శైలజానాథ్ః అధ్యక్షా, నేను ఈ రాష్ట్రానికి మంత్రిని. సింగనమల నియోజక వర్గం నుండి ఎన్నికైన శాసనసభ్యుడిని. నేను వారిలాగా ఆకాశం నుండి క్రింద పడలేదు. శాసనసభ్యునిగా నా హక్కులు, నా బాధ్యతలు నాకున్నాయి. నేను కొన్ని కామెంట్సులోకి పోదలచుకోలేదు. నన్ను డిస్టబ్ చేయడం కోసం ఇంత గలబా జరుగుతుంది. ఓపిక ఉంటే వినవచ్చు లేదంటే చర్చ తరువాత అడగవచ్చు.

ఆర్టికల్ 371–డి సబ్ సెక్షన్ –10లో ఈ విధంగా ఉంది. This Article and the Presidential orders take effect notwithstanding anything in any other provision of the Constitution or in any other law for the time being in force. నాకు ఒక లాయర్‌గారు

పెద్దాయన పంపించారు. నేను అంత పెద్ద మేధావిని కాదు. ఆ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉందని చెప్పాను. అది ఎలా కాదో చెప్పవలసిన బాధ్యత భారత ప్రభుత్వానిది. ఈ రోజు ఇక్కడున్న వారిని నేను ప్రశ్నించడం లేదు. ఈ రోజున టిఆర్ఎస్ పార్టీ విభజన కోసమే ఏర్పడిన పార్టీ. వాళ్లకు అంత కంటే ఎజెండా ఇంకొకటి లేదు. ప్రాంతాల సమస్య వచ్చినప్పుడు బహుశా ప్రాంతాల సమస్యగా చూశాము కాని ఇది ప్రాంతాల సమస్య కాదు. తెలుగు వాళ్లు అంతా కలిసి ఉండాలి. కొంతమంది కొన్ని కారణాల కోసం విడిపోవాలన్నది ఏర్పడింది. నేను సీమాంధ్ర అయితే సమస్య ఏమి ఉంది? మేము సమైక్య ఆంధ్రులము. ఇక్కడున్న ప్రతి ఒక్కరమూ కావడి క్రింద పడవేసిన రోజున కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్ఎల్ఏలమూ, ఎమ్ఎల్సిలమూ ఈ సమైక్యాంధ్రప్రదేశ్ పతాకాన్ని పట్టుకొని ఢిల్లీ నుండి హైదరాబాదుకు తిరిగి తిరిగి చచ్చాము. ఒక పార్టీ నాయకుడు మాట్లాడుతూ మేము పోరాటంలో పాల్గొనం, పోరాటంలో పాల్గొనక పోవడం గొప్ప విషయమని ఎక్కడ చెప్పారో నాకు తెలియదు కాని ఆయా పార్టీల నాయకత్వాలతో వారికి ఉన్న లిమిటేషన్సుతో ఊరికినే ఉన్న రోజున కూడా ఇది అన్యాయం, తెలుగు వాళ్ల ఐక్యతకు, అభివృద్ధికి భంగం ఇది. కొద్దిమంది స్వార్థపరుల కోసం, కొద్ది మంది అవకాశవాదుల కోసం జరగకూడదని మేము యుద్ధం చేసిన వాళ్లం, పోరాడిన వాళ్లం . ఇప్పటికీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డిగారి నాయకత్వంలో పోరాడుతున్న వాళ్లం . ఈ రాష్ట్ర ఐక్యత కోసం, ప్రాంతాల అభివృద్ధి కోసం కాదు . తెలుగు వాళ్ల గురించి ఆంధ్రపితామహులు మాడపాటి హనుమంతరావుగారు ఇక్కడి వారే. వారు ఆంధ్ర పితామహులుగా చెప్పుకోవడానికి గర్వపడ్డారు. వారి షష్టిపూర్తిలో దిగవల్లి వెంకట శివగారు మన తెలంగాణా అని ఒక పెద్ద వ్యాసం వ్రాశారు. వారి పోరాట స్ఫూర్తిని కాపాడవలసిన, మోయవలసిన బాధ్యత వారి వారసులుగా మా పైన ఉంది. ఉత్తర సర్కారులోనూ, రాయలసీమలోనూ, నాగపూర్, గోండు అను బస్తరు ప్రాంతాలలోను, నిజాం రాష్ట్రంలోని 8 జిల్లాల్లోనూ, ఇంకా తమిళ, ఉత్కళ ప్రాంతాల్లోనూ చీలికలుగా ఉన్న తెలుగు భాగాలన్నీ ఒక కాలంలో ఆంధ్ర దేశం లేదా తెలంగాణాగా ఉండి రాజకీయంగాను, ఆర్థికంగా, వైజ్ఞానికంగా మహా వైభవాన్ని అనుభవించాయని వెంకట శివగారు వ్రాసిన వ్యాసంలో ఉంది.

ఈ రోజున తెలంగాణం అంటే తెలుగు గానం అధ్యక్షా. ఆంధ్రం, తెలుగు సమానమే అధ్యక్షా .

(ఈ దశలో మైకు లేకుండా టిఆర్ఎస్ సభ్యులు ఓహో, ఓహో అని అన్నారు.)

మామూలే అధ్యక్షా. నేను చాలా స్పష్టంగా చెప్పాలని అనుకుంటున్నాను. ఎవరికైనా నిజంగా ఆర్యూ చేయగలిగిన శక్తి ఉంటే, చారిత్రక అంశాలను ముందు పెట్టి మాట్లాడే సహేతుకత ఉండి, నిశ్శబ్ధంగా విని నా యొక్క వాదనను త్రిప్పి కొట్టవచ్చు అధ్యక్షా. మనుష్యులు భాష అనే దానిని ఏర్పాటు చేసుకోవడం కోసం వేల ఏళ్లు పట్టిందని భారత విద్యార్థి ఫెడరేషన్‌లో పనిచేసే రోజులలో భాష గురించి నేర్చుకున్నాము. అదేమిటో మానవ భాష నుండి తిరిగి ఇంకొక భాషలోకి మారడానికి వందల నిమిషాలు కూడా పట్టడం లేదు. ఈ కేకలు, అరుపులు చూస్తుంటే దయచేసి మానవుల

భాషలో మాట్లాడుకునే ప్రయత్నం చేద్దాము. తెలుగు వాళ్ల ఐక్యత కోసం, తెలుగు వాళ్ల అభివృద్ధి కోసం, తెలుగు మాగాణులు సిరిసంపదలతో విలసిల్లేందు కోసం అంతర్జాతీయంగా తెలుగు వాళ్ల ఖ్యాతి పెరగడం కోసం ఈ రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తున్నాను. తెలంగాణా ప్రాంతంగా పిలువబడుతున్న ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్ర నగరిగా ఓరుగల్లు, ఆంధ్ర మహా సామ్రాజ్యంగా కాకతి సామ్రాజ్యం పరిపాలించిన సంగతి గుర్తు చేస్తున్నాను. కాకతి సామ్రాజ్యం ఎలా పతనం అయిందో చాలా మందికి తెలుసు.

(టిఆర్ఎస్ సభ్యుల నుండి అంతరాయం)

నాకు కూడా లాగితే లాగబడే వీక్‌నెస్ ఉంది. ఈ కాకతి సామ్రాజ్యాన్ని .....

(ఈ దశలో మైకు లేకుండా టిఆర్ఎస్ సభ్యుల నుండి కాకతీయ అని అనసాగారు.)

సరే, దానికి కూడా పాపం ఇక్కడ మహానుభావులు వ్రాసిన పుస్తకాలు చూపిస్తాను. వారు నన్ను లాగడంలో వారు సక్సెస్ అవుతున్నారు. ఆనాటి ఢిల్లీ మొగలాయిల దాడిని ఆనాటి ఆంధ్ర సామ్రాజ్యం ఎదుర్కొన్నప్పుడు ఆ రాజ్యంలో ఉన్న రెండు ప్రధాన అధికార కులాల యొక్క అంతర్గత పోరాటం ఆనాటి కాకతి సామ్రాజ్యాన్ని పతనం చేశాయి. మరొకసారి తెలుగు సామ్రాజ్యం కూలిపోయింది. వారు 200 ఏళ్లకు పైబడి పరిపాలించారు. అక్కడ వారి దగ్గర ఉన్న వారు విజయ నగరం వెళితే విజయ నగర సామ్రాజ్యం ఏర్పడింది. అటు తరువాత జరిగిన యుద్ధాలలో విజయ నగర సామ్రాజ్యం కూలి పోయిన తరువాత ఇదే హైదరాబాద్ కేంద్రంగా గోల్కొండ ముఖ్య పట్టణంగా కుతుబ్‌షాహీలు పరిపాలించారు. వారు తెలుగు ప్రభువులుగా చెప్పుకున్నారు. వారు తెలుగునే ప్రామాణికంగా తీసుకున్న చరిత్ర ఇక్కడ లభిస్తుంది. అటు తరువాత మన ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా నిజాం సామ్రాజ్యం ఏర్పడింది. మామూలుగా మాట్లాడితే 60 ఏళ్ల పోరాటం, 100 ఏళ్ల పోరాటం అని వేల ఏళ్ల తెలుగు వాళ్ల పోరాటాన్ని జాతి యొక్క ఆత్రుతను తెలుగు జాతి యొక్క కోరిక మీకు కనిపించదా అని అడుగుతున్నాను. వేల సంవత్సరాలుగా తెలుగు వాళ్లు అంతా ఒక్కటిగా ఉండాలని ఒకానొక సందర్భంలో ఒకానొక పెద్ద నాయకుడు అన్నారు. పేరు ఇక్కడ చెప్పలేను.

మ.1.00

ఒక పెద్ద నాయకుడు ఒక మాట అన్నట్లు నాకు గుర్తు. “Telugus are imperialistic in nature” అని అన్నారు. అది చదివినప్పుడు నాకు బాధ అనిపించింది. ఆ పెద్ద మనిషి పైన గౌరవం తగ్గింది. ఆంధ్రులు ఆత్మాభిమానం గలవారు. స్వాతంత్ర్యం కోసం పరితపించేవారు. ఈ క్రమంలో ప్రతిసారి ఐక్యత కోసం పోరాడేవారు. చెన్నపట్నం, బరంపురం ఇలా వెళ్తే మహరాష్ట్రలో ఉన్న మన ప్రాంతాలు, మా జిల్లా పక్కనే ఉన్న కర్నాటకలోని తెలుగు జిల్లాలను ఒకొక్కటీ పోగొట్టుకుంటూ వచ్చాం. పెద్దలు జానారెడ్డి గారు క్షమించాలి. చెన్నపట్నం ఆ రోజులలో ఆర్థిక రాజధాని. బరంపురం

గురించి స్వాతంత్ర పోరాటంలో మనకు కనిపిస్తుంది. ఇప్పుడు అదే బెర్హంపూర్. ఆ రోజున తెలుగు భాషా వికాసానికి, అభివృద్ధికి పునాది వేసిన జిల్లా బరంపురం అధ్యక్షా. బళ్లారి అంటే హంపీ. విజయనగర సామ్రాజ్యం మన యొక్క అధికార కేంద్రం. కోస్తా ఆంధ్ర ప్రాంతాలు, రాయలసీమ ఆంధ్ర ప్రాంతాలు, తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలున్నాయి. పెద్దలు అంతా కలిసి తెలుగు జాతి ఒక టిగా ఉండాలి, ఐక్యంగా ఉండాలి, అనేక అంశాలను ఇచ్చిపుచ్చుకోవాలి, కష్టసుఖాలను సర్దుకోవాలని సద్దుదేశంతో చాలా మంది మాట్లాడుతున్నారు. కర్నూలులో విశాలాంధ్రకు వ్యతిరేకంగా పెద్ద సభలు జరిగాయి. ఎవరికైనా వీలుంటే గోల్కొండ పేపర్ని, ఆంధ్రపత్రికను చూసుకుంటే అర్థం అవుతుంది. తీర్మానం చేయని జిల్లా లేదు, సంఘం లేదు, పురం లేదని గుర్తుచేస్తున్నాను. కుల సంఘాలు, వృత్తి సంఘాలు, మున్సిపాలిటీలు, జిల్లాలు కాంగ్రెస్ పార్టీలు, మిగతా పార్టీలు విశాలాంధ్ర కోసం తీర్మానం చేశాయి. ఫజల్ అలీ కమిటీకి 5 సంవత్సరాలు సమయం పెడితే, అనవసరమని శాసనసభ తీర్మానం చేసింది. బూర్గుల రామకృష్ణారావు గారు హైదరాబాద్ని రాజధాని చేస్తేనే విశాలాంధ్రాకు ఒప్పుకుంటామని డిమాండ్ చేసి హైదరాబాద్ను ఆంధ్ర రాజధానిని చేశారు. కృష్ణా నదిని దాటించి, తుంగభద్రను దాటించి ఇక్కడికి తీసుకొచ్చారు. వచ్చింది ఏమిటి? రాయలసీమ వాళ్లం ఎందుకు పౌరుషం కోసం, మీసం కోసం పుట్టామో కాని కర్నూలు నుండి రాజధానిని ఇచ్చేసాము. ఎవరికైనా అనుమానం ఉంటే మన శాసన సభలో లైబ్రరీ ఉంది. డిజిటైజేషన్ చేయబడింది. అక్కడికి వెళ్తే అన్ని వివరాలు తెలుస్తాయి. ఈ లైబ్రరీని పెట్టినందుకు మీకు ధన్యవాదాలు. రాష్ట్రం ఏర్పడింది. విశాలాంధ్ర కావాలని అసలు ఉద్యమం ఎక్కడ మొదలయ్యింది? ఏదైతే వందల సంవత్సరాలుగా ఆంధ్ర రాజ్యంగా విలసిల్లిందో, ఈ తెలంగాణాగా ప్రాంతం నిజాం తెలుగు ప్రాంతం నుంచి మొదలైన సంగతిని నేను గుర్తుచేసుకుంటున్నాను.

అధ్యక్షా, గుంటూరు గురించి తరువాత మాట్లాడతాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రుద్దబడిందని చెబుతున్నారు. వలసవాదులు మీరు అని ఇంతకు ముందు ఎవరో మాట్లాడారు. మేము వలసవాదులు కాదు, మేము అసలు వాళ్లం. తెలుగు వాళ్లం, ఆంధ్రులం. ఆంధ్ర మహానగరి అయిన హైదరాబాద్కి వచ్చాం, పిలిస్తే వచ్చాం, ఆహ్వానం మేరకు వచ్చాం. కర్నూలును, కందవోలును వదులుకొని వచ్చాం. కారణం, ఇది ఆంధ్రుల పట్నం, తెలుగు వాళ్ల పట్నం. వైభవం గురించి మాట్లాడుతున్నారు. కోహినూరు వజ్రం మాది అని ఒక పెద్ద మనిషి మాట్లాడారు. పెద్దలు కిరణ్కుమార్ రెడ్డి గారు నాకు మంత్రి పదవి ఇచ్చారు కాని సమైక్యాంధ్ర మంత్రిగా నేను పనిచేశాను. ఇక్కడున్న ప్రాంతాలలో వజ్రపు గనులు ఎక్కడున్నాయి? ఏ వజ్రపు గనుల నుండి ఆ కోహినూరు వజ్రం ఇక్కడికి వచ్చిందో తెలుసుకోమని అడుగుతున్నాను. ఉంచుకోడానికి, తెంచుకోడానికి మీరు ఉంచి ఉంటే కదా గండ్ర గారు, మీరు వదిలేసెయ్యండి నన్ను. నిజాం సంస్థానం కూడా ఒకానొక రోజున ఈ సువిశాలమైన తెలుగు భూభాగాలకు అధిపతిగా ఉన్న సంగతి ఇక్కడ గుర్తుచేస్తున్నాను. కోస్తా ఆంధ్రా ప్రాంతాలను మిలటరీ ఖర్చులకు, పరిపాలనా సలహాలకు కుదవ పెట్టిన, అమ్మివేసిన కారణాల వల్ల ఈ రెండు ప్రాంతాలు పక్కకు వెళ్లాయి కాని లేకపోతే

సువిశాలమైన తెలుగు ప్రాంతాం మొత్తం నిజాం రాజ్యంగా ఉన్న సంగతి గుర్తు లేదా అధ్యక్షా. నిజాంని కీర్తించాల్సిన అవసరం మనకు లేదు. వారు వేరే ఉన్నారు. బ్రిటీష్ వారియొక్క సామ్రాజ్యవాదంతో, నిజాం ప్రభువు యొక్క స్వార్థంతో తెలుగు ప్రాంతాలు విభజించబడ్డాయి. బరంపురాన్ని కోల్పోవడం, బస్తర్ జిల్లాను వదిలేయడం, కర్నాటకలో ఉన్న మిగతా ప్రాంతాలను కూడా వదులుకోవడం జరిగింది. నిజాం ప్రభువు ఆ రోజు మిగతా వారితో కలిసి ఈ రాష్ట్రాన్ని ముక్కలు చేశారు. ఆంధ్ర రాష్ట్ర పోరాటం 60 ఏళ్ల కంటే ఎక్కువా తక్కువా అధ్యక్షా? 60 పెద్దది 1000 చిన్నది అంటే నేను ఏమి చేయలేను. వేల ఏళ్ల ఆకాంక్ష, వేల సంవత్సరాల పోరాటం తెలుగు రాష్ట్రం తప్ప ఇంకొక కాదు. ఈ ఉద్యం మొదలైన రోజున నాకు బాగు గుర్తు అధ్యక్షా.

మ.1-10

ఆ ఉద్యమ నాయకుడిగా చెప్పుకొనే వ్యక్తి ఒక మాటన్నారు. తెలంగాణ ప్రాంతం వెనుకబడింది, ఇక్కడ అభివృద్ధి లేదు, చంద్రబాబు నాయుడు గారు మంత్రి పదవి ఇవ్వలేదు కాబట్టి తెలంగాణ వెనుకబడిందనే ఒక నినాదంతో ముందుకు వచ్చి పోరాటాల గడ్డ తెలంగాణలో ఉన్న యువకులు, విద్యార్థుల ఆవేశాన్ని అడ్డం పెట్టుకొని ఒక అందమైన ముసుగు ధరించి, ఆ ముసుగులో తెలంగాణ ప్రాంతం వెనుకబడిందని విద్యార్థుల, యువకుల ఆవేశకావేశాలను రెచ్చగొట్టారు. చంద్రబాబు నాయుడు గారి పేరు ప్రస్తావించినందుకు పెద్దలు నన్ను క్షమించాలి.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుల నుంచి అంతరాయం)

12 సంవత్సరాలుగా యుద్ధం చేస్తున్నారని వారికి క్లైయిం ఇచ్చాను. అది వారిష్టం. హైదరాబాదు రాష్ట్రం ఏర్పడినపుడు ఎవరికి ఏమైనా అనుమానాలుంటే ఆనాటి హైదరాబాదు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూడాలి. కేవలం ప్రస్తుతం తెలంగాణగా పేర్కొంటున్న 8 లేదా 10 జిల్లాలు కాదు. అప్పటి హైదరాబాద్ ఆర్థిక పరిస్థితిని చూడాలి. నేను చాలా కింది స్థాయి నుంచి వచ్చిన వ్యక్తిని కాబట్టి విధ్య, వైద్యం ఆ రెండూ నాకు ప్రాధాన్యత కలిగినవి.

(శ్రీ ఈటెల రాజేందర్ నుంచి అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Let him complete. Please cooperate. Please sit down Rajender garu.

డా.ఎస్.శైలజానాథ్: అధ్యక్షా, 1900 నుంచి 1950 వరకు ఆర్కైవ్స్ పరిశీలించాలి. హైదరాబాద్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్టేట్ ఆర్కైవ్స్ వారు ప్రచురించిన పుస్తకంలో ఉన్నవి నేను చెబుతున్నాను. 1955-56 నాటికి హైదరాబాద్ రాష్ట్రం అంటే కేవలం తెలంగాణ ప్రాంతం మాత్రమే కాదు. మహారాష్ట్రలో, కర్ణాటకలో కలిపిన హైదరాబాద్ రాష్ట్రంలోని జిల్లాలనూ కూడా కలిపిఉన్నాయి. వాటి మొత్తం ఆదాయం రూ.25.59 కోట్లు. అదే ఆంధ్ర రాష్ట్రంగా పిలవబడే కోస్తా, రాయలసీమ ప్రాంతాలు రెండింటిలో ఆదాయం 21.85 కోట్లు. అవిభక్త హైదరాబాద్ రాష్ట్రమని చెప్పాను. తెలంగాణ ప్రాంత సభ్యులు ఎపుడు మాట్లాడినా తెలంగాణలో మిగులు బడ్జెట్ ఉందని

చెబుతున్నారు. నేను అడిగేది ఏమంటే, మహారాష్ట్రలో, కర్ణాటకలో కలిపిన ప్రాంతంతో కలిసి ఉన్నప్పటి ఆర్థిక పరిస్థితి చెబుతున్నాను. ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలకు వ్యవసాయం మీదనే ఎక్కువ ఆదాయం వచ్చేది. ఇపుడు కూడా వ్యవసాయం మీదనే మన రాష్ట్రానికి ఎక్కువ ఆదాయం వస్తుందని రెవెన్యూ మంత్రిగారు ఎపుడూ చెబుతుంటారు.

తెలంగాణ ప్రాంతంలో 1956 నాటికి 3.5 లక్షల ఎకరాలకు మాత్రమే చెరువులు, బావులు, ప్రాజెక్టుల ద్వారా నీటిపారుదల సౌకర్యం ఉండేది. నిజాం ప్రభువులు పేరుగాంచినారని, వారిని ప్రస్తుతం తెలంగాణ ఉద్యమంలో ఉన్నవారు కీర్తిస్తున్నారో, భుజాలు తడుముకుంటున్నారో గానీ నిజాం హయాంలో 3.5 లక్షల ఎకరాలకు మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉండేది. గజ్వేల్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన పెండెం వాసుదేవ్ గారు ఆనాటి ఆర్థిక పరిస్థితి డొల్లతనం గురించి చాలా స్పష్టంగా చెప్పారు. It is only for records. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆర్థిక స్థోమత కలిగి వ్యవసాయకంగా కూడా అన్ని విధాలుగా బాగుంటుందని తెలంగాణవాదులు చెబుతున్నారు. వ్యవసాయకంగా ఆలోచిస్తే తెలంగాణ జిల్లాలలో మొత్తం 40 వేల మైళ్ల విస్తీర్ణంలో 14 వేల మైళ్ల విస్తీర్ణంలో సాగు చేయబడుతుండేది. దీనిలో ఆహారపంటలు అనగా వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న కలిపి 7.5 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుంది. కోటి జనాభాకు ఒక్కొక్కరికి రోజుకు రెండు ఔన్సులు చొప్పున ఆహారం అవసరమవుతుంది. పక్కనున్న ఆంధ్ర రాష్ట్రంలో రెండు కోట్ల జనాభాకు 40లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతుంది. అందులో వరి ధాన్యం సుమారు 28, 29 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుంది.

హైదరాబాద్ రాష్ట్రంలోనుంచి కన్నడ ప్రాంతం కర్ణాటకలో విలీనమవడంవలన తెలంగాణ రాష్ట్రంలో నూలు మిల్లులు మూతపడతాయని, సగానికి పైగా పత్తి మిల్లులు వాడకంలోకి రాకుండా పోతాయని, పప్పుదినుసులు మహారాష్ట్ర నుంచి వస్తున్నాయి కానీ ప్రత్తి, పప్పుదినుసులు, వేరుశనగ, జొన్న పంటలు ఎక్కువగా మహారాష్ట్రపై ఆధారపడి ఉంటుందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నూనె విషయంలో, వేరుశనగ, పప్పుదినుసుల్లో ఎవరిపై ఆధారపడి ఉండాలో ప్రత్యేక తెలంగాణవాదులు ఈ విషయంలో చెప్పలేకుండా పోతున్నారని చెప్పారు. ఓడరేవుల గురించి కూడా బాధపడ్డారు. ప్రత్యేక తెలంగాణ కోరే మంత్రులకు ఇవన్నీ తెలుసు. ఇటువంటి సమస్యలను కప్పిపుచ్చి ప్రత్యేక రాష్ట్రం కోరేదానిలో వారి దురుద్దేశం ఏమిటని పెండెం వాసుదేవ్ గారు ప్రశ్నించారు. కూలిపోతున్న నిరంకుశ చరిత్ర కలిగిన ప్రభుత్వాన్ని తిరిగినిలబెట్టి పెత్తనమంతా పెత్తందారుల చేతుల్లో పెట్టుకొని తెలంగాణలోని కోటి జనాభా, ఆంధ్ర రాష్ట్రంలోని రెండు కోట్ల ప్రజానీకం క్షేమాన్ని అరికట్టే ప్రయత్నం తప్ప మరొకటి కాదని మనవి చేస్తున్నానని ఆరోజు సభలో పెండెం వాసుదేవ్ గారు చెప్పిన మాట ఈ రోజుకు కూడా వర్తిస్తుంది.

(తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభాపక్ష నాయకుడు శ్రీ ఈటెల రాజేందర్‌చే అంతరాయం)

MR.DEPUTY SPEAKER: I have given enough time. Please sit down. మీకు చాలా సమయం ఇచ్చాను.

DR.S.SAILAJANATH: These are all assembly records only. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఎక్బోటే గారు అప్పుడు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌లో రూ.4.5 కోట్లు విద్య విషయంలో ఖర్చు పెట్టాను, ఇవన్నీ స్వయంగా పోషించుకొనుటకు ఏ విధంగా ఉందో తెలియదని చెప్పారు. ఇదీ ఆనాటి ఆర్థికపరిస్థితి. కనుక వీరి ఉద్దేశం ప్రకారం నిజాం ప్రభువు ఈ తెలంగాణ ప్రాంతాన్ని సువిశాలంగా, సుభిక్షంగా, సంపన్నంగా మార్చినట్లు ప్రజలు స్వర్గంలో ఉన్నట్లు, ఆ స్వర్గం నుంచి ఆదాయం వచ్చినట్లు నిజాం ప్రభువులను పరోక్షంగా కీర్తించడమే గానీ వాసుదేవ్‌గారు చెప్పినట్లు నిరంకుశ జాగీర్దారీ వ్యవస్థను నిలబెట్టేందుకు చేసే ప్రయత్నం తప్ప ఇంకొకటి కాదని, వారు ఆ రోజు చెప్పిన మాటలు నేటికీ సత్యమని చెప్పడానికి నేను ఏ మాత్రం వెనకాడడం లేదు. అంతే కాదు, ఆ రోజున కోదాటి నారాయణరావు గారు ఒక మాటన్నారు.

(అంతరాయం)

నేను ఎక్కువ మాట్లాడను. డిసెంబర్ 22న సికింద్రాబాద్‌లో జరిగిన విశాలాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించిన కోదాటి నారాయణరావు గారి ఉపన్యాసం గురించి ఆంధ్రపత్రికలో 27.12.1955లో ప్రచురించిన వార్త చదువుతున్నాను. "భాషా సంస్కృతులలోనూ, ఆచార వ్యవహారాలలోనూ ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రానికి, తెలంగాణకు పెద్ద బేధం ఉందని చెప్పడం కేవలం వాదానికి మాత్రమే. ఇది భిన్నం కాదనడానికి తెలుగు భాషా సమితి, ఆంధ్ర నాటక కళాపరిషత్, తెలుగు సంస్కృతి సంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్ సంఘం, ఇతర సంస్కృతి ఉద్యమాలలో ద్విభాషావాదులైన శ్రీ రంగారెడ్డి గారు, చెన్నారెడ్డిగారు, జె.వి.నర్సింగరావు గారు వహిస్తున్న పాత్ర ప్రబలమైన సాక్ష్యం-శ్రీ పెండెం వాసుదేవ్". "పదవుల సమస్య దేశ సమస్య కన్నా పెద్దది కాదు. పదవుల సమస్య దేశ సమస్య కన్నా పెద్దది ఏ సందర్భంలోనూ కాజాలదు. ఇక ఉద్యోగాల సమస్య దేశ సమస్యతో పోల్చి చూస్తే చాలా స్వల్పమైనది.''

మ.1.20

అధ్యక్షా, "దేశ జనాభాలో చాలా కొద్దిమంది మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు. వీరి కొరకై దేశం కాదు, దేశం కొరకే వీరు అనే విషయాన్ని గుర్తుంచుకోవలయును. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు, తెలంగాణ రాష్ట్ర ప్రజల కన్నా తెలివిగలవారని, దుర్మార్గులని, తెలంగాణను దోచుకుంటున్నారని చెబుతున్నారు. ప్రత్యేక తెలంగాణ లోనూ దోచుకునే వారు, దోచుకొనబడే వారు ఉండరనే హామీని ఎవరూ ఇవ్వలేరు" అని కోదాటి నారాయణ రావు గారన్నారు. "దోచుకునే అధికారం తమకు మాత్రమే వంశపారం పర్యంగా ఉండవలయునని, ఎవరైనా దోచుకునే వర్గాల వారు పోరాడితే, మిగతా వర్గాల వారు ఏమి చేయాలి" అని అలనాటి తెలంగాణ ప్రాంత ప్రముఖుడు కోదాటి నారాయణ రావు గారు చెప్పారు.

అధ్యక్షా, ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే వీళ్లంతా లేని మాటలు మాట్లాడుతున్నారని. రాష్ట్రం విడిపోతే లక్షలాది ఉద్యోగాలు ఖాళీ అవుతాయని చెప్పారు. అధ్యక్షా, ఇది ఎంత దుర్మార్గమైన మాట? పిల్లల్ని మోసం చేయడం కోసం ఇప్పుడిప్పుడే చదువుకొని పైకి వస్తున్న దళితుల బిడ్డల్ని అన్యాయం చేయడం కోసం, పేదల బిడ్డల్ని చావుకు దగ్గరగా తీసుకు వెళ్లడం కోసం లక్షల ఉద్యోగాలు ఖాళీ అవుతాయని చెబుతున్నారు. అధ్యక్షా, ఆరు సూత్రాల పథకం ద్వారా ఎంత మంది ఉన్నారని బహుశా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, మేము అధికారంలో ఉన్నప్పుడు కమిటీల మీద కమిటీలు వేసి నిగ్గు తేలిస్తే కొన్ని ఉల్లంఘనలు జరిగాయి, దీంట్లో 14,794 మంది మాత్రమే రాష్ట్రపతి ఉత్తరువులకు విరుద్ధంగా నియమితులయ్యారు ఇప్పటికే 9,178 మందిని పంపడం జరిగింది, మిగతా వాళ్లు కోర్టు ఆర్డర్స్ వలన ఉన్నారు అని తెలిసింది. కానీ వీళ్లు 1,50,000 మంది అక్రమంగా నియమించబడ్డారని పిల్లలకు అబద్ధాలు చెప్పారు. ఈ విషయంలో తెలంగాణకు చెందిన ఒక ఎన్‌జిఓ నాయకుడు ఒక టివి చర్చలో పాల్గొని అవును నాలుగైదు వేలకు మించి ఇతర ప్రాంతాలకు చెందిన వాళ్లు తెలంగాణలో ఉండరు కానీ తెలంగాణ మా హక్కు కదా అన్నారు. అంటే లేని విషయాలు చెబుతున్నారు. ఇంతకు ముందే ఎవరో మాట్లాడుతూ కోర్టు ఉద్యోగాల లెక్కలు చెబుతూ 100కి గాను 10 మందే ఉన్నారు, 1000 ఉన్నాయి కానీ ఇద్దరే ఉన్నారు అని ఏవో లెక్కలు చెబుతున్నారు. అధ్యక్షా, ఈ ఉద్యోగాలేమైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నామినేషన్ బేసిస్ పైన ఇచ్చిందా? ఎవరి విచక్షణాధికారం మీదైనా ఈ ఉద్యోగాలను ఇచ్చారా? నాకు తెలిసీ కోర్టు ఉద్యోగాల్లో పరీక్షలుంటాయి. అధ్యక్షా, ఈనాటి న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్ లేదని నాకు బాధ ఉంది. అన్నీ ప్రాంతాల్లోని ఎస్సీలకు, బీసీలకు అన్యాయం జరుగుతుంది కాబట్టి న్యాయ వ్యవస్థలో కూడా అన్నీ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీలకు, బీసీలకు రిజర్వేషన్లు ఉండాలని నమ్మేవాణ్ణి. కానీ వీళ్లు చెప్పే విధంగా ఏ ఉద్యోగమైనా ప్రభుత్వం విచక్షాధికారంతో ఇచ్చిన సందర్భం ఉందా? ఎందుకు ఈ మాయ మాటలు? విద్యారంగం గురించి మాట్లాడుతున్నారు. అధ్యక్షా, గుండెల మీద చేయి వేసుకుని చెప్పమనండి. నిజాం సంస్థానం కూలి పోయినప్పుడు ఈ రాష్ట్రంలో ఉన్న స్కూళ్లెన్ని? జూనియర్ కాలేజీలెన్ని? డిగ్రీ కాలేజీలెన్ని, కనీసం తెలుగు రాయడానికి, మాట్లాడటానికి ఒక్క స్కూలైనా ఎవరికన్నా దొరికిందా? అప్పుడెప్పుడో నిజాం పరిపాలనలో ఒక మెడికల్ కాలేజీ పెడితే అది కూడా ఉర్దూ మీడియంలోనే ఉంది. నేను ఉర్దూకి వ్యతిరేకం కాదు. కానీ నేను తెలుగు మీడియం గురించి మాత్రమే మాట్లాడుతున్నాను.

(శ్రీ ఈటెల రాజేందర్ చే అంతరాయం)

పోనీ తెలుగు గురించి వద్దు. ఎన్ని స్కూళ్లున్నాయో చెప్పమని చెప్పండి. ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు ఎన్ని ఉన్నాయో చెప్పమని చెప్పండి.

అధ్యక్షా, 2005 నాటికి ప్రాథమిక పాఠశాలలు ఆంధ్ర ప్రాంతంలో 22,414, రాయలసీమలో 8,613, తెలంగాణ ప్రాంతంలో హైదరాబాద్ మినహాయించి 23,119 ఉన్నాయి.

హైదరాబాద్‌లో మరో 1415 ఉన్నాయి. జూనియర్ కాలేజీలు ఆంధ్ర ప్రాంతంలో 1436, రాయలసీమలో 599, తెలంగాణలో 1510, హైదరాబాద్‌లో 335 ఉన్నాయి. డిగ్రీ కాలేజీలు ఆంధ్ర ప్రాంతంలో 145 ఉన్నాయి. సాక్షాత్తూ వీళ్ల నాయకుడు(టిఆర్ఎస్ పార్టీ నుద్దేశించి) ఒప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి జరిగింది, అభివృద్ధి జరగబడింది, అభివృద్ధి అనేది పౌరుడిగా నా హక్కు, అభివృద్ధి అనేది మా పౌర హక్కు అని జరిగిన అభివృద్ధిని మీ నాయకుడు శ్లాఘించిన సంగతి పేపర్‌లో రిఫర్ చేసుకుంటే కనబడుతుంది చూస్కోండి. అటు తరువాత కదా మీరు స్వయం పరిపాలన, అభిమానమని మాట మార్చింది. మీరు ఏదైతే మాయ ముసుగులు ప్రజానీకం మీద కమ్మారో, విద్యార్థుల్ని, ఉద్యోగస్తులను రెచ్చగొట్టారో అవన్నీ అబద్ధమని నిరూపించబడ్డ తరువాత, మీరు తప్పులు చెబుతున్నారని చెప్పిన తరువాత నాలుకను మడతేసి "అభివృద్ధి మా హక్కు, మాకు స్వయం పరిపాలన కావాలి" అని చెప్పారు. స్వయం పరిపాలన అంటే ఎవరి పరిపాలనో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు.

అధ్యక్షా, నాకు ఒక పాట గుర్తుకొస్తోంది. మహబూబ్ నగర్‌కు చెందిన గోరటి వెంకన్న అనే వ్యక్తి నాకు బాగా తెలుసు, మేము కలిసి పని చేసాము. ఆయన పాడిన ఆ పాటలో దొరలు రూపు మార్చుకుని కొత్త వేషాలు కట్టారు, ఈ కొత్త వేషాలు కట్టి మరలా గ్రామాలకు వస్తున్నారు జాగ్రత్త అని ఉంది. చాలా బాగుంది. అందరూ వినాలి. ఎవరైనా సరే తెలంగాణ ప్రాంతంలో ఉన్న దళితులకు అనుకూలమో, పేద ప్రజలకు అనుకూలమో, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకమో వారంతా ఆ పాటను వినండి, వాస్తవాన్ని గ్రహించండి.

(ఈ సందర్భంలో కొంత మంది టిఆర్ఎస్ పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

అధ్యక్షా, ఫుట్‌బాల్ అంటే నాకు ఇష్టం. ఫుట్‌బాల్‌లో మార్కింగ్ చేస్తారు. ఆ టీములో ఉన్న స్టార్ ప్లేయర్‌ని ముగ్గురు ప్రధానంగా ఉండి మోకాళ్లకు, మోచేతులకు, వీలైతే తలకు కూడా బాల్‌తో కొడుతుంటారు. వీళ్లను చూస్తుంటే(టిఆర్ఎస్ పార్టీ సభ్యుల నుద్దేశించి) నాకు అట్లాగే అనిపిస్తోంది. శాసన సభ కాబట్టి బ్రతికి పోతున్నాను (నవ్వుతూ). కాబట్టి అధ్యక్షా, కేవలం మూడున్నర లక్షల ఎకరాల సాగు మాత్రమే ఉన్న తెలంగాణ ప్రాంతంలో ఈరోజున దాదాపు 50 లక్షలకు పైగా ఎకరాల సాగు ఉంది. అధ్యక్షా, నేను కర్నూలులో చదువుకునేటప్పుడు నాకు మహబూబ్‌నగర్‌తో అనుబంధం ఉండేది. మహబూబ్‌నగర్ పక్క నుంచి వెళుతుంటే పచ్చగా పంటలు కనిపిస్తుంటాయి.

(టిఆర్ఎస్ పార్టీ సభ్యులచే అంతరాయం)

అధ్యక్షా, ఎవరైతే దొరల భావజాలానికి మద్దతుగా ఉంటారో, ఎవరైతే దొరలకు దాస్యం చేస్తారో వాళ్లు కొట్టుకోవలసిందే. దయచేసి వాళ్లను కొట్టుకోవద్దని చెబుతున్నాను. అభివృద్ధి గురించి మొన్న ఒకాయన మాట్లాడుతూ "ఇంత మంది ముఖ్యమంత్రులు వచ్చారు, ఏమీ చేయలేదు, ఏమన్నా చేయాల్సింది" అన్నారు. ఈ రాష్ట్రంలో ఎంతో గొప్ప ముఖ్యమంత్రులుగా పేరు పొందిన వాళ్లున్నారు. చెన్నారెడ్డి గారు, జలగం వెంగళరావు గారు, నర్సింహారావు గారు, అంజయ్య గారు వీళ్లంతా చాలా

గొప్పవాళ్లు, పెద్దవాళ్లు. ఇప్పుడు వీళ్లు అడుగుతున్న అన్ని డిమాండ్స్ ఆ కాలంలో చేసి ఉండవచ్చు గదా, ఎవరడ్డొచ్చారు.
మ.1.30

మీలాంటి చిన్న బుద్ధి లేదు కాబట్టి, పెద్దబుద్ధి కలవాళ్లు ఆ రోజున పెద్ద తరహాగా వ్యవహరించారు. మీ దగ్గరున్న బలమే సంకుచితత్వం కాబట్టి, ఆ నేరోనెస్సే మీ బలం కాబట్టి, దాన్ని పెంచి పోషించే ప్రయత్నమే తప్ప ఇంకొకటి కాదు. అధ్యక్షా, తెలుగు ప్రజల ఐక్యతకు, వైభవానికి, అభివృద్ధికి ఇది వ్యతిరేకం కాబట్టి నేను ఈ బిల్లుని వ్యతిరేకిస్తున్నాను.

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డిః అధ్యక్షా, ఒక్క నిమిషం..

MR.DEPUTY SPEAKER: Let him complete.

డా.ఎస్. శైలజానాథ్ః అధ్యక్షా, భాషాప్రయుక్త రాష్ట్రాలకు సంబంధించి ఇది చాలా పెద్ద నిర్ణయమని చెప్పాలి. బ్రిటీష్ వాళ్లు ఎక్కడి నుండో వచ్చి భారత ఉపఖండంలో అనేక రాజ్యాలుగా, సంస్థానాలుగా ఉన్న వాటన్నింటినీ ఏకం చేసి, సుమారు 500 పైచిలుకు సంస్థానాలను వదిలిపెట్టి.. అందులో అతిపెద్దది బహుశా హైదరాబాదు సంస్థానం అనుకుంటాను. అది వదిలిపెట్టి, మిగతా సంస్థానాలను ఏకం చేసిన తరువాత, స్వాతంత్రోద్యమ కాలంలోనే అంటే 1920 ల్లోనే భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలన్న ఒక సిద్ధాంతం కోసం ఆనాటి పెద్దలు మోతీలాల్ నెహ్రూ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఒక కమిటీని వేయడం జరిగింది. అటు తరువాత అనిశ్చితి. అంతకుముందే ఒరిస్సా ప్రాంతం బ్రిటీషు వారి పరిపాలనలోనే భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడింది. అది మన పరిపాలనలో కాదు. అటు తరువాత అనేక పోరాటాలు జరిగాయి. ఆ రోజున గాంధీ గారు ఏమన్నారంటే.. ఇవి ఆంధ్ర మహాసభలో గాంధీ గారన్న మాటలు....

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ప్లీజ్ కంక్లూడ్..

డా.ఎస్. శైలజానాథ్ః వన్ అవర్ అధ్యక్షా..

(అబ్బో - అంటూ సభలో నవ్వులు)

అధ్యక్షా, రాష్ట్రాల పునర్విభజన భాషల ప్రాతిపదికపైనే జరగాలనేదే ఆది నుంచీ నా లక్ష్యం అని అన్నారు. 1936 లో మద్రాసులో జరిగిన ఆంధ్ర మహాసభకి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు అధ్యక్షత వహించినప్పుడు వారికి పంపించిన విషయం. అట్లాగే, ఆ రోజున సమాజంలోనూ, దేశంలోనూ ఉన్న అభిప్రాయాల మేరకు సహజసిద్ధంగా ఉపజాతులు అంటే భారత జాతి అనుకుంటే మనం దాన్లో ఉప జాతులు అనుకుందాం. సహజ సిద్ధంగా ఉప జాతులు అభివృద్ధి చెందుతున్నవి. మీరు ఈ న్యాయమైన కోర్కెను అంగీకరించాలి అని అరవింద్ ఘోష్, 1940లో

అన్నారు. ఆ విధంగా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అభిప్రాయం భారత స్వాతంత్రోద్యమంతోబాటుగా పెరిగి, మన భావాలుగా మారిన తరువాత, పొట్టి శ్రీరాములు గారి త్యాగం తరువాత, ఫజల్ అలీ కమిటీని ఏర్పాటు చేసిన తరువాత, రాష్ట్రాల ఏర్పాటన్నది భాషా ప్రయుక్తంగా జరగాలని ఒక సిద్ధాంతం ఏర్పాటు చేసుకుని, ఒక చట్టం కాకపోయినా, ఒక చట్టం లాంటిదాన్ని ఏర్పాటు చేసుకుని భారత ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. కానీ, ఇక్కడేమిటి? చాలా మంది కన్వీనియెంట్‌గా 'మీ ప్రభుత్వమే కదా, మీరు మాట్లాడకూడదు' అనంటున్నారు. నేను శాసన సభ్యుణ్ణి, తెలుగువాణ్ణి, ఆంధ్రుణ్ణి, మంత్రిని కూడా..

అధ్యక్షా, మిగతా రాష్ట్రాలకూ, మనకూ ఉన్న వ్యత్యాసం ఏమిటి? అన్ని రాష్ట్రాలు ఒక విధంగా ఏర్పడతాయి. మనం మాత్రం ఇంకో విధంగా ఏర్పడాలా? ఏంటట ఇది? తెలుగువారిగా, ఆంధ్రులుగా మీకెవ్వరికీ బాధనిపించడం లేదా? ఏంటట ఇది? ఏదో జరుగుతుంది కాబట్టి జరగనివ్వండని అనుకుంటున్నారేమో గానీ, తెలుగువారిగా, ఆంధ్రులుగా మీకెవ్వరికీ బాధనిపించడం లేదా? అసలేంటిది? ఒక్కో రాష్ట్రానికి ఒక్కొక విధానమా? హైదరాబాదు రాష్ట్రంను కలుపుకుని ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డప్పుడు ఏం జరిగింది? రెండు రాష్ట్రాల అసెంబ్లీలు కూర్చుని మాట్లాడుకున్నాయి. మాట్లాడుకున్న తరువాతనే ఒక రాష్ట్రంగా ఏర్పడ్డాయి. అట్లాగే కేరళ వంటి రాష్ట్రాలు కూడా ఆరోజున కమిటీలు వేసుకుని మాట్లాడుకున్నాయి. ఉత్తరప్రదేశ్ నుండి విడిపడి మొన్న ఏర్పడ్డ ఉత్తరాఖండ్ గానీ, జార్ఖండ్ గానీ ఇవన్నీ కూడా ఎట్లా ఏర్పడ్డాయో మీకు తెలియందేమీ కాదు. ఎందుకు మరి? మనమంతా భారతీయులమే కదా? ఈ విషయంలో ఎవరికైనా ఇక్కడ అనుమానాలున్నాయా!

(మీకే అనుమానాలున్నాయి – అని కొందరు విపక్ష సభ్యులు అన్నారు )

ఇప్పుడు మనకేంటట అంటే మనం భారతీయులమే కదా. అధ్యక్షా, నాకు ఏదన్నా సభా సమావేశం ముగించేటప్పుడు జనగణమన పాడకపోతే చాలా కోపం వస్తుంది. మనం భారతీయులం కదా. ఖచ్చితంగా జాతీయగీతం నిలబడి పాడాలి. నాకున్నది గట్టి గొంతు అధ్యక్షా. స్వీట్ వాయిస్ కాదు. అయినా గట్టి గొంతుతో పాడి బయటకు వస్తాను. కాబట్టి అధ్యక్షా, అన్ని రాష్ట్రాలు ఈ విధంగా ఏర్పడతాయి. మద్రాసు నుండి మన రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రంగా విడిపడేటప్పుడు పార్లమెంటులో కమిటీ వేశారు, జెపిసి వేశారు, విభజన బిల్లు కూడా వచ్చింది. విభజనకు సంబంధించి థార్ కమీషన్, కాంగ్రెస్ పార్టీ కమిటీ, ముఖ్యమంత్రి కమిటీ అని కూడా వేశారు. విలీనంపైన ఫజల్ అలీ కమిటీ తీర్మానం ఉంది.

అలాగే కేరళ, మైసూరు, బొంబాయి, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, అస్సాం, బీహార్లు మొదటి ఎస్సార్సీ బిల్లులు, ఫజల్ అలీ కమీషన్ ప్రాతిపదికగా ఏర్పడగా, పంజాబ్, హర్యానా, చండీఘడ్‌ల విషయంలో అయితే సద్దాం హుకుం సింగ్ కమిటీ, జె.సి.షా కమిటీ నుండి మళ్లీ జెపిసికి వెళ్లింది. ఇక ఉత్తరాఖండ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ఏర్పాటు విషయంలో ఎటువంటి

వివాదాలు లేవు. అయినప్పటికీ కూడా ఆయా రాష్ట్ర శాసన సభల తీర్మానాలు ఆమోదం పొందిన తరువాత కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశాయి. దీంతో మనకేంటట అనంటే మనం కూడా భారతీయులమే కదా? భారత దేశంలో ఉన్న అన్ని విధి విధానాలు మనక్కూడా వర్తిస్తాయి కదా? వర్తించాలి కదా! మరి అవేమీ వర్తించకుండా టేబుల్ ఐటంగా వచ్చేస్తుందది (తెలంగాణా బిల్లు).

(ఈ సందర్భంలో 'మీ పార్టీనే కదయ్యా' అని తెలుగుదేశం పార్టీ సభ్యులు అన్నారు)

అధ్యక్షా, ఎట్లాగూ వీళ్లకు మాట్లాడటానికి చేత కాదు. వీళ్లు ముసుగు కప్పుకున్న తెలుగువాదులు. దయచేసి నన్ను పొలిటికల్‌గా తీసుకువెళ్లకండి. నేనెవరి గురించో మాట్లాడితే మీరెందుకు భుజాలు తడుంకుంటారు. పాత సంబంధాలేమన్నా ఉన్నాయా? కాబట్టి, భుజాలు తడుంకునే ప్రయత్నం వద్దు. కనుక అధ్యక్షా, ఈ బిల్లు ప్రజాస్వామ్యబద్ధమైన ప్రొసీజర్స్‌కి, ప్రాక్టీసెస్‌కి, పార్లమెంటుకు వ్యతిరేకంగా ఉంది కాబట్టి, నేను దీన్ని వ్యతిరేకిస్తున్నాను.

అధ్యక్షా, ఇది రాష్ట్ర విభజన లేదా ఐక్యత సమస్య కాదు. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న సంగతి అని నేనిక్కడ గుర్తు చేస్తున్నాను. ఏంటంట? అంటే చీల్చేస్తాం. బహుశా పెద్దలు లేరు. నా అనుమానం ఏమిటంటే – ఆంధ్రజాతి, తెలుగు మాట్లాడేవాళ్లు గట్టిగా ఫ్లరిష్ అయితేనే, ఏదో ఒక ముక్క కోసేస్తారు. ఎందుకో నాకు అర్థమయ్యి చావదు. ఆఖరికి విజ్ఞులందర్నీ కూడా ఆలోచించమని మీ ద్వారా కోరుతున్నాను. ప్రజలు కూడా ఆలోచిస్తున్నారు. ఈ రోజున మీరు కూడా ఆలోచించండి. అసలు తెలుగు మాట్లాడే వాళ్లతో ఒక రాష్ట్రం ఏర్పాటు కానియ్యకపోయేవాళ్లే. ఏదో చచ్చీ చెడి జరిగింది.

అధ్యక్షా, నేను ఇక్కడకి చదువుకోవడానికి వచ్చిన రోజున, నిమ్స్‌లో ఒక సంవత్సరం ఉన్న రోజున ఏముందిక్కడ? అందరూ కష్టపడ్డారు, శ్రమపడ్డారు. నేను మంచిర్యాలలో పని చేసినప్పుడు గానీ, కష్టపడ్డారు, పైకొచ్చారు. ఒక స్టేటస్ వచ్చింది, బలమొచ్చింది, ఒక గుర్తింపు వచ్చింది. అలాంటిది ఇప్పుడు చీల్చబడుతున్నాం. చీల్చబడటానికి ప్రతిపాదనలు ఎందుకొచ్చాయనేది ఆలోచించమని కోరుతున్నాను. ప్రజాస్వామ్య ప్రక్రియకు వ్యతిరేకంగా, దాన్ని అనుసరించకుండా అనేక మంది మిత్రులు మాట్లాడతారు. వారేమంటున్నారంటే – శాసన సభతో పనేం లేదు. ఏమన్నా చేసుకోండి. మీ దగ్గర్నుంచి నెట్టెయ్యండి. ఇది నెట్టేస్తే చాలు అంటారు. అలాంటప్పుడు మరెందుకయ్యా మీకు? ఈ బిల్లుపైన అవునో, కాదో ఓటింగ్ పెడదాం. మీకు భయమెందుకు? సహకరించండి, ఆహ్వానించండి. ఏ బిల్లైతే వచ్చిందో, దాన్ని ఈ శాసన సభకు వదిలిపెడదాం. మీరు అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఓటెయ్యండి. అందరూ ఓటేస్తారు. బహుశా మాట్లాడకుండా తప్పించుకుపోయిన వైసీపీ వాళ్లు కూడా ఆ రోజున ఓటింగ్‌కు వస్తారేమో! మీకు భయమెందుకు?

అధ్యక్షా, ప్రజాస్వామ్య భారతదేశంలో ఇది ఒక కొత్త ప్రశ్న. భారత పార్లమెంటు ముందు ఒక కొత్త సమస్య. భారత రాజ్యాంగం ముందు ఇంకొక సమస్య. కన్వీనియెంట్‌గా మార్చుకోవడానికి,

మాట్లాడడానికి నాలుక కాదు గదా రాజ్యాంగమంటే? రాజ్యాంగానికి అంతిమ ప్రభువులు సార్. We the people of India. రాజ్యాంగం యొక్క అంతిమ ప్రభువులు... బయట అడుగుతున్నారు. ఏ కారణాలరీత్యా, దేని కోసం ఈ రాష్ట్రాన్ని విభజిస్తున్నారని అడుగుతున్నారు. పెండేం వాసుదేవ్ గారు చెప్పినట్లు కొన్ని పదవుల కోసమా? కొన్ని ఉద్యోగాల కోసమా? మరి దేని కోసమో చెప్పండని ఈ రోజున ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాబట్టి, రాజ్యాంగ అధినేతలుగా ఇప్పుడు మాట్లాడాల్సిన బాధ్యత మనపైన ఉంది. అధ్యక్షా, ఈ బిల్లు తెలుగు వాళ్ల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసే విధంగా ఉంది కాబట్టే దీన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. గౌరవనీయులు, పెద్దలు, బహుశా మంత్రివర్గ కమిటీ సభ్యులుగా కూడా ఉన్నారనుకుంటాను. చిదంబరం గారు ఏం చెప్పారు?

మ.1.40

2009 డిసెంబర్ 9వ తారీకున "తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయు ప్రక్రియను మొదలు పెడతాం" తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడతాం అని ప్రకటించారు. అది అయిపోయింది. మళ్లా రాజ్యసభలో "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో అందరినీ సంప్రదించి హైదరాబాద్ స్టేటస్ సహా అన్ని విషయాలను పరిశీలించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటాం, అలాగే ఇంతకు ముందు అనుసరించిన సాంప్రదాయాలను రాజ్యాంగ నిబంధనలను అనుసరిస్తామని కూడా ప్రకటించారు.

(అంతరాయం)

ఇంత పెద్ద కమిటీని వేశారు. తెలుగువాళ్ల ఐక్యతకు వ్యతిరేకంగా జరిగే ఏ కార్యక్రమానికైనా నేను వ్యతిరేకిని.

(అంతరాయం)

ఆ కమిటీలో కూర్చున్న వారిలో ఒక్క తెలుగువాడు కూడా లేడు. తెలుగు వాడు ఒక్కడు కూడా లేకుండా.. ఎందుకంటే ఈ issue already biased sir. ఎందుకంటే ఇది ప్రాంతాల సమస్యగా మారినప్పుడు..

శ్రీ ఎ.రేవంత్‌రెడ్డి : ఆ కమిటీలో మెంబర్‌గా ఉన్న జైరామ్ రమేష్ గారిని ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపిక చేసి రాజ్యసభకు పంపించేటప్పుడు తెలియదా మీకు? (మైక్ లేకుండా)

డా.ఎస్ .శైలజానాథ్ : పెద్దల సభకు ఎన్నికైన అనుభవం నాకు లేదు. బహుశా జైరామ్ రమేష్ గారితో మీరు బాగా మాట్లాడినట్లున్నారు. ఎందుకంటే ఈ బిల్లు బయాస్డ్ బిల్లు. ఇది ఎవరిని సంతోష పెట్టడానికి చేస్తున్నారో...

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి : ప్రజలను సంతోష పెట్టడానికి. (మైక్ లేకుండా)

డా.ఎస్.శైలజానాథ్ : మిత్రమా మీకు ఇప్పుడు అర్థం కాదు. అర్థమైన రోజున సరిదిద్దుకుందామన్నా సాధ్యం కాదు. This is a biased Bill. ఉదాహరణకు ఆరు సూత్రాల పథకాన్ని ప్రవేశ పెట్టినప్పుడు, హైదరాబాద్ యొక్క అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని చెప్పారు. ఆ క్లాజు నేపథ్యంలో దాదాపు ఒక ఇరవై లేక చాలా, చెప్పడానికి వీలు లేనన్ని సెంట్రల్ ఇన్స్టిట్యూట్స్ అట్లాగే అనేక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మల్టీ నేషనల్ కంపెనీలు వచ్చాయి. ఇది క్యాపిటల్‌గా ఉన్నప్పుడు ఉమ్మడి ఆస్థి కదా అధ్యక్షా? ఎంత బయాస్డ్ కాకపోతే, వీళ్ల పర్మిషన్‌తో బాడుగకు తీసుకొని మీరు అసెంబ్లీ పెట్టుకోవచ్చు, వీలైతే మీకు రోడ్డు ఇస్తాం, రోడ్డు కూడా లేకపోతే ఏమి ఇవ్వము అని మాట్లాడితే...

(అంతరాయం)

నా దృష్టి ఎప్పుడు ప్రతిపక్షాల వైపునే ఉంటుంది అయినా అన్నయ్యకు కూడా చెబుతాను. కరెక్టే.. అన్నయ్యే కదా.. అందరు వచ్చి కష్టపడి ఇవన్నీ రకరకాలుగా ఏర్పాటు చేసుకున్న తర్వాత అన్నయ్యకు బహుశా కన్ను కుట్టింది. అన్నయ్యకు కన్నుకుట్టి తమ్ముళ్లను తోలేద్దాం అనుకుంటున్నాడు.

(అంతరాయం)

ఎందుకంటే తొలి ఆంధ్ర సామ్రాజ్యం ఈ భూమి మీదనే ఉంది. తొలి ఆంధ్రనగరి పోరుగల్లు ఓరుగల్లు మాది ఆంధ్రులది, తెలుగు వారిది ఇక్కడే ఉంది. మా రాణి రుద్రమ్మ దేవి మా తల్లి మా అక్క మా అమ్మ మా ఆడపడుచు, కాబట్టి మీరు అవసరం కోసం మాది ఆత్మ బంధం. మీది బహుశా ఏమిటో మీరే చూసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

(అంతరాయం)

హైదరాబాద్ స్టేటస్ గురించి మాట్లాడతాం, హైదరాబాద్ గురించి ఎడ్రస్ చేస్తామని చెప్పిన వాళ్లు, హైదరాబాద్‌ను ఒక ప్రాంతానికి ఇస్తాం అని రాస్తారా? బయాస్డ్ కాదా ఇది? 1956వ సంవత్సరం కంటే ముందున్న స్టేటస్ ఇస్తాం.. స్టేటస్ ఇస్తామని చెప్పిన వాళ్లు.

(అంతరాయం)

ఆ విషయాన్ని ఈరోజున టిఆర్ఎస్‌కి సంబంధించిన పెద్ద నాయకుడు టివిలో మాట్లాడుతూ " అవును ఒదులుకోవాల్సి వస్తుందేమో.. " అని మాట్లాడి ప్రజల అభిప్రాయం కదా అని.. భద్రాచలం ప్రాంతాన్ని.. ఏమిటి అధ్యక్షా? దీనిని బయాస్డ్ అనక ఏమనాలి? ఎవరో కూర్చొని మీ చేతిని పట్టుకొని రాయిస్తే రాసినట్లు.. ఆఖరికి అంత తెలివిలేనివాళ్లా? కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అక్షరాస్యత పెరిగింది అధ్యక్ష. బయాస్డ్ బిల్లు కాబట్టి ఇది ముసాయిదా బిల్లు. మీకు ఒక విషయం తెలిసినట్లు లేదు. చాలా మంది ఇది చాలా గొప్పది కేసు పెట్టండి. దీనిని ముట్టుకోకూడదు

కాలుతుంది. చట్టమైన అంశాలపై సామాన్య పౌరుడు కోర్టులో ఛాలెంజ్ చేస్తున్నాడు ఇది తప్పని. కోర్టు ఆపండి అని చెబితే ఆపుతున్నాం. కాబట్టి ఇండియాలో ప్రాథమిక హక్కులు ఉన్నాయి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ఎస్, చంద్రశేఖర్ రెడ్డి గారు..

శ్రీ రావుల చంద్రశేఖరరెడ్డి : అధ్యక్షా చర్చను ప్రారంభించిన ఈ మంత్రి గారిని గమనిస్తే, ఢిల్లీలో మాట్లాడాల్సిన మాటలను ఇక్కడ హైదరాబాద్‌లో మాట్లాడుతున్నారు. మా తెలంగాణాలో ఒక సామెత ఉంది. కంది చేనులో వెతకాల్సింది పప్పేటకలో వెతికినట్లు ఉంది. ఢిల్లీలో మాట్లాడండి. బొత్సా సత్యన్నారాయణ గారు చెప్పారు తెలుగు మాట్లాడే వారికి రెండు రాష్ట్రాలు ఉంటే తప్పేంటని. మీ పీసీసీ అధ్యక్షులు చెప్పారు. మీరు ఆత్మ విమర్శ చేసుకోండి. మీరు సమీక్ష చేసుకోండి. ఢిల్లీలో టేబుల్ ఐటెమ్ వచ్చిందని హైదరాబాద్‌లో ఈ అసెంబ్లీలో చెబితే ఎట్లా? మీరు సభను తప్పుత్రోవ పట్టించొద్దు. మంత్రులుగా ప్రవర్తించండి. You are a Minister in the Cabinet. మీ ఓన్ ప్రభుత్వం ఢిల్లీ నుండి బిల్లును పంపించింది. ఈ బిల్లును మీరే హైలెట్ చేసారు. మంత్రులుగా మీకు మాట్లాడే హక్కు లేదనేది నా భావన. శాసన సభ్యులు మాట్లాడితే నేను అర్థం చేసుకుంటాను. మంత్రులుగా ఉండి ప్రమాణం చేసిన వాళ్లు .. (మైక్ కట్ అయ్యింది.)

డా.సాకె.శైలజానాథ్ : అధ్యక్షా నేను ఏమి మాట్లాడుతున్నాను. ఒక తెలుగువాడిగా ఆంధ్రుడిగా నా ఆత్మాభిమానం దెబ్బతిన్నప్పుడు నేను నాలుగు మాటలు మాట్లాడితేనే తట్టుకోలేరా? నేనేమైనా సైకిల్ షాపుల గురించి టీవీ యాడ్‌ల గురించి మాట్లాడానా? నేనేమి మాట్లాడలేదే. మా పార్టీ గురించి మాట్లాడాను కాబట్టి..

(అంతరాయం)

నిజంగా చాలా మందికి చాలా విషయాలు తెలియవు సార్.

మ.1.50

అధ్యక్షా, ఏది ఎక్కడ మాట్లాడాలో, ఎప్పుడు మాట్లాడాలో భగవంతుని దయవల్ల, నాకు చదువు చెప్పిన గురువుల వల్ల, నేను పనిచేసిన సంస్థలవల్ల నాకు అవగాహన ఉన్నది.

(టి.డి.పి సభ్యులు శ్రీ ఎ.రేవంత్‌రెడ్డి నుంచి అంతరాయం)

ప్రతిపక్షాలకు నా విజ్ఞప్తి ఏమిటంటే దయచేసి ఆ అబ్బాయిని కాళ్లు కడుక్కొని సభకు రమ్మని చెప్పండి. ఎందుకంటే అతను ఏ సభకు వెడితే ఆ సభ అతలాకుతలమవుతున్నది. ఈ బిల్లు ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకంగా, బయాస్డ్‌గా వచ్చినందుకు నేను వ్యతిరేకిస్తున్నాను. అలాగే దాంట్లో ఒక సమాచారం చూశాను. వీలైతే ప్రతిఒక్కరూ అవకాశాలను పరిశీలించండి. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించినందుకు సంతోషం. అది వెంటనే

మేం నిర్మాణం చేయిస్తామనే మాట లేకుండా మిగతా వారితో మాట్లాడి నిర్మాణం చేపడతామని చెబుతున్నారు. కోసేటప్పుడు ఎటువంటి మినహాయింపు లేకుండా ఏకఖండం చేయడం, ఏదైనా విషయాన్ని చెప్పేటప్పుడు సంశయాత్మక వైఖరితో వ్యవహరించడం జరుగుతోంది. ఇది భారతదేశ ప్రజల ప్రజాస్వామ్య పోరాట స్ఫూర్తికి వ్యతిరేకంగా, బయాస్డ్‌గా ఉన్నది కాబట్టి నేను దీనిని వ్యతిరేకిస్తున్నాను. అంతెందుకు, ఆంధ్ర, తెలంగాణ ప్రజలు కలిసి ఉండటానికి కారణాలు చెప్పమని తెలంగాణ ప్రాంత నాయకులు కొంతమంది చాలాసార్లు అడిగారు. ఎందుకు కలిసి ఉండాలనే దానికి కారణాలు చెప్పాం. తెలంగాణ ప్రాంతానికి చెందిన సభ్యులు విడిపోవడానికి సంబంధించి చెప్పిన కారణాలేమిటంటే విపరీతమైన దోపిడీ జరిగిందన్నారు. దోపిడీ గురించి పెద్దలు ఎర్రబెల్లి దయాకర్‌రావు గారు అఖిలపక్షం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఒక మంచి మాట చెప్పారు. అది గుర్తుకొచ్చినప్పుడు చెబుతాను.

భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ విభజనకు పూనుకుంటున్నారో ఆంధ్రులుగా, తెలుగువాళ్లుగా మనందరం ఒకసారి ఆలోచించుకోవాలి. హైదరాబాద్‌ను కొల్లగొట్టాం, ఆ తర్వాత వ్యూస్ అంటే ఏమిటంటే ప్రభుత్వంలో కొనసాగడం తప్పులాంటి అనేకమైన మాటలు మాట్లాడారు. హైదరాబాదును కొల్లగొడితే, నాశనం చేస్తే ఈరోజున యాభై మైళ్ల విస్తీర్ణానికి పెరిగిందా అని నేను ప్రశ్నిస్తున్నాను. ప్రపంచ చిత్రపటంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతంగా ఎదిగిందా అని ప్రశ్నిస్తున్నాను. ఉదాహరణకు ఇరవై సంవత్సరాల క్రితం తెలంగాణ ప్రాంతంలో ఉన్న రహదారుల పరిస్థితి గురించి మీకందరికీ తెలుసు. ఈనాటి పరిస్థితి ఏమిటి? తారు రోడ్లు, మిగతా రోడ్లు మీకు కనిపించడం లేదా అని అడుగుతున్నాను. బహుశా మీ నాయకుడు పొగిడినట్లుగా నిజాం ప్రభువు కనిపించి ఉంటాడు. ఉస్మానియా యూనివర్సిటీ గురించి చాలా గొప్పగా చెప్పారు. నేను మాట్లాడితే మళ్లీ అన్నయ్య చేతులెత్తుతాడు కాబట్టి నేను ఆ విషయంలోకి వెళ్లను. గొప్పలు చెప్పొద్దు. ఏవైనా తప్పొప్పులుంటే మాట్లాడుకోవచ్చు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 5,500 ఆర్.టి.సి బస్సులు నడుస్తున్నాయి.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డిః(మైకు లేకుండా) ః దివాకర్ ట్రావెల్స్ గురించి చెప్పండి.

డా.సాకె.శైలజానాథ్ ఃవారు మీకు బాగా సన్నిహితులు కాబట్టి మీరే మాట్లాడుకోవచ్చు, ఇందులో ఇబ్బందేం లేదు. బహుశా బంధువు కూడా అవుతారేమో. బ్లాక్‌టాప్ వేసిన జాతీయ రహదారులు 1549. ఏ లెక్క ప్రకారం తీసుకున్నా ఏ రంగంలోనైనా సరే విద్య, వైద్యం, ఆరోగ్యం, పరిశ్రమలు, రోడ్లు చివరికి మీ జీవితంలో వచ్చిన అభివృద్ధికరమైన మార్పులతో సహా సమైక్య రాష్ట్రమే చేసిందనే సంగతి ఈ సందర్భంగా నేను గుర్తుచేస్తున్నాను.

ఆరుద్ర గారు నిజాం సామ్రాజ్యం గురించి, నిజాంల గురించి మాట్లాడుతూ ఒక మాట అన్నారు. చైన్స్‌లో మగవాళ్లు, చెరచబడ్డ ఆడవాళ్లు ఇది తెలంగాణ నిజాం పరిస్థితి అని

లిఖితపూర్వకంగా రాశారు. బాంచన్ కాళ్లు మొక్కుత అనే సంస్కృతి తెలంగాణలో ఉంది. తెలంగాణ ప్రాంతంలో 1970, 1980 సంవత్సరాలలో కూడా భూమి మొత్తం జమీందార్లు, జాగీర్దార్లు, పటేల్, పట్వారీల ఆధీనంలో ఉండేది. దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీలు, ఒక ధనికవర్గం లాంటి అధికార వర్గం వంగిన నడుముల............

శ్రీ ఆర్.దామోదర్‌రెడ్డి (మైకు లేకుండా) : అధ్యక్షా, ఒక నిమిషం అవకాశమివ్వండి.

MR.DY.SPEAKER: Yes, Damoder Reddy Garu.

శ్రీ ఆర్. దామోదర్‌రెడ్డి: అధ్యక్షా, మా సోదరుడు పదేపదే దొర అనే పదం వాడుతున్నాడు. పుట్టుక అనేది ఎవరి చేతుల్లోనూ ఉండదు. ఒకాయన రెడ్డి కులంలో పుట్టొచ్చు, ఒకాయన వైష్ణవ కులంలో పుట్టొచ్చు, ఇంకొకాయన బి.సి, ఎస్.సి లేదా ఎస్.టి కులంలో పుట్టొచ్చు. పుట్టిన తర్వాత సమాజంలో ఏ విధంగా ఉన్నదనేది చెప్పడం తప్ప ప్రతిసారి దొర, దేశ్‌ముఖ్ అనే పదాన్ని వాడటం మంచిది కాదు. నేను కూడా జమీందారీ కుటుంబంలోనే పుట్టాను. నన్ను కూడా దొర అని పిలుస్తారు. కానీ నేను దానికి పూర్తిగా వ్యతిరేకం. నేను సామాన్యుడిలో సామాన్యుడిగా ఉండబట్టే ముప్పై సంవత్సరాల నుంచి క్రియాశీల రాజకీయాలలో ఉన్నాను. ఒక దళితుడిని, వెనుకబడిన కులాలవారిని కూడా నా సోదరులుగానే భావిస్తాను. బహుశా మా పెద్దలు పెత్తందారీ వ్యవస్థను అమలుచేసి ఉండొచ్చు కానీ ఇప్పుడు ఆ పద్ధతి లేదు. కాబట్టి మా సోదురుడు దయచేసి ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

డా.ఎస్.శైలజానాథ్: అధ్యక్షా, నేను ఎవరినీ అవమానించడానికి మాట్లాడలేదు. కేవలం చరిత్ర గురించి మాత్రమే మాట్లాడాను. వ్యవస్థలో మంచివాళ్లు, చెడ్డవాళ్లు ఉంటారు. మంచివాళ్ల గురించి నేనేం మాట్లాడను. వారికి నా నమస్కారాలు. తెలంగాణ ప్రాంతంలో 1970లో కూడా జమీందార్లకు, పెత్తందార్లకు ఎవరైనా, ఎదురు మాట్లాడినా లేదంటే ఏదైనా పొరపాటు చేసినా, పనికి రాకపోయినా వారిని వంగబెట్టి పైన బండపెట్టేవారు. నిజాం పరిపాలన పోయిన తర్వాత కూడా ఆ వాసన, రంగు, రుచి ఇప్పటికీ అలాగే ఉన్నది. ఇప్పుడిప్పుడే పెత్తందారీతనం కొంచెం కొంచెం తగ్గడానికి కారణమేమింటే సమైక్య రాష్ట్రంలో విద్య, ఉద్యోగావకాశాలు పెరగడం, సామాజిక అంతరాలు తగ్గడం, కాంగ్రెస్ పార్టీ భూపరిమితి చట్టం తెచ్చి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచడమే ప్రధాన కారణం.

చాలామంది సభ్యులు తల్లి ఐలమ్మ గురించి మాట్లాడతారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం తప్ప రాయలసీమ ప్రాంతంలో పాలెగాళ్లు, తెలంగాణలో దొరలు, దేశ్‌ముఖ్‌ల కీర్తి పతాకాలను ఎత్తుకునేందుకు మాత్రం కాదు. అక్కడికీ, ఇక్కడికీ తేడా ఏమిటంటే సీమాంధ్రలోని బ్రిటిష్ సామ్రాజ్యంలో రాజకీయ అధికారం లేకపోయినా అప్పుడు కొన్ని మానవ హక్కులున్నాయి.

తెలంగాణ ప్రాంతంలో అవి కూడా లేవు. అందువల్ల దేనిని కూడా భుజాల మీద ఎత్తుకొని మొయ్యడానికి ఆంధ్రుడిగా నేను సిద్ధంగా లేను.

మ.2.00

ఆత్మలకు ముసుగేసుకునే కాలం వచ్చిందని గతంలో చేన్లలో మగవారు, చెరచబడ్డ ఆడవారు అని ఆరుద్ర గారు చెప్పిన విషయాన్ని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. సమైక్య రాష్ట్ర ఫలితంగానే బడుగులు, బలహీనులు, మాలలు, మాదిగలు, చేతి వృత్తుల వాళ్లు, గిరిజనులు గట్టిగా మాట్లాడటానికి, అన్యాయాన్ని అడగడానికి, నిటారుగా నిలబడటానికి శక్తి వచ్చింది. ఆ శక్తిని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం.

(ఆ సందర్భంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎ.రేవంత్ రెడ్డి మరియు శ్రీ ఇ.దయాకర్ రావు తమ స్థానాల్లో నిల్చొని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అంతరాయం కల్గించసాగారు)

MR.DEPUTY SPEAKER: Please sit down. Let him complete. Why do you want to disturb him? Please sit down. Please conclude Sailajanath Garu.

డా. ఎస్.శైలజానాథ్: అధ్యక్షా, కంచె ఐలయ్య గారు ఈ ప్రాంతంలో దళిత బహుజన మేధావిగా ఉన్నారు. ఆయన ఒక మాట అన్నారు. ఈ ప్రాంతంలో జరిగిన పోరాటాలన్నీ భూస్వామ్య వ్యతిరేక, ఫెడరల్ వ్యతిరేక పోరాటాలే కానీ చేసేదేమిలేదు ఆ పోరాట ఫలితాలను ఆ భూస్వామ్యులే అనుభవిస్తున్నారని, వారికే అవి చెందుతాయనే విషయాన్ని వారు బాధపడుతూ చెప్పడం జరిగింది. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసమేనా ఈ పోరాటం? ఆ వారసత్వం నుండి కాంగ్రెస్ పార్టీ మరియు తదనంతర పార్టీలన్నీ సమైక్య రాష్ట్రాన్ని పరిపాలించినప్పుడు విద్య కోసం, వైద్యం కోసం, కనెక్టివిటీ కోసం, ఎదుగుదల కోసం, ఉద్యోగావకాశాల కోసం తగినన్ని నిధుల్నీ, తగిన శ్రద్ధన్ని కేంద్రీకరించిన విషయాన్ని ఈరోజున తెలంగాణ ప్రాంతంలోని నా అన్నదమ్ముళ్లు, అక్క చెల్లెళ్లు గమనించమని మీ ద్వారా కోరుతున్నాను. అదే విధంగా బడుగు, బలహీన, హరిజన, గిరిజనల వర్గాల ప్రజానీకాన్ని కోరుతున్నాను. సమైక్య రాష్ట్రమే ఈ రోజున ఆయా వర్గాలు మాట్లాడేందుకు గొంతును, ధైర్యాన్ని, వెన్నెముకను, శక్తిని, కాళ్లల్లో బలాన్నిచ్చింది. దీన్ని వాడుకునే ప్రయత్నాన్ని కొన్ని పార్టీలు చేస్తున్నాయి. ఆ విషయాన్ని గమనించాలని నేను రాష్ట్ర ప్రజలను కోరుతున్నాను. అనేక మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడిని తొలి ముఖ్యమంత్రిని చేస్తామనే విధంగా ఒక నాయకుడు మాట్లాడుతున్నాడు. స్వాదీనం చేసుకున్న భూమిని దళితులకు, గిరిజనులకు పంచుతామనే మాటను ఆ నాయకుడు చెప్పడే? ప్రజలను మోసగిస్తూ, కేవలం రాజకీయ పదవుల కోసం మాట్లాడే మాటలు తప్ప అందులో నిజం లేదనే విషయాన్ని ప్రజానీకం గమనించాల్సిన అవసరముంది. ఒక పెద్ద మనిషి అరవై సంవత్సరాల క్రితం మాట్లాడిన మాటలు వాస్తవం. ఆ విషయాలనే నేను ప్రస్తావించే ప్రయత్నం

చేస్తున్నాను. ఈ రోజున ముసుగులు తొలుగుతున్నాయి. పార్టీల ముసుగులు బయటపడుతున్నాయి. కేవలం అధికారం కోసమే, కొన్ని వర్గాల ఆధిపత్యం కోసమే జరుగుతున్న ప్రయత్నాలకు దయచేసి బలికావొద్దని నేను ప్రజానీకానికి విన్నవిస్తున్నాను. 1972వ సంవత్సరంలో రాష్ట్రంలో "జై ఆంధ్ర" ఉద్యమం వచ్చినప్పుడు నిజంగా చిత్తశుద్ధి ఉండే ఈ నాయకులు అప్పుడే ంచేసినారని నేను అడుగుతున్నాను. ఆనాడు ఈ రాష్ట్రం అట్టుడికిపోయినప్పుడు, వంద రోజుల పాటు ప్రజలు రోడ్లపైన పడినప్పుడు వీరికెవ్వరికీ తెలంగాణ గుర్తుకురాలేదా? ఈ నాయకులు ఆనాడే కోరొచ్చు కదా? కేవలం రాజకీయాల కోసం, రాజకీయ పదవుల కోసం కొందరు సాగించే పోరాటానికి పవిత్రమైన ముసుగులు దరించే ప్రయత్నం తప్ప మరొకటి కాదనే విషయాన్ని గ్రహించమని నేను రాష్ట్ర ప్రజానీకాన్ని కోరుతున్నాను. పడిన కష్టం గురించి అవ్వను, తాతను, వంగిన భుజాలనడిగినా చెబుతుంది. కానీ రాజకీయ పార్టీలు పిల్లల్ని, విద్యార్థులను, నిరుద్యోగ యువతను అన్ని రకాల వాగ్దానాలతో మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటున్నాయి. భారత దేశంలో అది ఎప్పటికీ సాధ్యపడదు.

అధ్యక్షా, అంటే వీళ్లు భారత రాజ్యాంగాన్ని గౌరవించేవాళ్లా? భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వాళ్లా? సార్వభౌమత్వాన్ని ప్రశ్నించేవాళ్లా? తంతాం, తరిమేస్తాం, రక్తం ప్రవహిస్తుందనే విధంగా ఒక పెద్ద మనిషి మాట్లాడుతాడు. హైదరాబాద్‌లో రక్తం ప్రవహిస్తుందని ఒక పెద్ద మనిషి మాట్లాడారు. అంటే మాటలు ఎక్కడికిపోతాయి? నేను చెప్పేదేమిటంటే అన్నింటినీ గమనించమని రాష్ట్ర ప్రజానీకాన్ని కోరుతున్నాను. గతంలో ఏవైతే ఫెడరల్ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు జరిగాయో ఆ భావజాలం యొక్క ఫలితాలనే ఈరోజున మరొకసారి భూస్వామ్య, ఫెడరల్ వర్గాలు వారి స్వప్రయోజనాలకే ఉపయోగించుకోబోతున్నాయని కంచె ఐలయ్య గారు చెప్పిన విషయాన్ని గుర్తించమని, జాగ్రత్తపడమని అన్ని ప్రాంతాల్లోని నా అన్నదమ్ముల్ని, అక్కచెల్లెళ్లని కోరుతున్నాను.

(ఆ సందర్భంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎ.రేవంత్ రెడ్డి మరియు శ్రీ ఇ.దయాకర్ రావు తమ స్థానాల్లో నిల్చొని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అంతరాయం కల్గించసాగారు)

MR.DEPUTY SPEAKER: Please conclude Dr.Sailajanath Garu.

డా. ఎస్.శైలజానాథ్: అధ్యక్షా, దోపిడి జరిగింది, దోపిడి, దోపిడి అని పదే పదే కొంత మంది మోసపూరితంగా మాట్లాడుతున్నారు. అసలు దోపిడి ఎక్కడ జరిగింది. నేను ముఖ్యమంత్రి గారిని సభాముఖంగా కోరుతున్నాను. ఏమిటంటే, హైదరాబాద్ నుంచి ఎవరైనా ఆంధ్రులు ఇక్కడి భూమిని అమ్ముకునో, భూములను తరలించుకుని పోయి మిగితా ప్రాంతాల్లో పెట్టుబడిగా పెట్టి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేశారా? గుండెనొప్పి వస్తే వైద్యం చేయించుకునేందుకు ఆసుపత్రి, కాలు విరిగితే వైద్యం చేయించుకునేందుకు వైద్య సదుపాయం సీమాంధ్ర ప్రాంతంలో ఇప్పటికీ లేదు.

(అంతరాయం)

నేను గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. ఈ మధ్య కాలంలో ఎవరు తెలంగాణ ప్రాంతపు భూముల్ని కొల్లగొట్టారో కూడా లెక్కలు తీయమని నేను ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. రాజమండ్రిలో, విజయవాడలో, విశాఖపట్టణంలో ఎవరు భూములు కొన్నారో లెక్కలు తీస్తే అన్ని విషయాలు బయటపడతాయి. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదేశిస్తే అధికారులు సమాచారాన్ని చెబుతారు. తద్వారా ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. ఈరోజున అన్ని పార్టీలు మోసపూరితమైన మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మాయ మాటలు చెప్పే ఆయా పార్టీల వ్యవహారాన్ని గమనించమని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను.

(ఆ సందర్భంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎ.రేవంత్ రెడ్డి మరియు శ్రీ ఇ.దయాకర్ రావు తమ స్థానాల్లో నిల్చొని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అంతరాయం కల్గించసాగారు)

MR.DEPUTY SPEAKER: Please sit down Dr.Sailajanath garu. రేవంత్ రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ ఎ.రేవంత్ రెడ్డి (కొడంగల్): స్పీకర్ సార్, రాష్ట్రం సమైక్యంగా ఉండాలనేదే మంత్రి గారి భావనైతే, వారి భావనను, అభిప్రాయాన్ని సభకు స్వేచ్ఛగా చెప్పుకోవచ్చు. అందులో మాకేమి అభ్యంతరం లేదు. అది ఆయన భావన, ఆయన భ్రమ చెప్పుకోవడంలో ఎటువంటి తప్పు లేదు. కానీ సమైక్యవాద ముసుగులో తెలంగాణ ప్రాంతాన్ని, తెలంగాణ ప్రజానికాన్ని అవమానించే విధంగా మాట్లాడటం వల్ల ఎటువంటి ప్రయోజనం కల్గదు. కేంద్ర ప్రభుత్వం, భారత రాష్ట్రపతి గారు పంపించిన ముసాయిదా బిల్లుపైన అభిప్రాయాన్ని చెప్పమంటే మంత్రి గారు తన అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వం పైన రుద్దడానికి చేసే ప్రయత్నం ఏదైతే ఉందో అది సమంజసంగా లేదు. మంత్రి గారు సమైక్య రాష్ట్రంలో అభివృద్ధి గురించి ప్రస్తావిస్తున్నారు. ఈ సమైక్య రాష్ట్రంలో సత్యం రామలింగరాజు, వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, గాలి జనార్థన్ రెడ్డి, కోల కృష్ణమోహన్, కృషి వెంకటేశ్వరరావు వంటి వారి గురించి ఇలా చెప్పుకుంటూపోతే వంద పేర్లు చెప్పుకోవచ్చు. లక్షల కోట్ల రూపాయల దోపిడికి పాల్పడింది సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వాళ్లే గానీ తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏ ఒక్కరు కూడా ఇటువంటి స్కాముల్లో లేరు. అంటే ఏ సమైక్య రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందనే విషయాన్ని మంత్రి గారు చెబుతున్నారో ఆ సమైక్య రాష్ట్రంలో దోపిడికి పాల్పడ్డ, అవినీతికి పాల్పడ ప్రతి ఒక్కరూ సీమాంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణ ప్రాంతానికి వచ్చినవాడే. అదే విధంగా మంత్రి గారు తెలంగాణ ప్రాంతంలో పెట్టిన పెట్టుబడుల గురించి చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ నందు సామాన్య తెలంగాణ ప్రాంత రైతుల వద్ద కొల్లగొట్టిన 5,500 ఎకరాల భూమిలో జి.ఎం.ఆర్. సంస్థ విమానాశ్రయాన్ని నిర్మిస్తే, అందులో నాలుగు రేకుల షెడ్డులను వేసి తద్వారా వేల కోట్ల రూపాయల విలువచేసే ఆస్తులను కొల్లగొట్టింది అదే సంస్థ కాదా

అని నేను మంత్రి గారిని అడుగుతున్నాను. అదే విధంగా జి.వి.కె., జి.వి.కె.1లకు సంబంధించి ఎవరైతే పెట్టుబడులు పెట్టారో, అభివృద్ధి పేరుతో వారు పెట్టిన పెట్టుబడి ద్వారా లక్షల కోట్ల రూపాయలను సంపాదించుకున్నారు తప్ప తెలంగాణ ప్రజలకు అందులో డిస్కౌంట్ లేదు. కాబట్టి తెలంగాణ ప్రాంతంలో నిజాం కాలం నుంచి సంక్రమించిన వేల ఎకరాల భూమిని, ఆస్తులను అమ్మి సీమాంధ్రప్రాంతంలో ఖర్చు పెట్టారు తప్ప తెలంగాణ ప్రాంతంలో అభివృద్ధి కొరకు ఖర్చు చేయలేదు. చివరకు ఒక మాట చెప్పదలచుకున్నాను. లక్షల ఎకరాల భూమిని రంగారెడ్డి జిల్లాలో అమ్ముకున్న ఈ సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక్కటి కూడా 2009వ సంవత్సరం వరకు లేదంటే, ఈ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎంత నిర్లక్ష్యానికి గురికాబడిందో ఒకసారి రంగారెడ్డి జిల్లా రికార్డులను తిరగేస్తే తెలుస్తుంది. 2008వ సంవత్సరంలో మేం కౌన్సిల్‌లో గౌరవ ముఖ్యమంత్రి గారిని నిలదీస్తే మొట్ట మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు కాబడింది.

మ. **2.10**

మేము 2008వ సంవత్సరంలో కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి గారిని నిలదీయగా మొట్టమొదటి సారిగా రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది అధ్యక్షా, ఆ సంగతి వారికి తెలియదా అధ్యక్షా! ఇంతగా పెత్తందార్లు, పెట్టుబడిదార్ల గురించి మాట్లాడుతున్నారు. వారి స్వంత జిల్లా అయిన అనంతపురం జిల్లాలో కౌకుంట్ల దొరలపై నక్సలైట్స్ దాడి చేసేందుకు, ముందుగా వారిపై పోస్టర్స్ ఎందుకు వేశారు అధ్యక్షా? వారు ఇంతగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి మాట్లాడుతున్నారు, ఎప్పుడైనా వారు పులివెందులకు వెళ్లి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల గురించి మాట్లాడారా? అధ్యక్షా, పులివెందులలో, తాడిపత్రిలో ఏమి జరుగుతోంది లేదా రాయలసీమ జిల్లాలలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం అసలు ఉన్నదా? మంత్రిగారిని చెప్పమనండి.

MR.DEPUTY SPEAKER : Please conclude

శ్రీ ఎ.రేవంత్‌రెడ్డి : వారికి సమైక్య భావన చెప్పుకోడానికి స్వేచ్ఛ ఉంది కానీ, తెలంగాణ ప్రాంత ప్రజల్ని అవమానించే విధంగా సభలో మాట్లాడటం సమంజసం కాదు అని మీ ద్వారా వారికి తెలియ జేసుకుంటున్నాను.

శ్రీ కె. తారక రామారావు : మంత్రిగారు చాలా విషయాలు చెప్పారు, వాటిపై సవివరంగా, కచ్చితంగా రేపు స్పందిస్తాను అధ్యక్షా, ఈ విషయాన్ని తమ ద్వారా మంత్రిగారికి తెలియజేయ దలచుకున్నాను. వారు మాట్లాడుతున్న ఈ మాటల వల్లే సమైక్య రాష్ట్రంగా వారితో కలిసి ఉండడానికి ఇబ్బంది కలుగుతోంది అధ్యక్షా. ఎందుకంటే మేము వచ్చాము, మేము ఉద్దరించాము, మేము సంస్కరించాము, మేము రాకమునుపు మీరు అనాగరికులు, అనాగరికతలో ఉన్న మిమ్మల్ని ఉద్ధరించడానికే మేము ఇక్కడికి వచ్చాము అన్న రీతిలో మంత్రిగారు ఏవైతే మాట్లాడుతున్నారో,

సోదర సభ్యులు రేవంత్ రెడ్డి గారు వ్యక్త పరచిన అభిప్రాయంతో ఏకీభవిస్తూ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. కలిసి ఉండాలనే వారు ఈ పద్ధతిలో మాట్లాడటం శోచనీయం అధ్యక్షా, దయచేసి వారు ఇకనైనా సంయమనంతో వ్యవహరించి గౌరవ మంత్రిగా మాట్లాడితే మంచిది. చివరగా ఒక మాట, ఈ రోజు వారు అడిగిన ప్రతి ప్రశ్న కూడా, అడగాల్సింది ఢిల్లీలో వారి అధిష్టానాన్ని, ముఖ్యమంత్రిగారు ఢిల్లీ వెళ్లారు, వారు, వారి అధిష్టానంతో చర్చోపచర్చల్లో పాల్గొన్నారు, ముఖ్యమంత్రిగారు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వీరి వాదనలు విన్నారు. వీరు ఇప్పుడు చెప్పిన ప్రతి మాట అక్కడ చెప్పారు. అన్నీ విన్న తరువాతనే కదా నిర్ణయం జరిగింది. అన్నీ జరిగిన తరువాత ఇప్పుడు కేవలం సీమాంధ్రలో జరుగుతోన్న చాంపియన్స్ ట్రోఫీలో ఆధిపత్యపోరులో భాగంగా, మూడు నెలల్లో జరగబోతున్న ఎన్నికల్లో వచ్చే నాలుగు ఓట్లు కోసం మాట్లాడుతున్నారు తప్ప, ప్రజల కోసం కాదు అధ్యక్షా, రేపు సవివరంగా అన్నీ చెబుతాను.

MR.DEPUTY SPEAKER : Sailajanath Garu, please conclude.

డా.ఎస్.శైలజానాథ్ : రేవంత్ రెడ్డి గారు ఎందుకు ఇంతగా బాధ పడ్డారో నాకు అర్థం కాలేదు సార్. Harsh comments have been made by Sri Revant Reddy. ఎవరి భాష గురించి మనం ముందు మాట్లాడుకున్నామో.. అధ్యక్షా ఏ గూటి చిలుక ఆ గూటి పలుకు పలుకుతుంది అధ్యక్షా.

MR.DEPUTY SPEAKER : please conclude.

డా.ఎస్.శైలజానాథ్ : అనంతపురం జిల్లా, పులివెందుల, ఆ తరువాత అనేక.. నేను అనంతపురం జిల్లా పెత్తందారి విధానానికి వ్యతిరేకం, పులివెందుల్లో పెత్తందారి విధానానికి వ్యతిరేకం, ఒక వేళ మా ఇంట్లో పెత్తందారీ విధానం ఉంటే దానికి వ్యతిరేకం, మీ ఇంట్లో ఉంటే కూడా నేను వ్యతిరేకం. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో... ఆ రూపులు.. అరుపు ...

(అంతరాయం )

MR. DEPUTY SPEAKER : Please address the Chair.

డా.ఎస్.శైలజానాథ్ : తెలంగాణ లోని నా అమ్మలు, నా అవ్వలు, మా నాన్నలు, ఆ రోజున పాలక వర్గాలుగా ఉన్న వారి చేతుల్లో 70/80 దశకాల వరకు ఎన్ని బాధలు పడ్డారో చర్చించబడుతున్నందుకు ఎవరికి వారు భుజాలు తడుముకొని తాము చాలా పవిత్రులమని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నందుకు నిజంగా నాకు సంతోషంగా ఉంది. I have achieved my target. ఈ రోజున తెలంగాణలో కానీ ఆంధ్ర ప్రాంతంలో కానీ దళితులకు, బలహీన వర్గాలకు, మైనారిటీలకు, అంతవరకు శక్తి లేని వారికి శక్తినిచ్చింది, ధైర్యానిచ్చి, అవకాశాన్నిచ్చింది, ఆంధ్రుల ఐక్యత తప్ప ఇంకొకటి కానేకాదనే విషయాన్ని గుర్తుంచుకోండి, రాసుకోండి..

(అంతరాయం )

బంగారు అక్షరాలతో, అంటే చెరిగిపోని అక్షరాలతో రాసుకోమని కోరుకుంటూ.. అధ్యక్షా బిల్లుపైన మాట్లాడమన్నారు, అదే కదా ! అధ్యక్షా నేను మాట్లాడుతోంది... అధ్యక్షా ఈ రోజున ఏ బిల్లు అయితే రాష్ట్ర శాసనసభకు, శాసన మండలికి వచ్చిందో, రాయలసీమ సభ్యునిగా నాకు మరింత బాధ్యత ఉంది. ఎందుకంటే తెలుగు వారి ఐక్యత కోసం త్యాగం చేసిన వారు ఎవరైనా ఉంటే అది రాయలసీమ వారే. తెలుగు వారి ఐక్యత వేల సంవత్సరాల ఆకాంక్ష, వారి వైభవం కోసం త్యాగం చేసిన వారు రాయలసీమ వారు అధ్యక్షా...

(అంతరాయం )

ఒకాయన ఇస్తాం, ఇస్తాం తీసుకోండి అంటున్నారు ఇవన్నీ అహంకార పూరితం అధ్యక్షా.. ఒకాయన దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తా, ఈ ప్రజాస్వామ్య భారతదేశంలో.. నేను చేస్తా... Nonsense.. ... రాయలసీమలో శ్రీ బాగ్ ఒడంబడిక జరిగింది. చాలా గొప్పవారు, లబ్ధప్రతిష్టులు, ప్రాతఃకాల స్మరణీయులు వీరంతా కలసి 1937వ సంవత్సరంలో మద్రాసులోని శ్రీబాగ్ అనే ఇంటిలో కూర్చొని ఒడంబడిక చేసుకున్నారు. అనంతపురంలో మాకు ఒక యూనివర్శిటీ ఇస్తామని చెప్పారు. అలాగే కోస్తా ఆంధ్రా జిల్లాలతో సమానంగా నీటి వనరులు ఏర్పాటు చేయడానికి రాయలసీమ, నెల్లూరు జిల్లాలలో వ్యవసాయ అభివృద్ధికి 10 సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ సంవత్సరాల పాటు నీటి వనరుల సదుపాయం కల్పించాలని రాసుకున్నారు. అట్లాగే ఎం.ఎల్.ఏ సీట్లు అన్ని జిల్లాలకు సమానంగా ఉండాలని రాసుకున్నారు. హైకోర్టు ఒక చోట, రాజధాని ఒక చోట ఉండాని రాసుకున్నారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న పెద్దవాళ్లు ఉదయాన్నే ప్రార్థించుకోతగినంత పెద్దవారు ప్రతి ఒక్కరూ కూడా ఒకడుగు ముందుకేసి, విశాలాంధ్ర కోసం ఆరోజు ప్రయత్నం చేసిన కమ్యునిస్ట్ మిత్రులను కూడా నేను సాదరంగా గుర్తు చేసుకుంటున్నాను. ఉద్యమాలు మొదలై... రాయలసీమ ప్రాంతమైన కర్నూలు, అనంతపురం జిల్లాలు వ్యతిరేకించాయి. అనంతపురంలో ఉన్న పిళ్లై గారు కూడా వ్యతిరేకించినట్లు నాకు గుర్తు అయినప్పటికి కూడా తెలుగు వారి ఐక్యత భాషా ప్రయుక్త రాష్ట్రం అంటే రాజధానిని కూడా వదులుకున్నారు. రాజధానిని రాత్రికి రాత్రే ఎందుకంటే ఆరోజు ఉన్న పెద్దలు, హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారి నాయకత్వంలో ఉన్న ఆ ప్రభుత్వం, ఆ శాసనసభ హైదరాబాద్ రాజధానిగా చేయకపోతే మేము కలవము అన్న కారణ ంతో రాజధానిని త్యాగం చేశాం....

(అంతరాయం )

ముసుగేసుకొని, కళ్లకు అద్దాలు పెట్టుకొని చూస్తే వాస్తవాలు కనిపించవు. అటు తరువాత బళ్లారి రాయలసీమ ప్రాంతానికి ప్రాణం అధ్యక్షా. మేము తుంగభద్ర డ్యామ్‌ను పోగొట్టుకున్నాం అధ్యక్షా, 28 టిఎంసీల ను తెచ్చుకోవడం కోసం ఒకటికి పది సార్లు స్వంత రాష్ట్రంలో భంగపోవాలి, వేరే రాష్ట్రంలో భంగపోవాలి, వేరే జిల్లాతో భంగపావాలి, వీలైతే తాలుకాలతో కూడా భంగపోవాలి. ఒక సాంస్కృతిక అధికార కేంద్రంగా ఉన్న బళ్లారి సీడెడ్ జిల్లాల్లో. ఐక్యత కోసం, కేవలం ఐక్యత కోసం..

ఈ రోజు రాయలసీమ సభ్యునిగా ఇరుప్రాంతాల వారిని నిలదీసే అధికారం కలిగి ఉన్నాం. ఈ రాష్ట్ర ఐక్యత కోసం త్యాగం చేసిన వారిగా మిగిలి పోయాం. తెలుగువారి ఐక్యత కోసం, అభివృద్ధి కోసం ఇరుప్రాంతాల్లో ఉన్న నాయకుల్ని, ప్రజల్ని, అన్నదమ్ముల్ని, అక్క చెల్లెళ్లను అధికార యుతంగా అడిగే హక్కు, త్యాగ చరిత్ర కలిగిన రాయలసీమ వారిగా మేము కలిగి ఉన్నాం. ఈ రాష్ట్రం విడిపోకుండా కలిసి ఉండడానికి కావల్సిన అన్ని ప్రయత్నాలు చేయండి. ఏ యే ప్రయత్నాలైతే రాష్ట్రం కలిసి ఉండేందుకు ఉపయోగ పడతాయో ఆ ప్రయత్నాలు చేయండి. ప్రస్తుతం బిల్లు మాత్రమే వచ్చింది. తాత్కాలికమైన రాజకీయాల కోసం ప్రాకులాడవద్దు. ఎవరికోసం, దేనికోసం ఈ రాష్ట్రాన్ని విభజించాల్సిందిగా కోరుకుంటున్నారో మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి.

మ.2.20

ఎమ్మెల్యే సీట్ల కోసమో, అధికారం కోసమో కాదని ప్రజల కోసమని గుర్తించుకోండి. త్యాగం చేసిన వాళ్లుగా, రాజధాని కోల్పోయిన వాళ్లుగా మాకు అడిగే హక్కు, అధికారం ఉంది, ఈ రాష్ట్రాన్ని ఐక్యతగా ఉంచే బాధ్యత కూడా మాపై ఉంది కాబట్టి ఈ పోరాటంలో రాయలసీమ వాళ్లం ముందున్నాం.

(ఈ దశలో కొంత మంది సభ్యులు '' జై రాయలసీమ '' అని నినదించారు)

కనుక ఏది ఏమైనా అందరం కలిసుండాలని కోరుకుంటున్నాం, ప్రస్తుతం విషయానికి వస్తే ఒక అబద్ధాన్ని నిజం చేసే ప్రయత్నం, ఒక సత్యదూరమైన విషయాన్ని .....

(ఈ దశలో తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చేసిన కామెంటుకు స్పందిస్తూ, సార్ ఏమి చేస్తాం సార్, ఇది యాసల కాలం భాషల కాలం అని సమాధానమిచ్చారు.)

ఒక సత్యదూరమైన విషయాన్ని, లేని విషయాలని, ఆర్థిక అసమానతలు పెరిగే కాలంలో...

(ఈ దశలో తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సోనియమ్మ గురించి చెప్పిన మాటలను చెప్పమనండి అని అన్నారు.)

ప్రపంచ వ్యాప్తంగా రెండు విషయాలు ప్రస్తుతం పరస్పరం పోటీ పడుతున్నాయి, గతంలో మనమంతా చదువుకునే వాళ్లంగా ఉన్న రోజుల్లో సమాజం అభివృద్ధి చెందితే, మనం కూడా అభివృద్ధి చెందుతామనే సిద్ధాంతం ఉంది. కానీ ఈ రోజున వ్యక్తి అభివృద్ధి తద్వారా సమాజం బాగుపడుతుందనే సిద్ధాంతం ఉంది.

MR.DEPUTY SPEAKER : Please conclude.

డా. ఎస్. శైలజానాథ్ : ఈ ఆర్థిక అసమాతలు, సామాజిక గతినే ఆర్థిక విషయాలు శాసించే కాలంలో అవకాశాలు తక్కువైనప్పుడు, మేథోపరమైన అంశాలు మధ్యలోకి వచ్చినప్పుడు, అసమానతలు పెరగడం, ఆ అసమానతలు అసంతృప్తికి గురిచేయడం సహజం అధ్యక్షా. ఆ అసమానతలు అసంతృప్తికి గురిచేసే సమస్య మూలాల్లోకి పోకుండా బయటికి కనిపించే విషయాలను చూపించి. ఉదాహరణకి న్యాయవ్యవస్థలోని ఉద్యోగాల గురించి ఎంత బహిరంగంగా చెప్పారు? ఉద్యోగాల నియామకానికి ఒక పద్ధతి ఉంది, పరీక్షలు రాస్తారు, ఇంటర్వ్యూ చేసిన తరువాత 10 మందిలో ఇద్దరు, ముగ్గురు ఎంపిక అవుతారు. ఇవేమైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లా లాబీయింగ్ చేయడానికి? ఉద్యోగాలివి ఈ విషయంలో కూడా అబద్ధం మాట్లాడుతున్నారు.

(ఈ దశలో తెలంగాణా రాష్ట్ర సమితి శాసన సభ పక్ష నాయకులు శ్రీ ఈటెల రాజేందర్ అభ్యంతరం తెలుపుతూ మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని డెప్యూటి స్పీకరు గారిని కోరారు, మరికొంత మంది టీఆర్ఎస్ సభ్యులు కూడా అభ్యంతరం తెలిపారు.)

నీళ్ల విషయంలో ఈ రాష్ట్రం సమైక్యంగా ఏర్పడక ముందు కృష్ణా బ్యారేజీ, గోదావరి జలాలకు అడుకట్ట వేసి అప్పటికే కాలువల ద్వారా లక్షల ఎకరాలు సాగులో ఉంది. ఈ రోజు ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నారంటే ఇవాళ మోడ్రన్ టెక్నాలజీలో ఎత్తిపోతల పథకాలు వచ్చాయి కానీ, భౌగోళికంగా అవకాశం లేకపోతే సర్. ఆర్థర్ కాటన్ గారు పెట్టిన భిక్షని ఆంధ్రులుగా గర్వించాల్సిందిపోయి, ప్రజలను మోసం చేసే విధంగా మాటలు చెప్పి గోదావరి జలాలు 500 అడుగులు ఉంటే సమైక్య రాష్ట్రంలో అభివృద్ధి ద్వారా, నిధుల ద్వారా, టెక్నాలజీ ద్వారా వాటిని పైకి తోడే ప్రయత్నం చేస్తున్నారు. అధ్యక్షా దాన్ని కూడా తప్పుగా ప్రచారం చేస్తూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణాలోని మాగాణిలను ఎవరు ఎవరి చేతిలో పెట్టుకున్నారు? తెలంగాణాలోని మాగాణిలను ఎవరికైనా పంచారా? ఒకవేళ 10 ఎకరాలకుఎక్కువో తక్కువో అమ్ముడుపోయి ఉంటుంది కానీ...

(ఈ దశలో తెలంగాణా రాష్ట్ర సమిటి శాసన సభ పక్ష నాయకులు శ్రీ ఈటెల రాజేందర్ ఏమి మాట్లాడుతున్నారు అధ్యక్షా వీరు అని అభ్యంతరం తెలిపారు.)

అసత్య ప్రచారాలు, సత్యదూరమైన ప్రచారాలు, యువకుల్లో ఆవేశాల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు.

MR. DEPUTY SPEAKER : Please try to conclude.

డా. ఎస్. శైలజానాథ్ : అధ్యక్షా, ఇంత మాట్లాడుతున్నారు, వీళ్లా దళిత, బలహీన జనుల గురించి మాట్లాడేది?

MR.DEPUTY SPEAKER : Please conclude Sailajanath garu.

డా. ఎస్. శైలజానాథ్ : ఒక్క దళిత నాయకుడేడి అధ్యక్షా, ఎప్పుడైనా నన్ను తిట్టడానికో, ఇంకొక దళిత నాయకుణ్ణి ఖండించడానికో తెచ్చి పెట్టే ప్రయత్నమే కానీ ఇది దళిత భవిష్యత్తు నాయకత్వమా?

(ఈ దశలో కొంత మంది తెలంగాణా రాష్ట్ర సమితి నాయకులు అభ్యంతరం తెలిపారు.)

టీఆర్ఎస్ అధినాయకులు అట్లాగే అన్నగారు ఇద్దరూ 11-5-2010లో విలేఖరుల ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, "విద్యార్థులు యాడికెళ్లి వచ్చిండ్రు, 90 రోజుల పాటు వేలమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినం, కొన్ని లక్షలు భరించి భోజనాలు, ప్రయాణ ఖర్చులు పెట్టినం, ఇవన్నీ ఐతేనే విద్యార్థులు కొట్లాడిండ్రు, విద్యార్థులు ఆకాశం నుండి రాలే" ఇవి టీఆర్ఎస్ నాయకుల మాటలు అధ్యక్షా, కుట్రపూరితమైన వ్యవహారం ఇది. తెలియని అమాయక సోదరులు ఇందులో ఇరుక్కున్నారు. ఒక కుట్రపూరిత వ్యవహారంలో పథకంలో భాగంగా దళిత బిడ్డలు, అమాయకమైన బిడ్డలు ఇరుక్కున్నారు, వాళ్లకిది అర్థంకావాలి, చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. అంతేకాదు, ఆ రోజు 5-4-2010లో తారీఖున జేఏసి మీటింగ్‌లో అన్నయ్య మాట్లాడుతూ, "నేను ఒక నిర్మాత వద్ద ఉండగా, ఆయన సెల్‌ఫోన్‌కు ఒక కాల్ వచ్చింది, ఆయన నాకు చూపించారు, ఆ కాల్ ఎక్కడనుంచి వచ్చిందో ఇక్కడ పేర్లు చెప్పను, కానీ నిర్మాతలు కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు ఉన్నారు, కప్పం కడితేనే తెలంగాణాలో సినిమాలు ఆడ్డానికి అనుమతిస్తున్నారు, డబ్బులు ఇస్తేనే కొత్త సంస్థలు, దుకాణాలు పెట్టుకొనే పరిస్థితి నెలకొంది, తెలంగాణా పేరుతో దోచుకునే వాళ్లే తప్ప, చిత్తశుద్ధి ఉన్న వాళ్లు తక్కువ, అన్నీ తెలిసినా ఆంధ్రా వారు నవ్వుతారనే మనసులో పెట్టుకొన్నా అని చెప్పారు".

ఈ రెండూ మాయ కాదు, వీటిని ఎవరో చెప్పింది కాదు, సాక్షాత్తు టీఆర్ఎస్ నాయకులు చెప్పింది, చాలా గర్వంగా విద్యార్థులు ఎక్కడికెళ్లి వచ్చిండ్రురా భై, ఆకాశం నుండి రాలే మేము డబ్బులు బెట్టి తయారు చేసినం అని అంటుంటే.. ఇంత కుట్రపూరితమైన వ్యవహారంలో అమాయకులైన నా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, నా కొడుకులు, కూతుర్లు ఇరుక్కున్నారు, ప్రాణాలు బలిదానం చేశారు. ప్రాణాలను బలిదానాలు చేసిన వారంతా వీరులు, ఈ సమాజం బిడ్డలు. ఒక దళితుడు వాళ్ల కుటుంబంలో ముందు చదువుకున్న వాడు, బిఏ, బికాం, యంకామో చదవుకొని బయటికి వస్తే, అతన్ని లేకుండా చేశారు. ఇది ఒక పథకం ప్రకారం చేసింది.

(ఈ దశలో కొంత మంది తెలంగాణా రాష్ట్ర సమితి నాయకులు అభ్యంతరం తెలిపారు.)

ముఖ్యమంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను, సీమాంధ్రలో, తెలంగాణాలో జరిగిన ఆత్మహత్యలపైన ఒక కమిటీ వేయమని చెప్పండి అధ్యక్షా. Let them know. అసలు తినడానికి తిండిలేక, కట్టుకోడానికి గుడ్డలేక ఊరి బయట ఉండి, ఇచ్చిన రిజర్వేషన్స్ ద్వారా యూనివర్సిటీకి వచ్చి ఈ మాయ మాటలను నిజమని నమ్మి భయపడి ప్రాణాలను బలిదానాలు చేసిన ఆ అమాయకులను తలచుకుంటే కడుపు తరుక్కుపోతోంది, వారు నా కొడుకు, నా కూతురు. మా ప్రతాపుడు ఒక

మాట చెప్పాడు వీళ్లని మేనేజ్‌మెంట్ స్కిల్స్ అని... కాబట్టి బాధపడుతున్నాం, ఇటువంటి కుట్రలు కుతంత్రాల నుంచి నా వాళ్లను, మా జాతుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది కాబట్టే మాట్లాడుతున్నాం, ఈ రాష్ట్రం ఐక్యంగా ఉండాలని కోరుతున్నాం, పోరాడుతున్నాం.

(ఈ దశలో కొంత మంది సభ్యులు బల్లలు చరచి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు)

MR. DEPUTY SPEAKER : Please conclude.

డా. ఎస్. శైలజానాథ్ : ఇంకా మా గురించి, మా బాధల గురించి చెప్పాల్సింది చాలా ఉంది.

మ. 2.30

(ఈ దశలో కొంత మంది తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యులు అభ్యంతరం తెలిపారు.)

డా.ఎస్. శైలజానాథ్: (తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యులనుద్దేశించి) డిస్టబెన్స్ ఎక్కువగా ఉంది అధ్యక్షా. రేపు మాట్లాడతాను.

MR DEPUTY SPEAKER: Please conclude..

డాక్టర్. ఎస్. శైలజానాథ్: ఇంకా చెప్పుకోవడానికి చాలా అంశాలున్నాయి. సమయం మించిపోతుందంటే రేపు మాట్లాడతాను అధ్యక్షా.

MR DEPUTY SPEAKER: Please sit down. The House is adjourned to meet again at 9-00 a.m. tomorrow.

**(The House then adjourned at 2.31 p.m. to meet again at 9.00 a.m. on Saturday, the 18th January, 2014.)**